www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 27-4-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 11 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం, తిథి: అమావాస్య రా.1.02 తదుపరి పాడ్యమి, నక్షత్రం: అశ్విని రా.12.39 తదుపరి భరణి, వర్జ్యం: రా.9.09-10.33, దుర్ముహూర్తం: సా.4.49-5.40, అమృతఘడియలు: సా.6.21-7.45, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 5.55, సూర్యాస్తమయం: 6.30 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మీకోసం నేనున్నా

మత్స్యకారులకు సీఎం భరోసా

- జీవితాల్లో వెలుగులు తెస్తానని హామీ
- శ్రీకాకుళంలో 'మత్స్యకారుల సేవలో' ప్రారంభం
- 1,29,578 మంది లబ్ధిదారులకు 259 కోట్లు
- ఒక్కొక్కరి ఖాతాలో రూ.20 వేలు జమ
- జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా ప్రణాళికలు
- 550 మత్స్యకార గ్రామాల దశ, దిశ మారుస్తా
- మీ కష్టాలను తెలుసుకునేందుకే వచ్చా
- వైసీపీ ప్రభుత్వం ఒక్కరినీ బాగుచేయలేదు
- పచ్చటి చెట్లు నరకడం.. పరదాలు కట్టడమే
- బుడగట్లపాలెం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈ రోజు మత్స్యకారుల ఖాతాల్లో రూ.259 కోట్లు వేశాను. నేనూ బటన్ నొక్కవచ్చు. కానీ మీ కష్టాలను తెలుసుకునేందుకే ఇక్కడికి వచ్చాను. గత పాలకులు ఇలా పర్యటనకు వచ్చి ఉంటే.. మీ ప్రాంతంలోని కొబ్బరిచెట్లు గోవిందా. చెట్లను నరికేయడం, పరదాలు కట్టేయడం, ఇళ్లల్లో నుంచి బయటకు రానీయకుండా చేయడమే వారి పని. - చంద్రబాబు



శ్రీకాకుళం జిల్లా బుడగట్లపాలెం తీరంలో ఎండబెట్టిన చేపలను పరిశీలిస్తున్న సీఎం

శ్రీకాకుళం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు తీసుకువస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. శనివారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో 'మత్స్యకారుల సేవలో' పథకాన్ని ప్రారంభించారు. సముద్రంలో చేపల వేట విరామం సందర్భంగా మత్స్యకారులకు వేట నిషేధ భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 1,29,578 మంది

మిగతా 13వ పేజీలో...

సరిహద్దు.. ఉద్రిక్తం!

- కాల్పుల విరమణను ఉల్లంఘిస్తున్న పాక్
- హెచ్చరికలు లేకుండానే కాల్పులు
- దీటుగా బదులిస్తున్న భారత సైన్యం
- ఉగ్రవాదుల జాడ కోసం
- జల్లెడ పడుతున్న భద్రతా బలగాలు
- మరో ముగ్గురు ఉగ్రవాదుల ఇళ్ల కూల్చివేత
- ఇద్దరు ఉగ్ర అనుచరుల అరెస్టు

తటస్థ విచారణకు మేం సిద్ధం

- దుస్సాహసానికి దిగితే పాక్ దళాలు సన్నద్ధం
- సింధుపై ఏకపక్ష వైఖరి సరికాదు.. చర్చలకు సై
- పహల్గామ్ విషాద ఘటన: పాక్ ప్రధాని



వాఘా సరిహద్దు మీదుగా పాక్ నుంచి తిరిగొస్తున్న భారతీయులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పహల్‌గామ్ ఉగ్రదాడి అనంతర పరిణామాలతో భారత్- పాక్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పాక్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘించి విచ్చలవిడిగా కాల్పులకు తెగబడుతుండటం, ప్రతిగా కాల్పులతో భారత దళాలు దీటుగా సమాధానం ఇస్తుండటంతో.. ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆందోళన

మిగతా 12వ పేజీలో...

జగన్ పాల్పడిన మద్య పాతకం!

మద్యం కుంభకోణానికి పాల్పడిన వారు కొన్ని వేల కోట్ల రూపాయల సొమ్ము జేబులో వేసుకోవడంతో పాటు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. ఈ కారణంగా దీన్నొక ఆర్థిక నేరంగానే కాకుండా ప్రజల చావుకు కారకులుగా కూడా గుర్తించి కేసు కట్టాల్సిన అవసరం ఉంది.



ఐదేళ్ల పాటు సాగిన ఈ కుంభకోణంలో వేల కోట్ల నగదు లావాదేవీలు జరిగాయి. ప్రభుత్వానికి మద్యం సరఫరా చేసిన లిక్కర్ కంపెనీలు అనూహ్యంగా మద్యం వ్యాపారంతో సంబంధం లేని కంపెనీలకు, సంస్థలకు చెల్లింపులు చేశాయి. ఈ విధంగా జరిగిన చెల్లింపులన్నీ చివరకు 'మూల విరాట్'కే చేరాయి.

అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన జగన్ అండ్ కో హేయమైన పాపాలకు ఒడిగట్టారని ప్రజలకు వివరించగలిగినప్పుడే ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రాథమిక కర్తవ్యాన్ని నెరవేర్చిన వారు అవుతారు. జగన్ రెడ్డిని రాజకీయంగా సీసాలో బంధించడానికి లిక్కర్ కుంభకోణం రాష్ట్ర ప్రభుత్వానికి అందివచ్చిన ఆయుధం.

కొత్త పలుకు 4



అంతా జగన్ ఆదేశాలతోనే

- మద్యం ముడుపులు వైసీపీ ఖాతాల్లోకి చేరేలా ప్రణాళిక
- ఈ వ్యవహారాన్నంతా నడిపిన సూత్రధారి సజ్జల శ్రీధర్ రెడ్డి
- వ్యాపారుల నుంచి ప్రతి నెలా రూ.60 కోట్ల కమీషన్ వసూలు
- అందుకు అంగీకరించని లిక్కర్ బ్రాండ్ల అణచివేత
- ఎస్పీవై ఆగ్రోస్ పునరుద్ధరించి మిథున్‌రెడ్డితో వ్యాపారం
- అక్కడినుంచే నల్లధన ప్రవాహం
- సజ్జల శ్రీధర్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో సిట్ వెల్లడి

2

చతుర్థ వర్ధంతి



కీ॥శే॥ శ్రీమతి వేమూరి కనకదుర్గ గారు

(డైరెక్టర్ -ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి)

జననం : 14.07.1958 - మరణం : 27.04.2021

విధి మనుషుల్ని దూరం చేస్తుంది...
మనసుల్ని కాదు !
కాలం గాయాల్ని మాన్పుతుంది...
జ్ఞాపకాల్ని కాదు !!

- వేమూరి రాధాకృష్ణ
మరియు కుటుంబ సభ్యులు

కొంచెమైనా బుర్రపెట్టి ఆలోచించాలిగా!

- విష్ణుకుమార్‌రాజుపై గంటా శ్రీనివాసరావు ఫైర్
- తనకు తెలియకుండా కలెక్టర్‌కు లేఖ ఇవ్వడంపై ఆగ్రహం
- ఫిల్మ్ క్లబ్‌కు భూ కేటాయింపు అంశంపై వివాదం
- పొరపాటైందంటూ క్షమాపణ చెప్పిన విష్ణుకుమార్‌రాజు



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుపై టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నడిరోడ్డుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యేనైన తనకు తెలియకుండా వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ (ఫిల్మ్ క్లబ్)కు భూమి కేటాయింపుపై ఆరుగురు ఎమ్మెల్యేలతో సంతకాలు చేయించి జిల్లా కలెక్టర్‌కు ఎలా ఇచ్చారంటూ నిలదీశారు. దీంతో పొరపాటైందంటూ విష్ణుకుమార్‌రాజు క్షమాపణ చెప్పారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం(జీవీఎంసీ) వద్ద శనివారం జరిగిందీ ఘటన. జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మాన నోటీసు నేపథ్యంలో శనివారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి ఎక్స్‌అఫీషియో సభ్యుల హోదాలో వీరిద్దరూ హాజరయ్యారు. సమావేశం ముగిశాక తన కారు ఎక్కుతున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పలకరించారు. దీంతో గంటా ఆయనపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 'లోకల్ ఎమ్మెల్యేను. నాకు తెలియకుండా ఫిల్మ్ క్లబ్ కోసం లెటర్ ఎలా ఇస్తారు. ఏం మెసేజ్ ఇవ్వాలనుకుంటున్నారు. వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టి గోలగోల చేస్తున్నారు' అని గంటా పేర్కొన్నారు. దీంతో 'సార్..సార్ అదేం లేదు. సీఎం దృష్టికి తీసుకువెళదామనే ఉద్దేశంతో..' అని విష్ణుకుమార్‌రాజు వివరణ ఇచ్చే ప్రయత్నం చేయగా.. 'సీఎంకు కాకపోతే పీఎంకి ఇచ్చుకో. కానీ, లోకల్ ఎమ్మెల్యేనని కనీసం గుర్తించకుండా లెటర్ ఎలా ఇచ్చావు. సీనియర్ ఎమ్మెల్యేవి. దీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నోడివి. కొంచెమైనా బుర్రపెట్టి ఆలోచించాలి కదా!' అని గంటా ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఎవరి లిమిట్స్‌లో వాళ్లు ఉండాలి. మీరు వేరే పార్టీలో ఉంటే ఏది మాట్లాడినా పర్వాలేదు. కలిసి వెళుతున్నాం కదా! మీరు లెటర్ ఇవ్వగానే ఇదీ విష్ణుకుమార్‌రాజు పవర్ అంటూ.. అని ఎవడో వాట్సాప్‌లో పోస్ట్ చేశాడు. దీనికి ఏం సమాధానం చెప్పాలి' అని గంటా నిలదీశారు. ఎవరు పోస్టు చేశారని విష్ణుకుమార్‌రాజు ప్రశ్నించగా.. 'ఎవరో ఒక బేవర్స్‌గాడు ఉన్నాడు కదా!' అని గంటా విసురుగా తల తిప్పుకుని, కారు పోనివ్వాలంటూ డ్రైవర్‌ను ఆదేశించారు. కాగా, 'ఇది ఇంటర్నల్ ఇష్యూ' అంటూ విష్ణుకుమార్‌రాజు మీడియా ఎదుట దాటవేసే ప్రయత్నం చేశారు. వైజాగ్ ఫిల్మ్ క్లబ్‌కు గతంలో ప్రభుత్వం కాపులుప్పాడ వద్ద ఐదెకరాలు కేటాయించిందని, అందులో 33 ఏళ్ల లీజు అనే ప్రస్తావన లేకపోవడంతో సరిదిద్దాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. పొరపాటున స్థానిక ఎమ్మెల్యే గంటాకు ఈ విషయం చెప్పలేదని, అందుకు క్షమాపణ కోరుతున్నానని తెలిపారు.

స్టార్ హోటళ్ల బార్ లైసెన్స్ ఫీజు తగ్గింపు

అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): త్రీస్టార్, అంతకంటే పెద్ద హోటళ్లలోని బార్ల లైసెన్స్ ఫీజును తగ్గిస్తూ ఎక్సైజ్ శాఖ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం రూ.66.55 లక్షలుగా ఉన్న లైసెన్స్ ఫీజును రూ.25 లక్షలకు తగ్గిస్తున్నట్లు పేర్కొంది. ఈ ఉత్తర్వులు ఈ ఏడాది సెప్టెంబరు నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 హోటళ్లలో బార్ల లైసెన్స్ ఫీజులు తగ్గనున్నాయి.

మూడు రోజుల పోలీసు కస్టడీకి పీఎస్ఆర్

విజయవాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానిని అక్రమ కేసులతో వేధించిన కేసుల్లో సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును పోలీసు కస్టడీకి ఇస్తూ విజయవాడ మూడో అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు శనివారం ఉత్తర్వులు ఇచ్చింది. పీఎస్ఆర్ ఆంజనేయులును ఆదివారం నుంచి మంగళవారం వరకు పోలీసు కస్టడీకి ఇస్తూ న్యాయాధికారి పి.తిరుమలరావు తీర్పును వెలువరించారు.

ఫైళ్ల దహనం కేసులో ఇక తుకారాం వంతు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఫైళ్ల దహనం కేసులో సీఐడీ దూకుడు పెంచింది. ఈ ఘటన వెనుక ఉన్న మరో ముఖ్యమైన వ్యక్తి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యక్తిగత కార్యదర్శి తుకారాంను పట్టుకునేందుకు చర్యలు ప్రారంభించింది. విదేశాల నుంచి తీసుకురావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

బాధితుల మొర వింటూ ఫిర్యాదు రాసిచ్చేస్తుంది

- నేరాన్ని బట్టి ఎఫ్ఐఆర్‌లో చేర్చాల్సిన సెక్షన్లూ చెప్పేస్తుంది
- క్రైమ్ సీన్‌లో ఆధారాల సేకరణ నుంచి దర్యాప్తు దారి చెబుతుంది
- డిఫెన్స్ లాయర్ ఏమి వాదిస్తారో చెబుతూనే కౌంటర్ సూచిస్తుంది
- ఏలూరులో ట్రయల్ సక్సెస్... త్వరలో 175 పీఎస్‌లలో అందుబాటులోకి



అత్యాధునిక సాంకేతికతతో ప్రజలకు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా సేవలను అందించాలన్న చంద్రబాబు లక్ష్యాన్ని ఏపీ పోలీసులు అందిపుచ్చుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో 'టెక్నాలజీ పోలీస్'గా ఎదగడానికి అడుగులు వేస్తున్నారు.

ఇక.. ఏఐ పోలీస్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను అందిపుచ్చుకుంటోంది. బాధితుడి ఫిర్యాదు నుంచి కోర్టులో చార్జిషీట్ వరకూ అంతా ఏఐ తోనే అని అంటోంది. ఏఐ ప్రపంచాన్ని ఏలుతున్న కాలమిది. దానిని ముందుగా అందింపుచ్చుకున్న వారిదే ఆ రంగంలో విజయం. ఆంధ్ర పోలీస్ తన సత్తాను చాటడానికి ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. నిన్నటి వరకూ ఏలూరు జిల్లాలోని ఓ స్టేషన్‌కు పరిమితమైన ట్రయల్ రన్‌ను ఇప్పుడు మరిన్ని పోలీస్ స్టేషన్లకు విస్తరిస్తున్నారు.

మార్పు బాటలో జైళ్ల శాఖ...

జైళ్ల శాఖ సైతం ఏఐని సమకూర్చుకుంటోంది. జైలు రక్షణ, ములాఖతును సరళతరం చేయడం, బంధువులతో ఖైదీ మాట్లాడుకోవడానికి వీడియో కాల్, ఆన్‌లైన్‌లో కోర్టు వాయిదాలకు వంటివన్నీ ఇకపై ఏఐ సాయంతో నిర్వహించేందుకు సమాయాత్తమైంది. సీఎం చంద్రబాబు రెండు రోజుల క్రితం నిర్వహించిన ఐటీ సమావేశంలో జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్ పై అంశాలను వివరించారు. ఏఐతో ప్రతి ఖైదీ వారానికి రెండు సార్లు... మొత్తం పది నిమిషాలు వీడియో కాల్ మాట్లాడుకునే అవకాశం కల్పించబోతున్నారు. కుటుంబ సభ్యుల నంబర్ ఖైదీ చెబితే ఒక రోజు ముందే ఆ నంబర్‌కు ఏఐ సందేశం పంపుతుంది. మీకు జైలు నుంచి వీడియో కాల్ వస్తుంది. ఫోన్ చార్జింగ్, నెట్‌వర్క్ సరిగ్గే ఉండేలా చూసుకోవాలని చెబుతుంది. అలాగే, జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న ఖైదీలను కోర్టు వాయిదాలకు తీసుకెళ్లాలంటే సిబ్బంది, సెక్యూరిటీ, వాహనం... అదంతా పెద్ద ప్రయాస. ఇకపై వాయిదా రోజు ఏ కోర్టులో హాజరు పరచాల్సి ఉందో ఆ కోర్టుకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఖైదీని చూపించి పేరు చెబుతారు. దీంతో వ్యయ ప్రయాసలు తగ్గుతాయి. సమయం కలిసొస్తుంది.

అధునాతన ఏఐ.. తక్కువ ఖర్చుతో..

అప్‌డేటెడ్ వెర్షన్ ఏఐని తక్కువ ధరకు సమకూర్చే వారితో ఒప్పందం చేసుకుని మే నుంచి అందుబాటులోకి తెస్తామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా చెప్పారు. ఈ బాధ్యతలను ఆయన శాంతి భద్రతల ఏజీ సిద్ధార్థ్ కౌశల్‌కు అప్పగించారు.

ఏఐ ఏం చేస్తుంది?

పోలీస్ స్టేషన్లలో రైటర్లు ఒక మూసధోరణిలో ఫిర్యాదులను రాయడానికి అలవాటు పడి ఉంటారు. ఆ ఫిర్యాదు చాలా సందర్భాల్లో బాధితునికే అర్థం కాదు. విచారణకు వచ్చే సమయానికి బాధితునికి తన బాధ తప్ప ఫిర్యాదులోని రాత గుర్తుండదు. కొన్ని సందర్భాలలో ఫిర్యాదుదారు చెప్పిన దానికి రైటరు రాసిన దానికీ సంబంధమే ఉండదు. మరికొన్ని సార్లు బాధితుడు రాసిచ్చిన ఫిర్యాదు ఎఫ్ఐఆర్ దశకు వచ్చేసరికి మారిపోతుంది. దీనితో కోర్టుల్లో వీగిపోయే కేసుల సంఖ్య పెరుగుతుంది. దీనిని సరిచేసుకోవడానికి ఏఐ చక్కగా ఉపయోగపడుతుందని గ్రహించిన ఏపీ పోలీస్... ఆ వైపు అడుగులు వేసింది. ప్రయోగాత్మకంగా ఏలూరు జిల్లాలో 'స్మార్ట్ పోలీస్.ఏఐ' పేరుతో ఏఐని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇది బాధితులు చెప్పే విషయాన్ని శ్రద్ధగా వింటుంది. దానిని యథాతథంగా తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో... ఎంచుకున్న భాషలో టైప్ చేస్తుంది. ఎఫ్ఐఆర్‌లో ఏ సెక్షన్లు నమోదు చేయాలో దర్యాప్తు అధికారికి సూచిస్తుంది. ఫిర్యాదుదారు సంతకం చేసి ఇచ్చిన వెంటనే ఏఐ అప్లికేషన్లో కనిపించే సమ్మరీపై క్లిక్ చేస్తే చాలు... నేరం జరిగిన చోటుకు వెళ్లి సేకరించాల్సిన ఆధారాలు మొదలుకొని ప్రతిదీ దిశా నిర్దేశం చేస్తుంది. ఫోరెన్సిక్ టిప్స్, ప్రాసిక్యూషన్ టిప్స్, ఇన్‌స్ట్రక్షన్స్ టూ ఐవో... ఇలా పలు ఆప్షన్లు దీనిలో అందుబాటులో ఉంటాయి. చార్జిషీటు దాఖలులో సహాయపడే ఏఐ ఎక్కడైనా లోపాలున్నా, ఆధారాల సేకరణ సరిగా లేకున్నా అప్రమత్తం చేస్తుంది. ఇంతటితో ఆగిపోకుండా కోర్టులో వినిపించాల్సిన వాదనలు, డిఫెన్స్ లాయర్ వాదనల్ని ఎదుర్కోవాల్సిన తీరు తెన్నుల పైనా మార్గదర్శకత్వం చేస్తుంది. ఫలితంగా శిక్షల శాతం పెరిగి బాధితులకు స్వాంతన లభిస్తుంది. నేరాలు తగ్గుముఖం పడతాయి.

తొలి దశలో 175 స్టేషన్లలో: డీజీపీ

రాష్ట్రంలో 1,019 పోలీసు స్టేషన్లు ఉన్నాయి. మొదటి దశలో 175 పోలీసు స్టేషన్లలో వచ్చే నెలలో అమలుకు పోలీసు శాఖ చర్యలు మొదలు పెట్టింది. ప్రతి జిల్లాలోనూ 30 నుంచి 35 స్టేషన్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. దీనిని దశలవారీగా అన్ని స్టేషన్లకూ విస్తరించనున్నట్లు తెలిపారు.

లోకం తీరు



సిట్ కస్టడీలో మరో ఇద్దరు నెయ్యి కల్తీ నిందితులు

- మొత్తంగా ఆరుకు చేరిన అరెస్టులు

తిరుపతి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో ఇద్దరు నిందితులను విచారణ నిమిత్తం సిట్ అధికారులు జ్యుడిషియల్ కస్టడీ నుంచి తమ కస్టడీకి తీసుకున్నారు. ఈ కేసులో తొలుత నలుగురు నిందితులను అరెస్టు చేసిన సిట్ బృందం తర్వాత మరో ఇద్దరిని అరెస్టు చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకూ అరెస్టయిన వారి సంఖ్య ఆరుకు చేరింది. ఈ ఏడాది జనవరిలో నలుగురిని అరెస్టు చేయగా.. కేసు దర్యాప్తులో భాగంగా ఇద్దరిని నెల కిందట అరెస్టు చేసినట్టు సమాచారం. ఏ12 హరిమోహన్, ఏ15 ఆశిష్ అగర్వాల్‌లను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు తెలిసింది. హరిమోహన్ భోలేబాబా డెయిరీ సీజీఎం అని, ఆశిష్ అగర్వాల్ నెయ్యి తయారీకి వినియోగించే ముడి పదార్థాల సరఫరా వ్యాపారం చేస్తున్నారని తెలిసింది. వీరిని విచారించేందుకు సిట్ అధికారులు నెల్లూరు ఏసీబీ కోర్టులో పిటిషన్ వేయగా.. 24 నుంచి 28 వరకూ... సిట్ కస్టడీకి అప్పగించేందుకు కోర్టు అనుమతిచ్చింది. తిరుపతి సిట్ కార్యాలయంలో వారిని విచారిస్తున్నట్టు తెలిసింది. 28 సాయంత్రం లేదా 29 ఉదయం గానీ వీరిని తిరిగి జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించనున్నట్టు తెలిసింది. వీరి అరెస్టును సిట్ అధికారులు గుట్టుగా ఉంచడం గమనార్హం. తొలుత అరెస్టయిన నలుగురి తరఫున హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలైంది. వచ్చేవారం కోర్టు విచారించే అవకాశముంది.

వేలానికి మాజీ ఎంపీ బుట్టా ఆస్తులు

- ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ నుంచి రూ.310 కోట్ల రుణం
- ఐదేళ్లుగా నెలవారీ కంతులు కట్టని బుట్టా రేణుక దంపతులు



కర్నూలు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ బుట్టా రేణుక దంపతుల ఆస్తుల వేలానికి రంగం సిద్ధమైంది. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్) నుంచి బుట్టా రేణుక, ఆమె భర్త నీలకంఠ రూ.310 కోట్లు రుణం తీసుకున్నారు. వీరికి హైదరాబాద్‌లో వ్యాపార, విద్యాసంస్థలు ఉన్నాయి. బుట్టా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, బుట్టా కన్వెన్షన్ సర్వీసెస్ లిమిటెడ్, మెరిడియన్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ కార్యకలాపాల కోసం 15 ఏళ్ల కాలవ్యవధిలో వడ్డీ, అసలు చెల్లించేలా 2018లో ఈ రుణం తీసుకున్నారు. మొదట్లో నెల కంతుల కింద రూ.40 కోట్లు చెల్లించారు. ఆ తర్వాత వాయిదాలు చెల్లించకపోవడంతో, ఇచ్చిన అప్పు అసలు, వడ్డీ కలిపి రూ.340 కోట్లకు చేరింది. ఒప్పందం ప్రకారం ప్రతి నెలా రూ.3.40 కోట్లు చొప్పున ఈఎంఐ చెల్లించాల్సి ఉంటుంది. వడ్డీ భారం అధికంగా ఉందని, కొన్ని ఆస్తులు విక్రయించి రుణాన్ని రీషెడ్యూల్ చేయాలని బుట్టా దంపతులు కోరినట్లు సమాచారం. వారి ప్రతిపాదనను ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ అధికారులు తిరస్కరించారు. గత ఐదేళ్ల నుంచి రుణం చెల్లింపులో విఫలం కావడంతో బెంగళూరు బ్రాంచి అధికారులు పలుమార్లు నోటీసులు పంపారు. స్పందన లేకపోవడంతో చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. అప్పు వసులులో భాగంగా కేసు నమోదు చేశారని తెలిసింది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో బుట్టా దంపతులకు చెందిన రూ.145 కోట్లు విలువ చేసే 5వేల గజాల ఆస్తిని వేలం వేయగా.. కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. మాదాపూర్‌లో 7,205 గజాల విస్తీర్ణం ఉన్న బుట్టా కన్వెన్షన్‌ను వేలం వేస్తే.. ఇక్కడ కూడా స్పందన లేదు. వాస్తవానికి భారీ డిమాండ్ ఉన్న ఆస్తులివి. అయినా కూడా బుట్టా రేణుక రాజకీయాల్లో ఉండటంతోనే వేలంలో పాడుకుంటే ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో ఎవరూ ముందుకు రాలేదని చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో అప్పు రాబట్టుకోవడానికి హెచ్ఎఫ్ఎల్ సంస్థ మరోసారి ఆస్తుల వేలానికి సిద్ధమవుతోందని సమాచారం. బుట్టా రేణుక స్పందిస్తూ ఆర్థిక వ్యవహారాలు తన భర్త చూసుకుంటారని, రుణం విషయంలో వేలానికి వచ్చినట్లు మాత్రమే తెలిసిందని, అంతకుమించి తెలియదని చెప్పారు.

అంతా జగన్ ఆదేశాలతోనే..

- మద్యం ముడుపులు వైసీపీ ఖాతాల్లోకి చేరేలా ప్రణాళిక
- సూత్రధారి సజ్జల శ్రీధర్ రెడ్డి రిమాండ్ రిపోర్టులో సిట్ వెల్లడి



అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం స్కాం మాజీ సీఎం జగన్ ప్రత్యక్ష మార్గదర్శకత్వంలో సాగిందని, లిక్కర్ మాఫియా నుంచి అందిన నిధులను వైసీపీ ఖాతాల్లోకి మళ్లించారని సిట్ తేల్చింది. నాసిరకం మద్యంతో కంపెనీలూ వాటి నుంచి కమీషన్ల రూపంలో వైసీపీ పెద్దలూ వేల కోట్లు ఎలా దోచుకున్నారనేది కోర్టుకు తెలిపింది. వసూళ్లకు ప్రణాళిక రచించి, సొంతంగా మద్యం వ్యాపారం నిర్వహించింది ఎస్పీవై ఆగ్రోస్ అధినేత సజ్జల శ్రీధర్ రెడ్డియేనని (ఏ-6) తేల్చింది. ఎంపీ మిథున్ రెడ్డికి భాగస్వామిగా మద్యం స్కాంలో కీలకంగా వ్యవహరించారని తెలిపింది. ఈ కేసులో శ్రీధర్‌రెడ్డిని శనివారం విజయవాడ కోర్టులో ప్రవేశపెట్టారు. కుంభకోణంలో ఆయన పాత్రపై రిమాండ్ రిపోర్ట్‌లో వివరించారు. సంతకం చేసేందుకు నిందితుడు నిరాకరించడంతో మధ్యవర్తుల సమక్షంలో రికార్డు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే హైదరాబాద్, విజయవాడలో జరిగిన సమావేశాల్లో చర్చలు, మద్యం మాఫియా ఏర్పాటుకు వ్యూహం, అమలు, వసూళ్లు, నిధుల సమీకరణ, షెల్ కంపెనీల వివరాలు, నల్ల డబ్బు ప్రవాహం, జగన్ మార్గనిర్దేశకత్వం వరకూ అన్ని వివరాలు సిట్ వెల్లడించింది. ఈ రిపోర్టును అనుసరించి..

మాఫియాకు వ్యూహం...

వైసీపీలోని పెద్ద నాయకుడికి మొత్తం ప్రణాళిక వివరించి ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వహణకు ఏపీఎస్‌బీసీఎల్‌కు అధికారం ఇస్తూ కొత్తగా జీవో జారీ చేయించా రు. బాధ్యతలు నిర్వర్తించేందుకు నమ్మకస్థులైన వాసుదేవ రెడ్డి, సత్య ప్రసాద్‌ను కీలక స్థానాల్లో నియమించారు. రాష్ట్రంలో మద్యం విక్రయాల సాఫ్ట్‌వేర్‌ను యాభైశాతం మేర రద్దు చేసి, మాన్యువల్ ఆర్డర్ ఫార్మ్ వ్యవస్థను తెచ్చారు. నగదు చెల్లింపులకు ప్రాధాన్యం ఇచ్చారు. మరోవైపు డిస్టిలరీలు, సరఫరాదారులతో శ్రీధర్‌రెడ్డి సమావేశమై మార్కెట్ షేర్, లేబుల్ ఆమోదాల కోసం లంచాల గురించి వివరించారు. అందుకు తలూపని వారిని పక్కన బెట్టారు.

నెలకు 60 కోట్ల ముడుపులకు ప్లాన్

ప్రతి నెలా 60 కోట్లకు తగ్గకుండా ఐదేళ్ల పాటు వసూలు చేసిన మద్యం ముడుపుల ప్రణాళిక సహా పలు వ్యవహారాల్లో శ్రీధర్‌రెడ్డి ప్రధాన కుట్రదారు అని తేల్చింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే హైదరాబాద్‌లోని కసిరెడ్డి కార్యాలయంలో సమావేశం జరిగింది. ఏపీ మద్యం వ్యాపారులతో జరపాల్సిన చర్చలు, అడగాల్సిన కమీషన్ల శాతం ఖరారు చేశారు. ఆ తర్వాత వైసీపీకి చేకూర్చాల్సిన ఆదాయంపై సుదీర్ఘంగా చర్చించారు. మద్యం వ్యాపారులను పలుమార్లు స్టార్ హోటళ్లకు, ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లకు పిలిపించి 12 శాతం కమీషన్ డిమాండ్ చేశారు. అంతిమంగా జూన్ 2019లో పార్క్ హయత్ హోటల్‌లో కసిరెడ్డి, ఆయన బామ్మర్ది ముప్పిడి అవినాశ్‌రెడ్డి అలియాస్ సుమిత్, కొందరు డిస్టిలరీస్ ప్రతినిధులతో కలిసి శ్రీధర్‌రెడ్డి ప్రణాళిక రూపొందించారు. అక్టోబరు 2019లో అప్పటి వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి నివాసంలో(జూబ్లీహిల్స్) కీలక సమావేశం జరిగింది. కేంద్ర సర్వీసులకు చెందిన వాసుదేవరెడ్డి (తర్వాత ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ అయ్యారు), సత్యప్రసాద్(ఏపీఎస్‌బీసీఎల్ స్పెషల్ ఆఫీసర్), కసిరెడ్డి, మిథున్‌రెడ్డి పాల్గొన్నారు. జూన్-అక్టోబరు మధ్య మద్యం వ్యాపారులతో జరిపిన చర్చల సారాంశాన్ని విశ్లేషించుకుని, కమీషన్లకు అంగీకరించని లిక్కర్ బ్రాండ్ల అణచివేత, అంగీకరించిన వాటికి ప్రోత్సాహం, కమీషన్ల విధానం అంశాలపై నిర్ధారణకు వచ్చారు.

అరబిందో అప్పులో మిథున్‌కి లబ్ధి.. 2019లో అప్పటి సీఎం జగన్ సూచన మేరకు అరబిందో గ్రూపు కంపెనీలు ఎస్పీవై ఆగ్రోస్ పునరుద్ధరణకు రూ.45 కోట్లు సమకూర్చాయి. లిక్కర్ సరఫరాకు కొత్తగా పుట్టుకొచ్చిన ఆదాన్ సంస్థకు మరో రూ.60 కోట్లు అందాయని శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. వాస్తవానికి ఎస్పీవై ఆగ్రోస్‌కు అరబిందో నుంచి అందిన నిధులు 37కోట్లు మాత్రమేనని, మిగతా రూ.8 కోట్లు ముడుపుల రూపంలో ఎంపీ మిథున్‌రెడ్డి సహా వైసీపీ ప్రముఖులకు చేరాయని తెలిపారు. అరబిందో అప్పులో రూ.5 కోట్లను మిథున్‌రెడ్డికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్, డి-కార్డ్ లాజిస్టిక్స్, సన్హాక్ ల్యాబ్స్ వంటి వాటిలోకి దారిమళ్లించినట్లు చెప్పేశారు. అయితే భవిష్యత్తులో ఇబ్బంది రాకుండా మిథున్‌రెడ్డి ఆ డబ్బులు వెనక్కి ఆన్‌లైన్‌లో చెల్లించి తర్వాత నగదు రూపంలో తీసుకున్నారు. అయితే అరబిందో నుంచి తీసుకున్న డబ్బులు ప్రతి నెలా కోటి చొప్పున 2022 వరకూ చెల్లించిన శ్రీధర్ రెడ్డి, ఆ తర్వాత అంతర్గత విభేదాలతో బయటికి వెళ్లిపోయి చెల్లించలేదు. అప్పటి నుంచి ఎస్పీవై ఆగ్రోస్ యజమానిగా తాను లేనని చెప్పినట్లు సిట్ వెల్లడించింది.

షెల్ కంపెనీలు, నల్ల డబ్బు ప్రవాహం...

ఎస్పీవై ఆగ్రోస్ నుంచి ఓల్విక్, కృపతి, నైస్నా, బాలాజీ ట్రేడింగ్, వెంకటేశ్వర ప్యాకేజింగ్, విశాల్ ఎంటర్‌ప్రైజెస్ వంటి షెల్ కంపెనీలు లావాదేవీలు జరిపినట్లు సిట్ విచారణలో శ్రీధర్‌రెడ్డి వివరించారు. వాటి ద్వారా చెల్లింపులు జరిపి అక్కడి నుంచి మద్యం మాఫియా చలామణి కొనసాగించినట్లు కోర్టుకు సిట్ నివేదించింది. శ్రీధర్‌రెడ్డి చెప్పిన దాని ప్రకారం మొత్తం ప్రణాళిక జగన్ మార్గదర్శకత్వంలోనే కొనసాగిందని సిట్ స్పష్టం చేసింది. మద్యం మాఫియా నుంచి సేకరించిన నిధులు వైసీపీ ఖాతాల్లోకి మళ్లినట్లు శ్రీధర్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో పేర్కొంది.

జైలుకు సజ్జల శ్రీధర్‌రెడ్డి

లిక్కర్ స్కామ్ కేసులో మే 6వరకు రిమాండ్

విజయవాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మద్యం కుంభకోణం కేసులో ఎస్పీవై డిస్టిలరీస్ అధినేత సజ్జల శ్రీధర్‌రెడ్డికి కోర్టు రిమాండ్ విధించింది.ఈ కేసులో శ్రీధర్‌రెడ్డిని ఏ6గా సిట్ పేర్కొంది. అంతకుముందుగా, ఆయనకు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు హాజరుపరిచారు. శ్రీధర్‌రెడ్డికి మే ఆరో తేదీ వరకు న్యాయాధికారి పి.భాస్కరరావు రిమాండ్ వెల్లడించారు. అనంతరం ఆయనను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

కొడుకు కాదు..రాక్షసుడు!


అప్పలనాయుడు, జయ — రాజశేఖర్

- చెల్లికి ఆస్తి పంచారని అమ్మానాన్నను చంపేశాడు
- ట్రాక్టర్‌తో వారి పైకి దూసుకెళ్లిన కుమారుడు
- తీవ్రగాయాలతో దంపతుల మృతి
- విజయనగరం జిల్లాలో దారుణం

పూసపాటిరేగ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రక్తం పంచుకు పుట్టిన చెల్లెలికి ఆస్తి పంచితే తట్టుకోలేకపోయాడు! కళ్లలో పెట్టుకుని కాపాడుకోవాల్సిన తల్లిదండ్రులతో కొన్నాళ్లుగా ఆస్తి విషయమై గొడవపడుతున్నాడు. సోదరి వాటా పొలాన్ని ధ్వంసం చేసేందుకు సిద్ధమైన తనను అడ్డుకున్నందుకు కని పెంచిన అమ్మానాన్ననే అంతమొందించాడు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చల్లవాని తోట పంచాయతీకి చెందిన పాండ్రంకి అప్పలనాయుడు (55), జయ (45) భార్యాభర్తలు. వీరికి కుమారుడు రాజశేఖర్, కుమార్తె రాధాకుమారి ఉన్నారు. ఇద్దరికీ వివాహమైంది. రాధాకుమారికి వివాహమైన కొద్ది రోజులకే భర్త మృతి చెందాడు. ఆమెకు ఆర్థిక ఆసరా అవసరమని భావించిన తల్లిదండ్రులు తమ 80 సెంట్ల భూమిలో 20 సెంట్లను గతంలో రాసి ఇచ్చారు. ఈ మధ్యకాలంలో మరో 30 సెంట్లను కూడా ఆమెకు రాసినట్టు తెలుసుకున్న రాజశేఖర్ నిత్యం తల్లిదండ్రులతో గొడవ పడుతున్నాడు. శనివారం ఎక్స్‌కవేటర్‌తో పొలాన్ని తవ్వుతుండగా తల్లిదండ్రులు అడ్డుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన రాజశేఖర్ ట్రాక్టర్‌తో తల్లిదండ్రులను ఢీకొట్టేందుకు యత్నించగా, పక్కనున్న మొక్కజొన్న తోటలోకి పరిగెత్తి దాక్కొనేందుకు ప్రయత్నించారు. అయినా రాజశేఖర్ ఆగకుండా వారిపైకి ట్రాక్టర్‌తో దూసుకెళ్లడంతో తీవ్ర గాయాలపాలైన అప్పలనాయుడు, జయ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సీఐ రామకృష్ణ, ఎస్ఐ దుర్గాప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

దేశాభివృద్ధిలో ఏయూ పాత్ర కీలకం

- ఉన్నత విద్యలో వేగంగా మార్పులొస్తున్నాయి
- దానికి అనుగుణంగా కోర్సులు డిజైన్ చేయాలి
- ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.మధుమూర్తి
- వర్సిటీ అభివృద్ధికి సహకరించేందుకు సిద్ధం
- పాలక్కాడ్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శేషాద్రి శేఖర్
- ఏయూకి, మాకు మధ్య పోటీ లేదు: ఎంపీ శ్రీభరత్
- ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకలు ప్రారంభం


ఏయూ శతాబ్ది వేడుకల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మధుమూర్తి. చిత్రంలో ప్రొఫెసర్ శేషాద్రి శేఖర్, ఎంపీ ఎం.శ్రీభరత్, వీసీ జీపీ రాజశేఖర్

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించిందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.మధుమూర్తి అన్నారు. విశాఖ బీచ్‌రోడ్డులోని కన్వెన్షన్ హాల్‌లో ఏయూ శతాబ్ది ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథి మధుమూర్తి మాట్లాడుతూ ఎంతోమంది శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, విభిన్న రంగాలకు చెందినవారిని ఏయూ దేశానికి అందించిందని గుర్తుచేశారు. తన కుటుంబంలోని మూడు తరాలు ఇక్కడే చదువుకోవడం, అదే వర్సిటీ శతాబ్ది ఉత్సవాలకు హాజరుకావడం గర్వంగా ఉందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్నత విద్యలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, అందుకు అనుగుణంగా పాఠ్య ప్రణాళిక మార్చడంతో పాటు నూతన కోర్సులు డిజైన్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యాసంస్థల్లో డిజిటలైజేషన్, స్కిల్లింగ్, టెక్నాలజీని తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని, అందుకు అనుగుణంగా పెట్టుబడులు పెడుతోందని వివరించారు. గౌరవ అతిథి పాలక్కాడ్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శేషాద్రి శేఖర్ మాట్లాడుతూ ఏయూ పూర్వ విద్యార్థినైన తాను వందేళ్ల వేడుకల ప్రారంభోత్సవానికి రావడంపై సంతోషం వ్యక్తంచేశారు. వర్సిటీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ ఏయూ పట్ల అందరికీ కేర్, ఎమోషన్ ఉందని, వర్సిటీ పూర్వ వైభవం సాధించే దిశగా ప్రతిజ్ఞకరూ కృషి చేయాలని కోరారు. ఏయూకు, తమకు (గీతం వర్సిటీ) మధ్య పోటీ లేదని స్పష్టంచేశారు. ఏయూ చచ్చిపోతే గీతం బాగుంటుందని తాము భావిస్తున్నట్టు ప్రచారం చేస్తున్నారని, అసలు ఏయూకు, గీతంకు మధ్య పోటీలేనప్పుడు ఇటువంటి పోలికలు ఎందుకని ఎంపీ ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏయూ వీసీ జీపీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు, రెక్టార్ కిశోర్‌బాబు, వివిధ కాలేజీల ప్రిన్సిపాళ్లు, ఫ్యాకల్టీ సభ్యులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూ శతాబ్ది వేడుకలకు సంబంధించిన విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. అంతకుముందు ఉదయం బీచ్ రోడ్డులో వాకథాన్ నిర్వహించారు.

ఇన్‌స్టా లింకు.. రూ.2.46 కోట్లకు బురిడీ!

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడిన మహిళ

- 'తక్కువ పెట్టుబడి.. ఎక్కువ ఆదాయం' పేరిట వల
- నెల్లూరులో ఏడుగురు సభ్యుల ముఠా అరెస్టు


సైబర్ నేరగాళ్ల వివరాలను వెల్లడిస్తున్న నెల్లూరు ఎస్పీ కృష్ణకాంత్, వెనుక నిందితులు (ముసుగులో)

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 'తక్కువ నగదు పెట్టుబడిగా పెట్టండి. ఎక్కువ ఆదాయం పొందండి' అంటూ ఫోన్లలో మాటలు కలిపి నమ్మించి రూ.కోట్లు దోచేస్తున్న ఓ అంతరాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠాను నెల్లూరు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వివరాలను శనివారం నెల్లూరు ఎస్పీ కృష్ణకాంత్ విలేకరులకు వెల్లడించారు. నగరంలోని పొగతోటకు చెందిన లలితకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు సంబంధించిన లింక్ రావడంతో క్లిక్ చేశారు. వెంటనే నిషాబను అనే మహిళ ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు సంబంధించిన సూచనలు, సలహాలు ఇచ్చి లాభాలు వచ్చేలా చేస్తామని నమ్మించి, ఓ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించింది. పెద్ద మొత్తంలో పెట్టుబడి పెడితే రెట్టింపు వస్తుందని చెప్పడంతో లలిత అప్పుచేసి ఈ ఏడాది జనవరి 23 నుంచి ఫిబ్రవరి 3 వరకు పలు దఫాలుగా రూ.2,46,30,396 డిపాజిట్ చేశారు. ఆ తర్వాత లలిత ఖాతాలో రూ.4,02,24,759 నగదు ఉన్నట్లు సైబర్ నేరగాళ్లు చూపించారు. ఆ నగదు డ్రా చేసుకొనేందుకు ఆమె ప్రయత్నించగా నగదు రాకపోవడంతో బాధితురాలు ఈ గత నెల 9న చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా చెన్నై, హైదరాబాద్, రాజస్థాన్ ప్రాంతాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. రాజస్థాన్‌కు చెందిన రామారామ్, అతని అనుచరులైన గోగారామ్, హేమత్‌కుమార్, కైలాష్, నాగారాం, తెలంగాణాలోని హైదరాబాద్‌కు చెందిన వీరేశ్వరరావు, ఎం.రవిని నిందితులుగా గుర్తించారు. ఈ నెల 25న రాజస్థాన్‌కు చెందిన ఐదుగురు నిందితులను, శనివారం ఇద్దరిని అరెస్ట్ చేశారు.

లిక్కర్ స్కాం 10 వేల కోట్లపైనే!

- ఐదేళ్లలో 1.30 లక్షల కోట్ల నగదు లావాదేవీలు
- సిట్‌తోపాటు ఈడీ, సీబీఐ విచారణ జరగాలి: సోమిరెడ్డి

అమరావతి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): 'ఏపీలో లిక్కర్ స్కాం అంతర్జాతీయ స్థాయి కుంభకోణం. ఇది రూ.3,200 కోట్లకు పరిమితం కాదు. రూ.10 వేల కోట్లపైనే స్కాం జరిగింది' అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ పాలన ఐదేళ్లలో మద్యం అమ్మకాల్లో రూ.1.30 లక్షల కోట్ల నగదు లావాదేవీలు జరిగాయి. ఓ వైపు ప్రధాని మోదీ డిజిటల్ ఇండియా అంటుంటే జగన్‌రెడ్డి మాత్రం తన దందా కోసం రాష్ట్రాన్ని క్యాష్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చారు. దోపిడీ కోసమే మద్యం వ్యాపారంలో డిజిటల్ పేమెంట్లను అనుమతించలేదు. ప్రస్తుతం విచారణ సాగిస్తున్న సిట్‌తోపాటు ఈ అక్రమ నగదు లావాదేవీల గుట్టురట్టు చేయడానికి ఈడీ, సీబీఐ కూడా విచారణ చేపట్టాలి. రూ.1.30 లక్షల కోట్ల క్యాష్ ట్రాన్సాక్షన్ జరుగుతుంటే గత ఐదేళ్లు ఈడీ, సీబీఐ ఈ కుంభకోణంపై ఎందుకు దృష్టి సారించలేదు? జగన్‌రెడ్డి పర్యవేక్షణలో నడిచిన కసిరెడ్డి అండ్ టీం ఎక్సైజ్ డిపార్ట్‌మెంటు పర్యవేక్షణలోని మద్యం డిపోలకు వెళ్లకుండా, డిస్టిలరీ నుంచి నేరుగా దుకాణాలకు స్టాక్ తరలించి అక్రమంగా అమ్మేసుకుంది. ఈ విషయాన్ని మరింత లోతుగా విచారిస్తే సుమారు రూ.10 వేల కోట్ల కుంభకోణం గుట్టు రట్టవుతుంది. ఎస్పీవై ఇండస్ట్రీని మిథున్‌రెడ్డి లాగేసుకున్నారని సాక్షాత్తు సజ్జల శ్రీధర్‌రెడ్డి నాకు చెప్పారు' అని సోమిరెడ్డి తెలిపారు.

జూన్ నుంచి రేషన్‌లో కందిపప్పు, రాగులు

అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్'కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పోషక విలువలతో కూడిన కంది పప్పుతో పాటు తృణధాన్యాలను అందించాలని నిర్ణయించింది. వచ్చే జూన్ నెల నుంచి రేషన్ సరుకులతోపాటు సబ్సిడీపై కిలో కందిపప్పు, ఉచితంగా రాగులు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు రాష్ట్రంలోని 1.46 కోట్లకు పైగా ఉన్న రేషన్‌కార్డుదారులకు మూడు నెలలకు సరిపడేలా కందిపప్పు, ఏడాదికి సరిపడా రాగుల సేకరణ కోసం పౌరసరఫరాల సంస్థ టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. రేషన్‌కార్డుదారులతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఐసీడీఎస్ లబ్ధిదారులకు జూన్, జూలై, ఆగస్టు నెలలకు సరిపడేలా రూ.500 కోట్ల విలువైన 47,037 టన్నుల కందిపప్పు, రూ.100 కోట్లకు పైగా విలువైన 25 వేల టన్నుల రాగులు, 43,860 టన్నుల ఐఎస్ఎస్ గ్రేడ్ పంచదార (జూన్ నుంచి నవంబరు వరకు సరిపడేలా) సేకరణకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో ఎస్ఈఎంఎల్ పోర్టల్ ద్వారా టెండర్లు ఆహ్వానించింది. టెండర్ల ప్రక్రియ ముగియడంతో నాణ్యమైన కందిపప్పును కిలో ప్యాకెట్ల రూపంలో రాష్ట్రంలోని అన్ని ఎంఎల్ఎస్ పాయింట్లకు రవాణా చేయనున్నారు. రాగులను క్వింటాళ్ల లెక్కన గోనెసంచుల్లో రవాణా చేయనున్నారు.







ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



ఒకప్పుడు పార్టీలో అంతా తానై వ్యవహరించిన విజయసాయిరెడ్డికి ఈ అధికారాల పంపిణీ సహజంగానే రుచించలేదు. అధికారం–డబ్బు వల్ల మనస్పర్థలు రావడం సహజం కనుక జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి మధ్య కూడా దూరం పెరిగింది. తాను జగన్‌రెడ్డి నమ్మకం కోల్పోయానని, ఆయన గుండెల్లో తనకు స్థానం లేదని విజయసాయిరెడ్డి తెలుసుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు. వైసీపీకి, తన ఎంపీ పదవికి రాజీనామా చేయడానికి చాలా ముందు నుంచే విజయసాయిరెడ్డి తన అసంతృప్తిని సన్నిహితుల వద్ద వ్యక్తం చేస్తూ వచ్చారు. చివరికి ఇరువురి మధ్య విభేదాలు రోడ్డునపడ్డాయి. తన దారి తాను చూసుకోవాలన్న నిర్ణయానికి వచ్చిన విజయసాయిరెడ్డి భారతీయ జనతా పార్టీ ముఖ్యులను ఆశ్రయించారు. తాడేపల్లి ప్యాలెస్ గుట్టుమట్టు విజయసాయిరెడ్డికి తెలుసు. ఆయన నిజాయితీగా నోరు విప్పితే జగన్‌రెడ్డి కథ కంచికి చేరుతుంది.

కొత్తపలుకు

ఆర్కే RK

జగన్ పాల్పడిన మద్య పాతకం!

ఇంటి గుట్టు లంకకు చేటుగా మారనుందా? ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చోటుచేసుకున్న లిక్కర్ కుంభకోణంలో 'సిట్' అధికారులు తవ్వుతున్న కొద్దీ వెలుగులోకి వస్తున్న విషయాలను గమనిస్తే ఇది నిజం అని నమ్మాల్సిందే! ఈ కుంభకోణానికి సంబంధించిన మూలాలన్నీ తాడేపల్లి ప్యాలెస్‌లోనే ఉన్నాయని, ఈ కేసులో ఇప్పటికే అరెస్టైన నిందితులు సిట్ అధికారులకు చెబుతున్న దాన్నిబట్టి అర్థమవుతోంది. మద్యం ఉత్పత్తి కంపెనీలు ఎన్నికల సమయంలో ప్రధాన రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడం సహజం. అయితే, మద్యం కొనుగోళ్లలో అధికారంలో ఉన్నవాళ్లు గతంలో పెద్దగా జోక్యం చేసుకొనేవారు కారు. డిమాండ్‌కు అనుగుణంగా ఆయా కంపెనీలకు చెందిన మద్యాన్ని అధికారులే కొనుగోలు చేసేవారు. 2019 వరకు ఇదే విధానం తెలుగునాట అమల్లో ఉంది. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం కొనుగోళ్ల వ్యవహారాన్ని సమూలంగా మార్చి దాన్నొక పాడి ఆవుగా చేసుకున్నారు. పాపులర్ అయిన బ్రాండ్లను పక్కనబెట్టి, కమీషన్లు ముట్టజెప్పిన కంపెనీల మద్యాన్ని మాత్రమే కొనుగోలు చేసే విధానాన్ని తెరమీదకు తెచ్చారు. ఊరూ పేరూ లేని కంపెనీలను సృష్టించి, వాటి ద్వారా నాసిరకం మద్యాన్ని ఉత్పత్తి చేయించి కొనుగోలు చేశారు. ఫలితంగా పలువురు మద్యం ప్రియులు ప్రాణాలు కోల్పోగా, మరెందరో అనారోగ్యం పాలయ్యారు. ఈ కుంభకోణానికి పాల్పడిన వారు కొన్ని వేల కోట్ల రూపాయల సొమ్ము జేబులో వేసుకోవడంతోపాటు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. ఈ కారణంగా దీన్నొక ఆర్థిక నేరంగానే కాకుండా ప్రజల చావుకు కారకులుగా గుర్తించి కేసు కట్టాల్సిన అవసరం ఉంది.

కమీషన్లకోసం కసరత్తు

మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్న నాటి పాలకులు మద్యం కొనుగోళ్ల విధానం రూపకల్పనకు భారీ కసరత్తు చేశారు. వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ అనే అధికారులను ఏరికోరి మరీ తెచ్చుకొని మద్యం కొనుగోళ్ల బాధ్యతను అప్పగించారు. ఇసుక, మద్యంను సొంత ఆదాయ వనరులుగా మార్చుకున్న ఘనత జగన్ అండ్ కోకు మాత్రమే చెల్లింది. గత పాలకులు ఎవరూ ఇసుకను ఆదాయ వనరుగా చూడలేదు. ఇసుక నుంచి డబ్బు పిండుకొనే ఆలోచన చేయలేదు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే ఇసుకను కూడా పార్టీకి ప్రధాన ఆదాయ వనరులలో ఒకటిగా చేర్చారు. ఇసుక ధరలు పెరిగి ప్రజలు ఆర్థికంగా మాత్రమే నష్టపోయారు. కానీ, మద్యం విషయంలో అలా కాదు. ఆరోగ్యాలు దెబ్బతిని ప్రాణాలు కూడా కోల్పోయారు. లిక్కర్ కుంభకోణంలో అరెస్టయిన వారితో పాటు విచారణకు హాజరైన నిందితులు చెప్పిన వివరాల ప్రకారం... ఈ వ్యవహారంలో భాగస్వామ్యం ఉన్న ప్రతి ఒక్కరూ అమాన వీయంగా వ్యవహరించారు. తమ ధనదాహం పేదల ఉసురు తీస్తుందన్న విషయాన్ని విస్మరించారు. అధికారం శాశ్వతం అని భావించి సమాజమే ఉలికిపాటుకు గురయ్యే స్థాయిలో దోపిడీకి పాల్పడ్డారు. మద్యం కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించిన బేవరేజస్ కంపెనీ ఎండీగా పనిచేసిన వాసుదేవ రెడ్డి, మరో అధికారి సత్యప్రసాద్ అప్పట్లో ఏం జరిగిందో, ఎవరి ప్రోద్బలంతో తాము అలా చేయవలసి వచ్చిందో న్యాయాధికారి ఎదుట చెప్పేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన కసిరెడ్డి రాజశేఖరరెడ్డి సిట్ అధికారుల విచారణలో జరిగిందంతా పూస గుచ్చినట్టు చెప్పారు. తామంతా నిమిత్తమాత్రులమేనని, కమీషన్లు చేరాల్సిన చోటుకు చేరాయని చెప్పుకొచ్చారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కూడా అప్పట్లో ఏం జరిగిందో చెప్పేశారు. కమీషన్ల సొమ్మును అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీసుకొనేవారని నేరుగా చెప్పకుండా... అదే అర్థమొచ్చేలా సిట్ అధికారులకు చెప్పేశారు. మద్యం కొనుగోళ్లలో తప్పు జరగలేదని విజయసాయిరెడ్డి ఎక్కడా పేర్కొనలేదు. ప్రతి సందర్భంలోనూ 'మద్యం కుంభకోణం' అనే మాట్లాడారు. అయితే, ఆ కుంభకోణంలో ప్రధాన పాత్రధారి కసిరెడ్డి రాజశేఖరరెడ్డి అని చెప్పారు.

చెడిన దోస్తీ...

ఇద్దరు తెలివైన నేరస్తులు ఎక్కువకాలం కలసి ప్రయాణం చేయలేరు. విజయసాయిరెడ్డి, కసిరెడ్డి రాజశేఖరరెడ్డి ఒకప్పుడు సన్నిహితంగానే ఉండేవారు. విజయసాయి ఆదేశాల ప్రకారమే కసిరెడ్డి పనిచేసేవారు. అయితే, జగన్‌రెడ్డితో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకున్న కసిరెడ్డి రాజశేఖరరెడ్డి ఆ తర్వాత విజయసాయిరెడ్డిని పట్టించుకోవడం మానేశారు. ఇసుక, మద్యం వ్యాపారాల నుంచి జగన్‌రెడ్డి తనను దూరం పెట్టడానికి రాజ్ చెప్పిన చాడీలే కారణమని విజయసాయిరెడ్డి భావించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్యా దూరం పెరిగింది. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఇంటెలిజెంట్ క్రిమినల్ అని విజయసాయి అభివర్ణించారు. అయితే, ఆర్థిక నేరాలు చేయడంలో విజయసాయిరెడ్డిని మించిన వారు లేరన్న అభిప్రాయం అప్పటికే ఉంది. జగన్‌రెడ్డితో మాయా వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మింపజేయడంలో విజయసాయి రెడ్డిదే ప్రధాన పాత్ర అన్నది అందరికీ తెలిసిన విషయమే. అధికారం–డబ్బు మనుషులను కుదురుగా ఉండనివ్వవు. ఈ రెండూ వచ్చినప్పుడు ప్రాణ స్నేహితులు కూడా విడిపోవడం చూశాం. రక్త సంబంధాలను మరచిపోయి కొట్టుకోవడం చూస్తున్నాం. తనకు వ్యతిరేకంగా ఎవరు ఏది మాట్లాడినా వారి వెనుక చంద్రబాబు ఉన్నారని జగన్‌రెడ్డి ఆరోపిస్తారు గానీ... అసలు కారణం వారి వెనుక ఉన్నది డబ్బు–అధికారమే! దివంగత రాజశేఖరరెడ్డి కుటుంబంలో కలతలు ఏర్పడటానికి ఈ రెండూ కారణం కాదా? అధికారం, తద్వారా సమకూరిన డబ్బును రక్తం పంచుకుపుట్టిన షర్మిలతో పంచుకోవడానికి జగన్‌రెడ్డి సిద్ధపడి ఉంటే వారి మధ్య గొడవలు జరిగేవి కావు కదా? సొంత అన్నపై కత్తులు దూయడానికి షర్మిల సిద్ధపడ్డారంటే ఆస్తుల పంపకంలో న్యాయం చేయకపోవడమే కారణం కాదా? చివరకు తుచ్ఛమైన ఆస్తులకోసం సొంత తల్లి విజయలక్ష్మిపైనే జగన్‌రెడ్డి కేసు వేశారు కదా? జగన్‌రెడ్డి తన తల్లి, చెల్లిపై కేసు వేయడానికి కూడా చంద్రబాబే కారణం అని చెప్పగలరా? పులివెందులపై పెత్తనం ఎవరికి దక్కాలన్న వివాదం తలెత్తడం వల్లనే కదా వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్యకు గురయ్యారు! రక్త సంబంధీకులను ఖైదు చేయించడం, హత్యలు చేయించడం మొఘల్ సామ్రాజ్య కాలంలో జరిగాయని చరిత్ర పుస్తకాల్లో చదివాం. ఇప్పుడు మళ్లీ ఇంత కాలానికి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంలో అలాంటివి జరగడం చూస్తున్నాం. ఈ నేపథ్యంలోనే జగన్‌రెడ్డి–విజయసాయిరెడ్డి మధ్య విభేదాలు తలెత్తడాన్ని చూడాలి.

సాయిరెడ్డి ప్రస్థానం...

విజయసాయిరెడ్డి చెబుతున్నట్టుగా 2019 వరకు వైసీపీలో అన్నీ తానే అయి నడిపించారు. అప్పుడు అధికారంలో ఉన్న వారికి వ్యతిరేకంగా ఎన్నో కుటిల పన్నాగాలు పన్నారు. జగన్ రెడ్డికి కుడి భుజంగా వ్యవహరించారు. ఈ క్రమంలో 2019లో వారి కుట్రలు ఫలించి జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అప్పటివరకు పార్టీలో నంబర్ టూగా ఉన్న విజయసాయిరెడ్డి ప్రభుత్వంలో కూడా నంబర్ టూగా చెలామణి కావచ్చునని భావించారు. ఏడాదికి పైగా అంతులేని అధికారాన్ని చలాయించారు కూడా! అదే సమయంలో మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వైఎస్ అనిల్‌రెడ్డి వంటివారు జగన్‌రెడ్డికి సన్నిహితం అయ్యారు. వనరుల దోపిడీ, కమీషన్ల వసూలు బాధ్యతను ముఖ్యమంత్రి హోదాలో జగన్‌రెడ్డి ఆ ముగ్గురికీ అప్పగించారు. దీంతో విజయ సాయిరెడ్డి ప్రభ మసకబారడం మొదలైంది. సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారు ప్రధాన అధికార కేంద్రాలుగా మారారు. అధికారం వస్తే దున్నేద్దామని అనుకున్న విజయసాయిరెడ్డికి ఈ పరిణామం సహజంగానే రుచించలేదు. మద్యం విషయంలోనే కాకుండా మిగతా సహజ వనరుల నుంచి కమీషన్లు పిండుకొని తనకు అందజేసే బాధ్యతను జగన్‌రెడ్డి తన చుట్టూ ఉండే కోటరీకే అప్పగించారు. అన్ని వ్యవహారాలనూ ఒకరికే అప్పగించకూడదన్న ప్రాథమిక సూత్రానికి అనుగుణంగా అరడజను ముఖ్యులకు బాధ్యతలను పంచిపెట్టారు. విచిత్రం ఏమిటంటే వీరెవరికీ ప్రభుత్వంలో ప్రాధాన్యత ఉండదు. కమీషన్లు వసూలు చేయడం మాత్రమే వారి బాధ్యత. అందుకు అవసరమైన అధికారాన్ని మాత్రమే దఖలు చేసేవారు. విధాన నిర్ణయాలలో వారెవరికీ సంబంధం ఉండేది కాదు. తమకు అప్పగించిన శాఖలలోనే ఆయా వ్యక్తుల మాట చెల్లుబాటు అయ్యేది. ఒకప్పుడు పార్టీలో అంతా తానై వ్యవహరించిన విజయసాయిరెడ్డికి ఈ అధికారాల పంపిణీ సహజంగానే రుచించలేదు. అధికారం–డబ్బు వల్ల మనస్పర్థలు రావడం సహజం కనుక జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి మధ్య కూడా దూరం పెరిగింది. తాను జగన్‌రెడ్డి నమ్మకం కోల్పోయానని,

> **అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన జగన్ అండ్ కో హేయమైన పాపాలకు ఒడిగట్టారని ప్రజలకు వివరించగలిగినప్పుడే ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రాథమిక కర్తవ్యాన్ని నెరవేర్చినవారు అవుతారు. జగన్‌రెడ్డిని రాజకీయంగా సీసాలో బంధించడానికి లిక్కర్ కుంభకోణం రాష్ట్ర ప్రభుత్వానికి అందివచ్చిన ఆయుధం.**

ఆయన గుండెల్లో తనకు స్థానం లేదని విజయసాయిరెడ్డి తెలుసుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు. వైసీపీకి, తన ఎంపీ పదవికి రాజీనామా చేయడానికి చాలా ముందు నుంచే విజయసాయిరెడ్డి తన అసంతృప్తిని సన్నిహితుల వద్ద వ్యక్తం చేస్తూ వచ్చారు. చివరికి ఇరువురి మధ్య విభేదాలు రోడ్డున పడ్డాయి. తన దారి తాను చూసుకోవాలన్న నిర్ణయానికి వచ్చిన విజయసాయిరెడ్డి భారతీయ జనతా పార్టీ ముఖ్యులను ఆశ్రయించారు. ఈ క్రమంలో ఇంటి గుట్టు లంకకు చేటు అని గ్రహించిన జగన్‌రెడ్డి తన మనుషులతో విజయసాయిరెడ్డి పైన ఎదురుదాడి చేయించడం మొదలుపెట్టారు. తాడేపల్లి ప్యాలెస్ గుట్టుమట్టు విజయసాయిరెడ్డికి తెలుసు. ఆయన నిజాయితీగా నోరు విప్పితే జగన్‌రెడ్డి కథ కంచికి చేరుతుంది. ఈ కారణంగానే విజయసాయిరెడ్డి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుతో చేరిపోయారని ప్రచారం చేయడం మొదలు పెట్టారు. విజయసాయిని ద్రోహిగా చిత్రించే పనిలో జగన్ అండ్ కో బిజీగా ఉన్నారు. జగన్‌రెడ్డితో విభేదించి ఎదురు



తిరగడం వల్ల ఎదురయ్యే పరిణామాలు విజయసాయిరెడ్డికి తెలుసు. అందుకే ఆయన ముందుగా బీజేపీ ప్రముఖుల ఆశ్రయం పొందారు. లిక్కర్ కుంభకోణంలో జగన్‌రెడ్డికి కమీషన్ల సొమ్ము ముట్టిందని చెప్పడం మినహా మిగతా అన్ని విషయాలనూ ఆయన సిట్ అధికారులకు పూసగుచ్చినట్టు చెప్పేశారు. ఈ కుంభకోణంతో సంబంధం ఉన్న వారి బట్టలు సగమే విప్పానని, మిగతా సగం దుస్తులు కూడా త్వరలోనే విప్పుతానని ఆయన తాజాగా ప్రకటించారు. అంటే విజయసాయిరెడ్డి త్వరలో జగన్‌రెడ్డి దుస్తులు కూడా విప్పుతారా? అన్న సందేహం కలుగుతోంది.

జగన్ పరిస్థితి ఏమిటి?

నాలుగేళ్ల తర్వాత తాను తిరిగి అధికారంలోకి వస్తానని, అప్పుడు తమపై కేసులు పెట్టిన పోలీసు అధికారుల బట్టలు విప్పిస్తానని జగన్‌రెడ్డి చెప్పుకొంటున్న వేళ విజయసాయిరెడ్డి హెచ్చరికలు వైసీపీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అయితే, కపట నాటకాలకు మారుపేరైన విజయసాయిరెడ్డిని ఇప్పటికీ చాలామంది నమ్మడం లేదు. జగన్‌రెడ్డితో ఆయనకు విభేదాలు ఏర్పడటం డ్రామా అని నమ్ముతున్న వాళ్లు కూడా గణనీయంగానే ఉన్నారు. వారిరువురి మధ్య విభేదాలు నిజమే అయిన పక్షంలో విజయసాయిరెడ్డి తదుపరి ఎత్తుగడలు ఏమిటనేది ఆసక్తికరంగా మారింది. జగన్‌రెడ్డి గుట్టుమట్లు అన్నీ తెలిసిన వ్యక్తి ఆయన. జగన్ అవినీతి కేసులలో విజయసాయిరెడ్డి ఏ–2గా ఉన్నారు. వాటిలో ఆయన అప్రూవర్‌గా మారితే పరిస్థితి ఏమిటి? అది సాధ్యమా? జగన్‌రెడ్డి నైజం తెలిసిన విజయసాయిరెడ్డి ప్రాణాలకు తెగించి అప్రూవర్‌గా మారగలరా? ఇలాంటి సందేహాలు సహజంగానే కలుగుతాయి. ఆయన ఇవాళ కాకపోతే రేపైనా బీజేపీలో చేరిపోతారు. జగన్‌రెడ్డిపై నమోదైన కేసులలో శిక్ష పడితే విజయసాయిరెడ్డికి కూడా శిక్ష పడుతుంది. అలా అయితే భారతీయ జనతా పార్టీలో చేరడం ఎందుకు? అని ప్రజల్లో సందేహం కలగకుండా ఉంటుందా?

అవినీతి విషయంలో జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి శరీరం అతుక్కుని పుట్టిన అవిభక్త కవలలవంటి వారు. ఈ ఇద్దరిలో ఒకరిని తప్పించి మరొకరిని శిక్షించలేరు. విజయసాయిరెడ్డి బీజేపీలో చేరిపోతే అవినీతి కేసులలో పురోగతి ఉండకపోవచ్చు. అంటే, విజయసాయి చర్యల వల్ల పరోక్షంగా జగన్‌రెడ్డికి కూడా మంచి జరగబోతున్నదని భావించాలి. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకున్న మద్యం కుంభకోణంపై సిట్ విచారణ వేగం పుంజుకుంది.

ఎవరి భయం వారిది...

మద్యం కేసులో మరో కీలక నిందితుడు బాలాజీ సిట్ అధికారులకు చిక్కకుండా తప్పించుకొని తిరుగుతున్నారు. వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని ఇప్పటికే విచారించిన సిట్ అధికారులు తదుపరి ఏం చేయబోతున్నారో వేచిచూడాలి. అయితే, ఈ కేసులో తనను అరెస్టు చేయబోతున్నారని మిథున్‌రెడ్డి మానసికంగా సిద్ధపడుతున్నారు. తనను మళ్లీ విచారణకు పిలిస్తే మరిన్ని వివరాలు చెబుతానని విజయసాయిరెడ్డి చెబుతున్నందున సిట్ అధికారులు త్వరలోనే ఆయనను విచారణకు పిలవవచ్చు. అప్పుడు ఆయన ఏమి చెబుతారు? ఆయన నోటివెంట వెలువడే నిజాలతో ఈ కుంభకోణంలో జగన్‌రెడ్డిని నిందితుడిగా చేర్చుతారా? అన్న సందేహం సర్వత్రా వ్యాపించింది. ఏది ఏమైనా అవినీతికి మాత్రమే పరిమితం కాకుండా ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడిన ఈ కుంభకోణంతో సంబంధం ఉన్న వారందరినీ శిక్షించాల్సిందే.

> **మద్యం కుంభకోణంలో వేల కోట్ల నగదు లావాదేవీలు జరిగాయి. ప్రభుత్వానికి మద్యం సరఫరా చేసిన లిక్కర్ కంపెనీలు అనూహ్యంగా మద్యం వ్యాపారంతో సంబంధం లేని కంపెనీలకు, సంస్థలకు చెల్లింపులు చేశాయి. ఈ విధంగా జరిగిన చెల్లింపులన్నీ చివరకు 'మూల విరాట్'కే చేరాయి. చరిత్రలో జరగని, చూడని రీతిలో జరిగిన ఈ కుంభకోణంపై దర్యాప్తును సిట్ అధికారులకే పరిమితం చేయకుండా ఆర్థిక వ్యవహారాలలో నిపుణులైన వారికి కూడా భాగస్వామ్యం కల్పించాలి. దర్యాప్తు పరిధిని విస్తరించాలి. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం జాతీయ స్థాయిలో పతాక శీర్షికలతో ప్రచురితమైంది, ప్రచారం పొందింది. ఆంధ్రప్రదేశ్‌లో జరిగింది అంతకు మించిన మహా ఘాతుకం కనుక రాష్ట్ర ప్రభుత్వం ఈ కుంభకోణంపై జాతీయ స్థాయిలో తెలిసేలా చేయాలి. జగన్‌రెడ్డి పాలనలో చోటుచేసుకున్న పాపాలను దేశ ప్రజలకు వివరించి అటువంటి నేరాలకు పాల్పడే వారికి రాజకీయాలలో చోటు లేని విధంగా చర్యలు తీసుకోవాలి.**

ఢిల్లీలో లిక్కర్ కొనుగోళ్లలో ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాలను అరెస్టు చేసి జైలుకు పంపారు. అక్కడ అంతా కలపి కొన్ని వందల కోట్ల రూపాయలు మాత్రమే చేతులు మారాయి. కేజ్రీవాల్‌ను జైల్లో పెట్టినా తాజాగా జరిగిన ఎన్నికల్లో ఆయనపై ప్రజల్లో ఎలాంటి సానుభూతీ ఏర్పడలేదు. ఆప్ పార్టీ చిత్తుగా ఓడిపోయింది. అవినీతి విషయాలలో ప్రజలు పెద్దగా స్పందించలేకపోవచ్చునుగానీ, మద్యం వంటి వ్యవహారాలలో ఇరుక్కుంటే దాన్ని జీర్ణించుకోలేరు. ఈ కారణంగానే తెలంగాణలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవిత ఇదే కేసులో జైలుకు వెళ్లి వచ్చినా ఆమెపై ప్రజల్లో సానుభూతి ఏర్పడలేదు. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకున్న లిక్కర్ కుంభకోణాన్ని చూడాలి.

హేయం... నీచం...

దేశ చరిత్రలోనే ఇంతటి నీచమైన కుంభకోణం జరగలేదు. అధికారంలో ఉన్నంత కాలం నాసి రకం మద్యాన్ని ప్రజలకు సరఫరా చేసి వారి ప్రాణాలతో చెలగాటమాడారు. హేయమైన ఈ కుంభకోణంతో తనకు సంబంధం లేదని జగన్‌రెడ్డి చెప్పగలరా? చెప్పినా ప్రజలు నమ్ముతారా? జగన్‌రెడ్డిని కుల, మత ప్రాతిపదికన గుడ్డిగా అనుకరించేవారు, అభిమానించేవారు గణనీయంగా ఉంటే ఉండవచ్చునుగానీ చేసిన పాపానికి ఏదో ఒక రోజు శిక్ష అనుభవించాల్సి వస్తుంది. పుష్కర కాలం క్రితం తనపై సీబీఐ దాఖలు చేసిన కేసు విచారణకు నోచుకోకుండా తప్పించుకోగలుగుతున్నామని జగన్ అండ్ కో ధీమాగా ఉండవచ్చునుగానీ, మద్యం కుంభకోణంలో పాపం కూడా చేశారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో రంగంలోకి దిగిన ఈడీ అధికారులు... ఏపీలో జరిగిన కుంభకోణం వైపు ఇంకా చూడటం లేదు. దీనికి కారణం తెలియదు. ఐదేళ్ల పాటు సాగిన ఈ కుంభకోణంలో వేల కోట్ల నగదు లావాదేవీలు జరిగాయి. ప్రభుత్వానికి మద్యం సరఫరా చేసిన లిక్కర్ కంపెనీలు అనూహ్యంగా మద్యం వ్యాపారంతో సంబంధం లేని కంపెనీలకు, సంస్థలకు చెల్లింపులు చేశాయి. ఈ విధంగా జరిగిన చెల్లింపులన్నీ చివరకు 'మూల విరాట్'కే చేరాయి. ఉదాహరణకు ఒక డిస్టిలరీ కంపెనీ ముంబైలోని ఒక వస్త్ర దుకాణానికి 28 కోట్ల రూపాయలు చెల్లించింది. ఆ దుకాణం నుంచి సదరు డిస్టిలరీ వస్త్రాలు కూడా కొనుగోలు చేయలేదు. ఈ విధంగా డిస్టిలరీలు ప్రభుత్వ పెద్దలకు చెల్లించాల్సిన కమీషన్లను వారు చెప్పిన కంపెనీలకు బదలాయించారు. అంతిమంగా, ఈ డబ్బు ఎవరికి చేరింది? ఏ మేరకు అక్రమ లావాదేవీలు జరిగాయి? ఇందులో ఎవరెవరి పాత్ర ఎంత? అనేది ఇంకా తెలియవలసి ఉంది. చరిత్రలో జరగని, చూడని రీతిలో జరిగిన ఈ కుంభకోణంపై దర్యాప్తును సిట్ అధికారులకే పరిమితం చేయకుండా ఆర్థిక వ్యవహారాలలో నిపుణులైన వారికి కూడా భాగస్వామ్యం కల్పించాలి. దర్యాప్తు పరిధిని విస్తరించాలి. అవసరాన్ని బట్టి మరిన్ని ఏజెన్సీలు రంగంలోకి దిగాలి. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం జాతీయ స్థాయిలో పతాక శీర్షికలతో ప్రచురితమైంది, ప్రచారం పొందింది. ఆంధ్రప్రదేశ్‌లో జరిగింది అంతకు మించిన మహా ఘాతుకం కనుక రాష్ట్ర ప్రభుత్వం ఈ కుంభకోణంపై జాతీయ స్థాయిలో తెలిసేలా చేయాలి. జగన్‌రెడ్డి పాలనలో చోటుచేసుకున్న పాపాలను దేశ ప్రజలకు వివరించి అటువంటి నేరాలకు పాల్పడే వారికి రాజకీయాలలో చోటులేని విధంగా చర్యలు తీసుకోవాలి. ఇప్పుడు ఇంటి గుట్టు కూడా ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నందున... పాపులను శిక్షించడానికి సహకరించే వారందరికీ తగిన రక్షణ కల్పించాలి. భవిష్యత్తులో మరెవరూ లిక్కర్ కొనుగోళ్లలో ఇటువంటి దరిద్రపు ఆలోచన చేయకుండా నిందితులను కఠినంగా శిక్షించాలి. ప్రస్తుతానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇలాంటి అరాచకాలపై ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్నారు. నోరు పారేసుకున్న వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరిగినా పర్వాలేదుగానీ... మద్యం కుంభకోణం విచారణలో జాప్యం జరగకూడదు. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం జరిగినా ఇలాంటి పాపాలకు పాల్పడిన వారికి లైసెన్స్ ఇచ్చినట్టు అవుతుంది.

జగన్ బేఖాతరు...

లిక్కర్ కుంభకోణంలో అయినా విజయసాయిరెడ్డి అప్రూవర్‌గా మారతారో లేదో తెలియదు. ఎవరు అప్రూవర్‌గా మారినా మారకపోయినా ఈ కేసులో నిందితులను శిక్షించడానికి అవసరమైన ఆధారాలను సిట్ అధికారులు ఇదివరకే సేకరించారు. ఈ కేసులో జగన్‌రెడ్డి ప్రధాన నిందితుడు అవుతారా? లేదా? అన్నదే ప్రస్తుత ప్రశ్న. లిక్కర్ కేసులో చిక్కుకున్నవారు భయపడుతున్నట్టుగా జగన్‌రెడ్డి మాత్రం భయపడటం లేదు. అతనొక అసాధారణ మనస్తత్వం కలిగిన వ్యక్తి. సాధారణంగా ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయినవారు కోలుకోవడానికి సమయం తీసుకుంటారు. 2019లో ఓడిపోయిన చంద్రబాబు కోలుకోవడానికి రెండేళ్లకు పైగా సమయం పట్టింది. 2023లో తెలంగాణలో ఓడిపోయిన కేసీఆర్ కూడా ఏడాది పాటు మౌనంగా ఉండిపోయారు. జగన్‌రెడ్డి అంచనాలకు అందని విధంగా పరాజయం పాలైనా కుంగిపోలేదు. మూడు నెలలకే నిలదొక్కుకున్నారు. ఆరు నెలలు గడిచేసరికి త్వరలో నేనే అధికారంలోకి వచ్చేది అంటూ ప్రకటిస్తున్నారు. ఎన్నికలకు ఇంకా నాలుగేళ్లకు పైగా వ్యవధి ఉంది. అయినా రేపో మాపో అధికారంలోకి వచ్చేసినట్టుగా ఆయన ప్రవర్తిస్తున్నారు. ఈ విషయంలో ఆయన ఎంత బలంగా ప్రచారం చేస్తున్నారంటే, నిజంగా జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారా? అని ప్రజలతో పాటు కూటమి కార్యకర్తలు భయకంపితులు అవుతున్నారు. ఒక వ్యక్తి విషయంలో ప్రజలు కూడా భయపడటం ఇప్పుడే చూస్తున్నాం. కూటమి నాయకత్వం ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన జగన్ అండ్ కో హేయమైన పాపాలకు ఒడిగట్టారని ప్రజలకు వివరించగలిగినప్పుడే ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రాథమిక కర్తవ్యాన్ని నెరవేర్చినవారు అవుతారు. జగన్‌రెడ్డిని రాజకీయంగా సీసాలో బంధించడానికి లిక్కర్ కుంభకోణం రాష్ట్ర ప్రభుత్వానికి అందివచ్చిన ఆయుధం. ఈ ఆయుధాన్ని ఎంత సమర్థవంతంగా వినియోగించబోతున్నారో వేచి చూద్దాం!

నిజం చెప్తే నిష్ఠూరం..!


నేనప్పటికి గుంటూరు, చీరాలలో law and order డీఎస్పీగా పని చేశాను గాబట్టి ఇతర శాఖల్లోనూ చేస్తే సీనియర్ అధికారి అయ్యాక అనుభవాలన్నీ ఉపయోగపడతాయని నాకు intelligence బ్రాంచీలో పని చేయాలన్న ఆసక్తి కలిగింది. అప్పటికే intelligence హెడ్డాఫీసులోని అధికారులు పరిచయం అయ్యారు గనక నా ఆసక్తి గమనించి అప్పటి హెడ్– కె. విజయరామారావు నన్ను వైజాగ్ ఇంటెలిజెన్స్ డీఎస్పీగా బదిలీ చేశారు.

అప్పుడే తెలుగుదేశం పార్టీ పుట్టింది. ఎన్.టి. రామారావు ముమ్మరంగా జనంలో తిరుగుతున్నారు. ప్రజా రథానికి జనం జేజేలు పలుకుతున్నారు. తెలుగుదేశం జెండా చూసి మురిసిపోతున్నారు. ఎన్టీఆర్ మాటలకి, ఆయన ఆత్మగౌరవ నినాదానికి చెయ్యెత్తి జై కొడుతున్నారు. ఇన్ని మాటలు చెప్పటానికి 'నిఘా' ఏమీ పెట్టనవసరమే లేదు.

ఎన్టీఆర్ మీద అభిమానం ప్రజల్లో రోజు రోజుకూ పెరిగిపోతోంది. ముఖ్యంగా వెనకబడిన వర్గాల్లో వూపు చెప్పనలవి గానిది. నిజానికి కాంగ్రెస్ పార్టీ అంత వరకూ ఎస్సీలకు, ఎస్టీలకు, మైనార్టీలకు మేలుచేసే పార్టీగా ముద్రపడింది. మిగతా backward classesలోనూ అవే పరిస్థితులున్నా కాంగ్రెస్ పట్టించుకోవడం లేదనే అపప్రథ ఉండేది. ఆ నేపథ్యంలో ఇందిరాగాంధీ కూడా విశాఖ వచ్చి రెండు మూడు మీటింగుల్లో మాట్లాడారు. కానీ ఒక చోట ఒక గ్రూపు, ఇంకో చోట ఇంకో గ్రూపు సభలను అనుకున్నంత గొప్పగా జరగనివ్వలేదు.

తెలుగుదేశం పార్టీకి ఎన్నికల్లో విజయావకాశాలు దండిగా వున్నాయని మా ఇంటెలిజెన్స్ హెడ్డాఫీసుకు తెలియచేయడం మొదలుపెట్టాను. అవతలి వాళ్లకు రోషాలు, కోపాలు! సి.ఆర్. నాయుడు 'కమ్మ కళ్ల'తో చూస్తున్నాడు అని నా మీద పితూరీలు మొదలుపెట్టారు. నేను చూసింది కమ్మ కళ్లతో కాదు, జనం కళ్లతో. వాళ్లకది అర్థం కాలేదు. అర్థం చేసుకోవడానికి కనీస ప్రయత్నం కూడా చెయ్యలేదు.

నేను ఎన్టీఆర్‌కి గానీ, తెలుగుదేశానికి గానీ మేలు చేయాలని అనుకుంటే – 'తెలుగుదేశానికేమీ పసలేదు, వాపే కానీ బలుపు లేదు' అని చెప్పేసేవాణ్ణి. అప్పుడు అధికార పార్టీ ఆరాంగా నిద్ర పోయేది. కానీ నేను హెచ్చరిక లాంటిది చేసి 'మేలుకోండి' అని ఒక అధికారిగా, నిజాయితీగా చెప్పేసరికి దానికి రకరకాల రంగులు పూసి పెట్టారు. మా అమ్మ ఎప్పుడూ చెప్తుండేది, 'ఎప్పుడూ నిజమే చెప్పు. కొందరికి నిష్ఠూరమైనా సరే' అని. ఆ ప్రకారమే నిజం చెప్పాను.



> **నేను ఎన్టీఆర్‌కి గానీ, తెలుగుదేశానికి గానీ మేలు చేయాలని అనుకుంటే – 'తెలుగుదేశానికేమీ పసలేదు, వాపే కానీ బలుపు లేదు' అని చెప్పేసేవాణ్ణి. అప్పుడు అధికార పార్టీ ఆరాంగా నిద్ర పోయేది. కానీ నేను హెచ్చరిక లాంటిది చేసి 'మేలుకోండి' అని ఒక అధికారిగా, నిజాయితీగా చెప్పేసరికి దానికి రకరకాల రంగులు పూసి పెట్టారు.**

అప్పుడు హోం మంత్రిగా వున్న రోశయ్య నాకు చీరాల, గుంటూరు నుంచే తెలుసు. ఆయన విశాఖ వచ్చినప్పుడల్లా నన్ను ప్రత్యేకంగా వెంట బెట్టుకుని తిరిగేవారు. నేనంటే కాస్త ఇష్టం కూడా అనుకుంటాను. ఒకరోజు నాతో రోశయ్య, "ఏం నాయుడూ! సినిమా ఆయన ఎన్టీఆర్ తిరుగుతున్నాడు గదా, జనం వస్తున్నారు. మేమూ మీటింగులు పెడితే జనమైతే వస్తారు గదా. ఏమంటావ్?" అనడిగారు.

"సార్ లీడర్లంతా మీ వైపు, ఓటర్లంతా ఆ వైపు!" అన్నాను నవ్వుతూనే. "హేయ్, వూరుకో, నువ్వేదో అభిమానం కొద్దీ అంటున్నావ్, అదేం కాదు" అని ఆయనా సరదాగానే కసురుకున్నారు. "చూద్దాం లెండి సార్," అన్నా నేనూ తగ్గకుండా.

నా మీద కొందరు పితూరీలు చెప్పారు కాబట్టి సత్యం నిగ్గు తేల్చుకోవడానికి విశాఖ జిల్లా అంతా రహస్యంగా తిరిగా. అలా పాయకరావుపేట వెళ్లినప్పుడు బడ్డీ కొట్టు దగ్గర ఒక సిగరెట్టు తీసుకుని అక్కడున్న తాడుతో ముట్టించుకుని, బడ్డీ కొట్టు కుర్రాడితో మాట కలిపా... 'ఎవరండీ' అనడిగితే, ప్రెస్ రిపోర్టర్‌ని అని చెప్పా. ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ, "ఏంటీ, ఈ పాయకరావుపేటకి గంటెల సుమన అనే candidateని తెలుగు దేశం వాళ్లు నిలబెట్టబోతున్నారట. ఆమెని మీరెప్పుడన్నా చూశారా? ఆవిడ ఎక్కడావిడ? గ్రామం ఏది?" అనడిగా.

"ఏమోనండి సార్, నాకు తెలీదు, అయినా మేం ఓటేసేది ఎన్టీ రామారావుకి కదా. గంటెల సుమన ఎవరైతే మాకేంటి?" అనేశాడు. ఎన్నికలు జరిగాయి. తెలుగుదేశం గెలిచింది.

తెలుగుదేశం పార్టీ గెలిచాక ఎన్టీఆర్ ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకునే కాలం మొదలైంది. ఆయన చేసిన వాగ్దానాల్లో – అవినీతి పాలన అంతమొందిస్తాననేది ఒకటి.


కొద్ది నెలలకే ఇంటెలిజెన్స్ విభాగం నుంచి ఫోను! ఏకంగా ఇంటెలిజెన్స్ చీఫ్ అప్పారావు నుంచే! "ఇంటెలిజెన్స్‌కి రా. నీలా ఇంటెలిజెన్స్‌లో అనుభవం వున్న ఆఫీసర్లు జిల్లాల్లో కాదు వుండాల్సింది! హెడ్డాఫీసు హైదరాబాద్‌కి రా" అంటూ– అంతే, హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యింది.

నేను హైదరాబాద్ చేరిన తొలి నాళ్లలోనే మచిలీపట్నం అసెంబ్లీ ఉప ఎన్నిక వచ్చింది. అక్కడున్న ఎమ్మెల్యే హఠాత్తుగా చనిపోబట్టి! అప్పుడు వసంత నాగేశ్వరరావు హోం మినిస్టర్. కృష్ణా జిల్లా వాసి. ఆయనకు ఉప ఎన్నికల్లో గెలుస్తామో లేదో అని డౌట్. ఎన్టీ రామారావుకి ఇదే చెప్పారు. అప్పుడు ఎన్టీఆర్ ఇంటెలిజెన్స్ చీఫ్ అప్పారావుని పిలిచి అడిగారు, "ఏం జరుగుతుంద"ని. విజయవాడలో ఉన్న ఇంటెలిజెన్స్ డీఎస్పీ కూడా డౌట్‌గా చెప్తున్నాడు. అప్పారావు నన్ను పిలిచి 'సరిగ్గా' కనుక్కోమన్నారు. వెంటనే బయలుదేరి విజయవాడ వెళ్లాను. అక్కడ లోకల్‌గా వున్న ఇంటెలిజెన్స్ డీఎస్పీతో మాట్లాడి ఆయనకున్న సమాచారాన్నంతా నోట్ చేసుకున్నాను. తర్వాత అక్కడ నుంచి ఒక ఎస్సైని వెంటబెట్టుకుని బందరు వెళ్లాను. నాతో ఉన్న ఎస్సైకి చెప్పి– రోజంతా మాతో వుండడానికి రిక్షా అతన్ని మాట్లాడుకుని– ఎస్సై, నేను రిక్షా ఎక్కి అతన్ని మాటల్లోకి దింపాము. రిక్షా కార్మికుల సమస్యలన్నీ చెప్పాడు. టిఫిన్ తింటూ తింటూనే హోటల్ కార్మికుల్ని కూడా కదిపి చూశాము. వాళ్ల సాధక బాధకాలన్నీ నాకు బోధపడ్డాయి. టిఫిన్ అయ్యాక as usualగా కిళ్లీకొట్టు, సిగరెట్టు! కిళ్లీ కొట్టతనితో మాటామంతీ కానిచ్చి, రిక్షాలో వూరంతా తిరగడం మొదలుపెట్టాము. ఇంకా మచిలీపట్నం పక్కనున్న పెడన వెళ్లాము. అక్కడ ఎక్కువగా నేత కార్మికులు– ప్రభుత్వం నుంచి వారేమి కోరుకుంటున్నారో కనుక్కున్నా. బీచ్ వున్న వూరు కాబట్టి మత్స్యకారుల సమస్యల్నీ, కోరికల్నీ నోట్ చేసుకున్నా.

మరుసట్రోజు నేను సేకరించిన సమాచారాన్ని అన్ని కోణాల నుంచి విశ్లేషించి మా చీఫ్ అప్పారావుకు బ్రీఫ్ చేశాను. ఏమీ అవాంతరాలు లేకపోతే తెలుగుదేశం 10 నుంచి 15 వేల మెజార్టీతో గెలిచే అవకాశం వుందని చెప్పాను. ఆగమేఘాల మీద నేను చూపించిన స్థానిక సమస్యలకు పరిష్కారాలు చేపట్టడం మంచిదని చెప్పాను. అప్పారావు ఎన్టీఆర్‌ను కలిసి 10, 15 వేల మెజార్టీ అనకుండా ఎందుకైనా మంచిదని, 5 వేల మెజార్టీతో బయటపడతామని చెప్పేశాడు. ఎన్నికలు జరిగాయి. 13 వేల పైచిలుకు మెజార్టీతో తెలుగుదేశం గెలిచింది.

రిటైర్డ్ ఐపీఎస్ అధికారి చేరెడ్డి రామచంద్రనాయుడు (సి.ఆర్.నాయుడు) ఆత్మకథ 'కొండ మెట్లు' పుస్తకం నుంచి కొన్ని భాగాలు ఇవి.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
ఆదివారం 27 ఏప్రిల్ 2025



ఏవీ నాటి సుగ్రంథాలు..?

ఆదరణ కోల్పోతున్న గ్రంథాలయాలు

- నాడు జాతీయోద్యమంలో సమరశంఖం
- నేడు ఆదరణ లేక అవస్థలమయం
- బెజవాడ వేదికగా పునర్వికాస కార్యాచరణ

పునాది గట్టిగా ఉండాలి. అది భవనానికైనా.. వ్యక్తి ఎదుగుదలకైనా.. సమాజ పురోగతికైనా.. సరిగ్గా వందేళ్ల కిందట స్వాతంత్ర్యోద్యమ సమయంలో గ్రంథాలయోద్యమ పునాది అలాగే పడింది. అది ఎంత బలమైనదంటే.. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా చెక్కు చెదరనేలేదు. స్వాతంత్ర్యోద్యమానికి ఊపిరి పోయడంతో పాటు జాతి సఖ్యత, సంస్కారం, సామాజిక స్పృహ, సాంఘిక చైతన్యానికి గ్రంథాలయాలు జ్ఞాన దీపికలై వెలిగాయి. జాతి ఔన్నత్యానికి, ఉన్నతికి కొలమానంగా నిలిచాయి. నాడు అంతటి విజ్ఞాన సుగంధాలను వీచిన గ్రంథాలయాల పరిస్థితి నేడు ఎలా ఉందంటే.. ప్రశ్నలు తప్ప సమాధానాలు రావు. నాడు గ్రంథాలయాలు జాతీయోద్యమాన్ని పూరిస్తే.. నేడు గ్రంథాలయాల వికాసానికి ఉద్యమం సారించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి మారడానికి రాష్ట్ర గ్రంథాలయ శాఖ కమిటీ నడుంబిగించింది. గ్రంథాలయాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజలకు పుస్తకపఠనం, ప్రయోజనాలను వివరించి, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. బెజవాడ వేదికగా ఆదివారం గ్రంథాలయ పునర్వికాస వేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సులు నిర్వహించనుంది.



- కథనం 8లో



లక్ష సౌర గృహాలే లక్ష్యం

మూడేళ్లలో పూర్తిచేసేలా జిల్లా యంత్రాంగం అడుగులు

- ఇప్పటి వరకు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు 79,871
- సోలార్ ప్లాంట్లు ఏర్పాటుచేసే 10,470 మంది వెండర్ల నియామకం
- మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో ముందుకు

6లో

విచారణాధికారినే మార్చేశారు..!

కొంగర మల్లయ్యగట్టు అక్రమ తవ్వకాల్లో నిజాలు బయటపడతాయనే..

ఫలించిన సిండికేట్ త్రయం పెద్దల లాబీయింగ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అక్రమ వ్యవహారాలు నిగ్గు తేలతాయన్న భయంతో ఓ సిండికేట్ త్రయం ఏకమై విచారణాధికారినే సాగనంపారు. జగ్గయ్యపేటలోని కొంగర మల్లయ్యగట్టులో నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనిపై 'ఆంధ్రజ్యోతి' సమగ్ర వివరాలతో కథనాన్ని ప్రచురించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా తవ్వేసి మళ్లీ ఇప్పుడు కలిసికట్టుగా దోపిడీకి పాల్పడుతున్న వైనాన్ని ఎత్తిచూపింది. అధికార, ప్రతిపక్ష నాయకులే సిండికేట్‌గా మారి ఈ దోపిడీకి తెరతీశారు. ఆంధ్రజ్యోతి కథనం నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ విచారణకు ఆదేశించారు. ప్రాథమిక విచారణ వెలుగుచూసిన అంశాలతో సమగ్ర విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా జిల్లా సివిల్ సప్లయిస్ డీఎంను నియమించారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో డీఎం పసిగట్టడంతో సిండికేట్‌లోని ఓ నేత భయపడ్డారు. పార్టీ మారటంతో మిగతా 6లో..

పశ్చిమకు న్యూ లుక్

సితార జంక్షన్ ఆధునికీకరణకు ప్రతిపాదనలు

- పాతబస్తీ ప్రధాన రోడ్ల వెంబడి ఈట్ వాక్ కాంప్లెక్స్‌లు
- నగరంలోని రోడ్ల వెంబడి పాత్‌వేలు, సైకిల్ ట్రాక్స్, గ్రీన్‌బెల్ట్స్
- పంజా సెంటర్‌లో వ్యాపారాల కోసం ఎలివేటెడ్ కారిడార్
- ప్రణాళికలు తయారు చేయించిన ఎమ్మెల్యే సుజనాచౌదరి
- నిధుల సమీకరణ యత్నాలు.. త్వరలోనే కార్యరూపం 8లో

సత్కార్యం

అమరావతి రైతులకు ప్రధాని చేతులమీదుగా సత్కారం

పునర్నిర్మాణ శంకుస్థాపన సభలో చేయాలని నిర్ణయం

రాజధాని అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన పనుల్లో మరో సత్కార్యానికి కూడా శ్రీకారం చుట్టారు. రాష్ట్ర రాజధాని కోసం తమ విలువైన భూములను త్యాగం చేసిన రైతులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా సన్మానించనున్నారు. ఈ సన్మానం అందుకునే 30 మంది రైతుల ప్రాథమిక జాబితా ఇప్పటికే ఎంపిక చేయగా, త్వరలో ఖరారు చేయనున్నారు.

- మొత్తం 30 మంది రైతులు ప్రాథమిక ఎంపిక
- ఇంకా మార్పులు చేర్పులు చేసే అవకాశం
- ఆనందం వ్యక్తం చేస్తున్న అమరావతి రైతులు
- తుది దశకు చేరిన సభా ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధానికి భూములను త్యాగం చేసిన రైతులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా సన్మానించాలని ప్రభుత్వం భావిస్తోంది. అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమం నిమిత్తం వచ్చేనెల 2వ తేదీన ప్రధాని రానుండగా, భూములిచ్చిన రైతుల్లో 30 మందిని ఎంపిక చేసి సన్మానం చేయించాలనే ఆలోచన చేస్తున్నారు. ప్రాథమికంగా రైతులను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఇలా ఎంపికైన వారిలో వెంకటపాలెం నుంచి బి.నరసింహారావు, ఎర్రబాలెం నుంచి ఆకుల ఉమామహేశ్వరరావు, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణాయపాలెం నుంచి కిరణ్, మందడం నుంచి శ్రీనివాసరావు, బుజ్జి, బెజవాడ రమేశ్, వెలగపూడి నుంచి గద్దె భాను, కారుమంచి నరేంద్ర, ఉద్దండరాయునిపాలెం నుంచి చలపతిరావు, లింగాయపాలెం నుంచి ఆనుమోలు గణేశ్, రాయపూడి నుంచి సాహెబ్ జాన్, దొండపాడు నుంచి గిరిజ, వరప్రసాద్, కొమ్మినేని శివయ్య, తుళ్లూరు నుంచి గోవిందమ్మ, కోటా అప్పారావు, బెంగళూరు సాంబశివరావు, అనంతవరం నుంచి బండి దుర్గ, నెక్కల్లు నుంచి చిన్ని, రాయపూడి నుంచి చిలకా బసవయ్య, ఉద్దండరాయునిపాలెం నుంచి పులి చిన్నా, గుజ్జర్లపూడి అనిత, పువ్వాడ సుధాకర్, వెంకటపాలెం నుంచి లంక శైలజతో పాటు జమ్ముల శ్యామ్‌కిషోర్, కొమ్మినేని సత్యనారాయణ ఉన్నారు. ఈ జాబితాను అధికారికంగా ఖరారు చేయలేదు. మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉంది.

రూ.30,885 కోట్ల పెట్టుబడులు

అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన పనుల నేపథ్యంలో రాజధానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయని సీఆర్‌డీఏ అధికారులు అంచనా వేస్తున్నారు. రాజధాని పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడానికి ముందే.. అంటే ఇప్పటికే రూ.30,885.5 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఎడ్యుకేషన్, ఆర్‌అండ్‌డీ విభాగంలో బిట్స్ అమరావతి, ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ, వీఐటీ ఏపీ, ఏఐఐఎంఎస్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమయ్యాయి. ప్రభుత్వ రంగంలో సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, విదేశీ భవన్, హడ్కో, హెచ్‌సీఎల్ వంటి సంస్థలు ముందుకొచ్చాయి. ఆరోగ్య రంగంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, బసవతారకం కేన్సర్ ఆసుపత్రి, ఈఎస్ఐసీ, బ్యాంకింగ్ రంగంలో ఆర్‌బీఐ, నాబార్డు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు ఏర్పాటు కానున్నాయి. ఆతిథ్య రంగంలో హిల్టన్, మారియట్, నోవాటెల్, క్రౌన్ ప్లాజా వంటి సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. కాగా, అమరావతి పునర్నిర్మాణ పనుల తర్వాత భారీ ఎత్తున పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా క్వాంటమ్ వ్యాలీ సెక్టార్‌లో భారీ పెట్టుబడులు రావచ్చని భావిస్తున్నారు.



గ్యాలరీల తుదిదశ పనుల్లో నిమగ్నమైన కార్మికులు

తుదిదశకు చేరుకుంటున్న ఏర్పాట్లు

అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన సభ ఏర్పాట్లు తుదిదశకు చేరుకుంటున్నాయి గ్యాలరీలు, వేదికల పనులు పూర్తికావచ్చాయి. మోదీ కూర్చునే వేదికపై 20 మంది అతిథులకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఈ వేదిక పక్కనే వివిధ రంగాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు 30 మంది కూర్చునేలా మరో వేదికను సిద్ధం చేస్తున్నారు. ప్రధాన వేదిక దిగువన ముందు వరసన ప్రజాప్రతినిధులు, అధికారులు కూర్చోవటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఐదు వేల మంది రైతులు కూర్చునేలా గ్యాలరీలు సిద్ధమవుతున్నాయి.

సీసీఎస్‌లో దొంగాట

బైక్ రికవరీలో పోలీసుల మధ్య సమన్వయలోపం

హీరోయిన్‌ను విలన్ ఎత్తుకుపోతాడు. హీరోకు ఫోన్‌చేసి హీరోయిన్‌ను కాపాడుకోమని తానున్న ప్రదేశాన్ని చెబుతాడు. హీరో అక్కడికి వెళ్లేసరికి మరో ప్రదేశానికి మార్చేస్తాడు. సినిమాల్లో తరచూ కనిపించే సీన్లు ఇవి. ఇటువంటి సీన్ పోలీసు కమిషనరేట్‌లోని సీసీఎస్‌లో సాక్షాత్కరించింది. చోరీ అయిన మోటారు సైకిల్ దొరికిందని పోలీసులు దాని యజమానికి ఫోన్ చేశారు. పోలీస్ స్టేషన్‌కు రమ్మన్నారు. అక్కడి నుంచి మరో పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. తీరా అక్కడికి వెళ్లాక మోటారు సైకిల్ తమ వద్ద ఉందని మరో స్టేషన్ నుంచి ఫోన్ చేశారు. విజయవాడలో చోరీ అయిన బైక్ కోసం మొదట కోదాడకు, అక్కడి నుంచి వీరులపాడుకు ముప్పుతిప్పలు పెట్టి తిప్పారు కానీ, బైక్ మాత్రం అప్పజెప్పలేదు.

- చోరీ అయ్యింది ఒక బైక్.. కేసులు మాత్రం రెండు
- బాధితులను ముప్పుతిప్పలు పెట్టిన పోలీసులు
- భవానీపురం టూ వీరులపాడు వయా కోదాడ
- మా వద్ద అంటే మా వద్ద ఉందంటూ ఫోన్లు
- రికవరీ లేకుండానే అయినట్టుగానే హడావిడి



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వన్‌టౌన్‌లో ముఠా కార్మికుడిగా పనిచేసే పిట్టా రాజు రెండు నెలల క్రితం కబేళా సెంటర్‌లో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంటి బయటపెట్టిన ఏపీ39 సీటీ 7048 నెంబరు కలిగిన పల్సర్ 220ఎఫ్ మోటారు సైకిల్‌ను దొంగలు మాయం చేశారు. దీనిపై బాధితుడు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు పలుచోట్ల సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించినా ప్రయోజనం లేకపోయింది. తర్వాత ఇంటర్, పదో తరగతి పరీక్షల బందోబస్తులో ఉండటంతో దర్యాప్తు ముందుకు సాగలేదు.

బైక్ దొరికిందని వరుస ఫోన్లు

తన బైక్ ఎప్పటికైనా దొరక్కపోతుందా అనే ఆశతో ఉన్న ఆ యువకుడు రెండు, మూడు రోజులకోసారి భవానీపురం పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. శుక్రవారం ఉదయం రాజుకు వరుసగా పదుల సంఖ్యలో ఫోన్లు వచ్చాయి. దొంగిలించిన బైక్ దొరికిందని వన్‌టౌన్ సీసీఎస్ నుంచి కొందరు, కంచికచర్ల నుంచి కొందరు ఫోన్లు చేసి పోలీస్‌స్టేషన్‌కు రావాలని చెప్పారు. దీంతో అతడు కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులకు ఫోన్ చేశాడు. ఎవరు ఎన్ని ఫోన్లు చేసినా భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు రావాలని సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ చెప్పారు. శనివారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు రాజు, అతడి స్నేహితుడు వెళ్లారు. అప్పటి వరకు మోటారు సైకిల్ తమ వద్ద ఉందన్న సీసీఎస్ పోలీసులు.. స్టేషన్‌కు వెళ్లాక కోదాడలో ఉందని చెప్పారు. భవానీపురం నుంచి అనిల్ అనే కానిస్టేబుల్ వారిని మోటారు సైకిల్‌పై కోదాడ తీసుకెళ్లారు. రాజు, అతడి స్నేహితుడిని స్టేషన్ బయట నిలబెట్టి అనిల్ లోపలకు మిగతా 6లో..

నష్టాల ప్రయాణం



జిల్లా ఆర్టీసీలో కిలోమీటరుకు రూ.1,100 నష్టం

ఆక్యుపెన్సీ 62 శాతమే.. 80 శాతం ఉంటేనే పురోగతి

విజయవాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆర్టీసీ నష్టాల బాటలో పయనిస్తోంది. కిలోమీటరుకు సుమారు రూ.1,100 నష్టం రావడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. జిల్లాలో ఎనిమిది డిపోలు (జగ్గయ్యపేట, తిరువూరు, విజయవాడ, గవర్నర్ పేట-1, 2, ఇబ్రహీంపట్నం, విద్యాధరపురం, ఆటోనగర్) ఉన్నాయి. ఈ డిపోల నుంచి రోజుకు 794 బస్సులు సుమారు 2.74 లక్షల కిలోమీటర్ల దూరం తిరుగుతాయి. వీటి నుంచి సంస్థకు రోజుకు రూ.1.10 కోట్ల ఆదాయం సమకూరుతున్నప్పటికీ వ్యయం మాత్రం ఎక్కువవుతోందని ఓ నివేదికలో తేలింది. రోజూ 62 శాతం మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నప్పటికీ నష్టాలు మాత్రం తప్పట్లేదు. ఈ శాతం పెరిగితే కానీ గండం నుంచి గట్టెక్కే పరిస్థితి లేదు. ఈ నష్టాలను అధిగమించాలంటే కనీసం 80 శాతం ఆక్యుపెన్సీ ఉండాలని డిపో మేనేజర్లు చెబుతున్నారు.

- చాలా ప్రాంతాల్లో ప్రైవేట్ బస్సులదే పెత్తనం
- ఆటోలు, క్యాబ్‌ల ద్వారా కూడా ఆదాయానికి గండి
- కాలం చెల్లిన బస్సులెక్కడానికి ఇష్టపడని ప్రయాణికులు

ఇలా చేస్తే మంచి

- ఆర్టీసీ నష్టాలను అధిగమించాలంటే తొలుత ప్రైవేట్ బస్సుల దందాలను అరికట్టాలి. బస్టాపుల వద్ద ప్రయాణికులను ప్రైవేట్ బస్సులు ఎక్కించుకుని వెళ్తున్నా సిబ్బంది, అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఆటోలు, క్యాబ్‌ల పరిస్థితి కూడా ఇదే. బస్టాపుల వద్ద పోటాపోటీగా ఎక్కించుకుంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఆర్టీసీ బస్సుల్లో చార్జీలే వసూలు చేస్తుండటంతో ప్రయాణికులు కూడా బస్సులు వచ్చే వరకు వేచి చూడకుండా ఆటోలు, క్యాబ్‌లనే ఆశ్రయిస్తున్నారు. బస్టాపుల వద్ద ప్రైవేట్ వాహనాలను అనుమతించకుండా నిలువరించడంతో పాటు సర్వీసులు వీలైనంత త్వరగా ఇవ్వగలిగితే ప్రయాణికులు ప్రైవేటువైపు చూసే అవకాశం ఉండదు.
- ఆర్టీసీలో అన్నింటి కంటే పెద్ద సమస్య కాలం చెల్లిన డొక్కు బస్సులను నడపడమే. ఇప్పుడున్న డొక్కు బస్సులు మార్గంమధ్యలో ఎక్కడ ఆగిపోతాయోననే భయంతో చాలామంది ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా కొత్త బస్సులను ఏర్పాటుచేస్తే ఆక్యుపెన్సీని పెంచవచ్చని ఆర్టీసీ సిబ్బందే చెబుతున్నారు.



పశు సంరక్షణకు రెజి వెట్ యాప్

- పాడి రైతుకు డిజిటల్ సహకారం
- కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని
- కామధేనులో యాప్ ఆవిష్కరణ 6లో

'చాటింగ్.. డేటింగ్' యువకుడి అరెస్టు

- 20 గ్రాముల బంగారం స్వాధీనం
- హైదరాబాద్‌లో అదుపులోకి..
- సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ వెల్లడి 6లో

సిబ్బంది కృషి, ప్రజల నమ్మకంతో అవార్డులు

- ఆప్కాబ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎన్.వెంకటరత్నం
- ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్‌కు 4 అవార్డులు



అవార్డు అందుకుంటున్న జనరల్ మేనేజర్ ఎన్.వెంకటరత్నం

విజయవాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది కృషి, ప్రజల నమ్మకమే ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్‌కు అవార్డులు రావడానికి కారణమని సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ ఎన్.వెంటరత్నం తెలిపారు. శుక్రవారం చెన్నైలో జరిగిన అటల్ పెన్షన్ యోజన ఫెసిలిటేషన్ ప్రోగ్రామ్, స్ట్రాటజీ రివ్యూ మీటింగ్‌లో ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమి టెడ్(ఏపీసీవోబీ)కు నాలుగు అవార్డులు(గోల్డ్ కప్, ఎక్జాంప్లరీ చాంపియన్స్ కప్, చాంపియన్స్ మెడల్, ఎక్జాంప్లరీ అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్) రావడం ఆనందంగా ఉందని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థ దూరదృష్టి, రాష్ట్రంలో తమ సంస్థకు చెందిన అన్ని శాఖల సిబ్బంది సమష్టి కృషి, కస్టమర్ల మద్దతుతోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. లావాదేవీలతో కస్టమర్ల నమ్మకాన్ని పొందడంతో పాటు బ్యాంక్ అంచెంచలుగా ఎదిగిన తీరు, అటల్ పెన్షన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సంస్థ తీసుకున్న నిర్ణయాలే సంస్థకు అవార్డులు రావడానికి కారణమని తెలిపారు.

ఉగ్రదాడి పిరికిపంద చర్య

- ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు
- నగరంలో శాంతి, సంఘీభావ ర్యాలీ



ప్రెస్‌క్లబ్ నుంచి ర్యాలీగా వెళ్తున్న జర్నలిస్టులు

గాంధీనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు చేసిన దాడిని పిరికిపంద చర్యగా ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు అభివర్ణించారు. ఇది అత్యంత దురదృష్ట కరమన్నారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ స్థానిక ప్రెస్‌క్లబ్ నుంచి ధర్నాచౌక్ వరకు శాంతి, సంఘీభావ ర్యాలీ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో శాంతి ర్యాలీలు చేపడుతున్నామన్నారు. పాకిస్తాన్ కవ్వింపు చర్యలతో నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంబడి ఉద్రిక్త వాతావరణం నెలకొందన్నారు. ఇది భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో శాంతి పరిరక్షణకు ప్రపంచ దేశాలు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచల జయరాజ్, విజయవాడ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు, ఐజేయూ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి పాల్గొన్నారు.

దుర్గమ్మను సన్నిధిలో సీపీ దంపతులు



ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో కనకదుర్గమ్మను ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు దంపతులు శనివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ అధికారులు వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ ఏఈవో చంద్రశేఖర్, ఆలయ స్థానాచార్యులు శివప్రసాదశర్మ వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది

- కేశినేని నాని వ్యాఖ్యలపై శావల దేవదత్

తిరువూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో ఓడిపోయిన కేశినేని శ్రీనివాస్(నాని) చేస్తున్న వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఏపీ ఆర్గానిక్ ప్రోడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్ విమర్శించారు. శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎంపీగా కేశినేని శివనాథ్(చిన్ని) చేస్తున్న అభివృద్ధి పనులు చూసి తట్టుకోలేక నాని అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక విధానం తీసుకురావడంతో భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని దొరికి సంతోషంగా ఉన్నారని వివరించారు.

నాడు వైసీపీ ఇసుక దోపిడీలో వాటాలు

- 'బిల్డింగ్ వర్కర్స్' అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ రఘురామరాజు

వన్‌టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జరిగిన ఇసుక దోపిడీలో వాటాలు తీసుకోవటం వల్లే మాజీ ఎంపీ కేశినేని నాని గళం మూగబోయిందని ఏపీ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు అన్నారు. శనివారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడారు. జగన్ పాలనలో ఒక మాఫియాగా ఏర్పడి ఇసుకను దోచుకున్నారన్నారు. 2019 నుంచి 2024 వరకు నాని ఎంపీగా ఉన్న సమయంలో ఇసుక అందుబాటులో లేకపోవటంతో పనులు లేక 64 మంది భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. జగన్ దగ్గర ఎంత కమీషన్ పుచ్చుకున్నారో చెప్పాలన్నారు.

కేశినేని నానిపై చర్యలు తీసుకోండి

- నున్న పోలీస్ స్టేషన్‌లో టీఎన్‌టీయూసీ నేతల ఫిర్యాదు



పాయకాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వస్తున్న ఎన్ఆర్ఐలపై సోషల్ మీడియా వేదికగా అసత్య ఆరోపణలు చేస్తూ రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్న మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని)పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని టీఎన్‌టీయూసీ నేతలు శనివారం నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎక్స్ వేదికగా తెలుగుదేశం పార్టీ విజయవాడ ఎంపీ కార్యాలయాన్ని కరుడుగట్టిన తీవ్రవాది చార్లెస్ శోభరాజ్ కార్యాలయంగా చూపించడాన్ని నేతలు తప్పుబట్టారు. రాష్ట్రాభివృద్ధిని ఓర్చుకోలేని నానిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీఐ కృష్ణమోహన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో నేతలు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో పరుచూరి ప్రసాద్, చరణ్‌సాయి యాదవ్, ఆకుల సూర్యప్రకాష్ తదితరులు ఉన్నారు.

లక్ష సౌర గృహాలే లక్ష్యం!



లక్ష సౌర గృహాలే లక్ష్యంగా ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోంది. 2026-27 నాటికి ఈ లక్ష్యాన్ని పూర్తి చేయాలని నిర్దేశించుకుంది. కిందటి ఆర్థిక సంవత్సరం 2024 - 25లో జిల్లాలో 20 వేల సౌర గృహ యూనిట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నప్పటికీ ఆచరణలో పూర్తిస్థాయిలో అమలు జరగలేదు. ఎన్నికలు రావటం, అనంతరం ఈ పథకం ముగియుటానికి కొద్ది నెలలు మాత్రమే గడువు ఉండటంతో క్షేత్రస్థాయిలో ఈ పథకాన్ని ముందుకు తీసుకువెళ్లలేకపోయింది. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం గడువును మరో ఐదేళ్లపాటు పెంచటంతో సౌర గృహాల లక్ష్యం దిశగా ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం మళ్లీ కదులుతోంది.

మూడేళ్లలో పూర్తి చేసేలా జిల్లా యంత్రాంగం అడుగులు

- ఇప్పటి వరకు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు 79,871
- సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుకు 10,470 మంది వెండర్ల నియామకం
- మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో ముందుకు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కేంద్ర ప్రభుత్వం ఈ పథకం గడువును మరో ఐదేళ్లపాటు పెంచటంతో సౌర గృహాల లక్ష్యం దిశగా ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం మళ్లీ కదులుతోంది. కిందటి ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యంతో పాటు ఈ ఏడాది రెట్టింపు లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని కార్యరూపంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 20 వేల సౌర గృహ యూనిట్లను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంగా నిర్దేశించుకోగా.. 2025-26 ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దీనికి రెట్టింపుగా అంటే 40,000 సౌర గృహ యూనిట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2026 - 2027 నాటికి మరో 40,000 సౌర గృహ యూనిట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. మొత్తంగా మూడేళ్లలో లక్ష సౌరగృహ యూనిట్లను లక్ష్యంగా పెట్టుకుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ 2026- 27 నాటికి ఈ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్న దిశగా ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందులో డ్వాక్రా, డ్వాక్వా మహిళా స్వయం సహాయక సంఘాలను భాగస్వామ్యం చేస్తోంది. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులందరి చేత తమ ఇళ్లపై సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే విధంగా వారిని కొద్ది రోజులుగా చైతన్య పరుస్తోంది. బ్యాంకర్లను కూడా స్వయం సహాయక సంఘాలకు టై అప్ చేస్తూ ఉధృతంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళుతోంది. సౌర ఫలకాలను బిగించే వెండర్లను కూడా పెద్ద ఎత్తున గుర్తిస్తోంది.

పెరిగిన దరఖాస్తులు

ప్రస్తుతం జిల్లాలో ఉధృతంగా జరుగుతున్న అవగాహనా కార్యక్రమాల వల్ల ఇప్పటివరకు 79,871 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 79,709 దరఖాస్తులకు అనుమతి ఇవ్వడం జరిగింది. మరో 162 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. కేవలం ఒకే ఒక్క దరఖాస్తును మాత్రమే తిరస్కరించారు. ఎందుకంటే ఇంటి మీద సౌరఫలకలు పెట్టుకునే పరిస్థితి లేదు. సౌర ఫలకలు పెట్టుకోవటానికి తగిన చోటు ఉండి ఉండాలి. అలాంటి పరిస్థితి లేనప్పుడు ఆ దరఖాస్తులను తిరస్కరించడం జరుగుతుంది. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి వస్తున్న విశేష స్పందనను దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగం సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేసే వెండర్లను కూడా పెద్ద ఎత్తున నియవిుస్తోంది. ప్రస్తుతం 10,470 వెండర్లను నియవిుంచుకోవడం జరిగింది. ఇప్పటివరకు 988 సౌర గృహ యూనిట్లను పూర్తి చేశారు. వాస్తవానికి వస్తున్న దరఖాస్తులకు, పూర్తవుతున్న సౌర గృహ ప్లాంట్లకు చాలా తేడా ఉంది. ఎందుకంటే విద్యుత్ శాఖ నుంచి ఫీజుబిలిటీ రిపోర్ట్, పరిశీలన, ఇతర అనుమతులు కూడా అవసరం. అలాగే వెండర్ల సమస్య ఉండటం కూడా జాప్యానికి కారణమవుతోంది. జిల్లా యంత్రాంగం వీటిపై కూడా ప్రస్తుతం దృష్టి సారించింది. విద్యుత్ శాఖ పరిధిలో వెంటనే అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకుంటోంది.

ఐదు గ్రామాల్లో సంపూర్ణ సౌర గృహాల లక్ష్యం

ఎన్టీఆర్ జిల్లాలోని ఐదు గ్రామాల్లో నూరు శాతం సంపూర్ణ సౌర విద్యుత్ గృహాలను తీర్చిదిద్దాలని జిల్లా యంత్రాంగం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. జగ్గయ్యపేటలో బోదవాడ, షేర్ మహమ్మద్ పేట, కంచికచర్లలో పరిటాల, మైలవరంలో వెల్వడం, కంభంపాడులో అడవినెక్కలం గ్రామాలను సంపూర్ణ సౌర గృహ గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా యంత్రాంగం గుర్తించింది. 2026 - 27 నాటికి ఈ గ్రామాలలోని గృహాలన్నీ కూడా సౌరవెలుగులతో విరాజిల్లేలా జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందించింది. స్వయం సహాయక సంఘాల సభ్యులే కాకుండా.. ఆ గ్రామంలో ప్రతి ఇంటికీ సచివాలయ సిబ్బందిని పంపించి ఈ పథకం ప్రయోజనం గురించి వారికి వివరించి వారి అంగీకార పత్రాన్ని తీసుకొని ప్రతి ఇంటిపైనా సౌర పలకలను ఏర్పాటు చేసి సౌరకాంతులను నింపాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. దీని కోసం స్వచ్ఛంద సంస్థలు, ఇతర ఎన్జీవోల సహాయ, సహకారాలను కూడా తీసుకోవాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పీ-4 పథకంలో భాగంగా కూడా పెద్ద పెద్ద కంపెనీల నుంచి సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఆయా గ్రామాలలో పేద ప్రజల గృహాలపై సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయటానికి సహాయ సహకారాలను తీసుకోవాలని కూడా జిల్లా యంత్రాంగం భావిస్తోంది. ఎవరైనా స్వచ్ఛందంగా వచ్చి స్పాన్సర్ చేస్తామన్నా వారి పేరుతో ఎంపిక చేసిన గ్రామాలలోని పేదల ఇళ్లపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తారు.

పశువుల సంరక్షణకు 'రెజి వెట్ కేర్' యాప్

- పాడి రైతుకు డిజిటల్ సహకారం
- కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు
- కామధేనులో రెజి వెట్ కేర్ యాప్ ఆవిష్కరణ



రెజి వెట్ కేర్ యాప్ ఆవిష్కరణలో కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యుడు దాసరి బాలవర్ధనరావు తదితరులు

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమ అభివృద్ధి మేలు జాతి పశువుల ఉత్పత్తి ద్వారానే సాధ్యమని.. అందుకే కృష్ణామిల్క్ యూనియన్ ద్వారా పాడి రైతులకు డిజిటల్ సహకారం అందించే విధంగా రెజి వెట్ కేర్ యాప్ రూపొందించిన ట్లు కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లి ప్రాజెక్ట్ కామధేను(పాల ఫ్యాక్టరీ)లో శనివారం ప్రపంచ పశువైద్య దినోత్సవ సందర్భంగా రెజి వెట్ కేర్ యాప్‌ను పాలకవర్గ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ పాడి రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కృష్ణామిల్క్ యూనియన్ కృషి చేస్తుందన్నారు. రెజి వెట్ కేర్ యాప్ వల్ల పాడి రైతులు తమ పశువుల ఆరోగ్యం, మేలుజాతి సంతానోత్పత్తి, పోషణ తదితర విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలవుతుందని చెప్పారు. మేలు జాతి పశువుల ఉత్పత్తే లక్ష్యంగా నాణ్యమైన మేలుజాతి వీర్యంతో ఆర్టిఫిషియల్ ఇన్సెమినేషన్‌తో అత్యధిక పాల ఉత్పత్తి సాధించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. పాల ఉత్పత్తిని పెంపొందించేందుకు మేలు జాతి పశువులు, నాణ్యమైన పశువైద్యం, పర్యవేక్షణ నిమిత్తం గత ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.4 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. పాడిరైతులు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా మేలుజాతి పశువుల ఉత్పత్తి తద్వారా పాల ఉత్పత్తి పెంచుతూ మనదైన కృష్ణామిల్క్ యూనియన్ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండీ కొల్లి ఈశ్వరబాబు, జిల్లా పాలకవర్గ సభ్యులు డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, శనగల వెంకటశివజ్యోతి, పల్లగాని కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

'చాటింగ్.. డేటింగ్' యువకుడి అరెస్టు

- 20 గ్రాముల బంగారం స్వాధీనం
- సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్



నిందితుడిని మీడియా ఎదుట హాజరుపర్చిన ఏసీపీ దామోదర్, మాచవరం సీఐ ప్రకాష్

గుణదల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డేటింగ్ యాప్ ద్వారా యువతులను పరిచయం చేసుకుని, తాను బిజినెస్ మ్యాన్‌నని నమ్మించి వారిని హోటల్‌కు పిలిపించుకుని బంగారు నగలతో ఉడాయించే యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 20 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. మాచవరం పోలీస్ స్టేషన్లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఆయన మాటల్లో.. కోనసీమ జిల్లాకు చెందిన యువతి ఓ కంపెనీలో పనిచేయు నిమిత్తం విజయవాడ వచ్చి వెటర్నరీ కాలనీలో హాస్టల్‌లో ఉంటుంది. సదరు యువతికి రెండు నెలల క్రితం లవ్లీ డేటింగ్ యాప్‌లో చౌదరి అనే యువకుడు పరిచయమయ్యాడు. తాను బిజినెస్ మ్యాన్‌నని, తనది విశాఖపట్నం అని చెప్పి కొద్ది రోజులు టెలిగ్రామ్ యాప్ ద్వారా మాట్లాడుకున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 21వ తేదీన ఫోన్ చేసి హోటల్‌కు రమ్మని చెప్పగా, మరుసటి రోజు 22వ తేదీన యువతి హోటల్‌కు వెళ్లింది. అక్కడ వారు మాట్లాడుకునే క్రమంలో బలవంతం చేయాలని ప్రయత్నించగా, యువతి ప్రతిఘటించడంతో యువకుడు జేబులోని కత్తిని బయటికి తీసి బెదిరించాడు. ఆమె ధరించిన బంగారు ఆభరణాలన్నీ లాక్కుని చేతులు కట్టేసి అక్కడి నుంచి ఉడాయించాడు. కొద్ది సేపటి తర్వాత ఆమె అక్కడి నుంచి బయటపడి మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మాచవరం సీఐ ప్రకాష్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తును వేగవంతం చేశారు. నిందితుడు బాపట్ల జిల్లాకు చెందిన కిలారి నాగతేజ(23)గా గుర్తించారు. అతని తల్లిదండ్రులు బతుకు దెరువు నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు. నాగతేజ బీటెక్ చదువుకునే క్రమంలో చెడు వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించేందుకు ఈ విధానాన్ని ఎంచుకుని, ఇప్పటికే హైదరాబాద్ పరిసరాల్లో పలువురు యువతులను మోసం చేసి జైలుకు వెళ్లినట్లు ప్రాథమికంగా ఆధారాలు సేకరించారు. కిలారు నాగతేజను కనకదుర్గ వారధి వద్ద అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 20 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. 2023లో నాగతేజ హైదరాబాద్‌లోని ఎల్.బి.నగర్, చైతన్యపురి, మెయినాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ముగ్గురు యువతులను నమ్మించి ఇదే తరహాలో బంగారు నగలతో ఉడాయించినట్లు రికార్డులు ఉన్నాయి. గత ఫిబ్రవరిలోనే జైలు నుంచి నాగతేజ బయటికి వచ్చాడు. కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన మాచవరం సీఐ ప్రకాష్, ఎస్ఐ జి.శంకర్, సిబ్బందిని సీపీ ఎస్వీ రాజశేఖర్ బాబు అభినందించారు.

సీసీఎస్‌లో దొంగాట

(5వ పేజీ తరువాయి)

వెళ్లారు. ఇంతలో రాజుకు వీరులపాడు నుంచి శివ అనే కానిస్టేబుల్ ఫోన్ చేశారు. మోటారు సైకిల్ తమ వద్ద ఉందని, వెంటనే రావాలని చెప్పారు.

ఒక బైక్.. రెండు కేసులు..

బైక్ తమ ఉందని చెప్పిన వీరులపాడు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ శివ.. ఆ తర్వాత ఫిర్యాదును తెరపైకి తెచ్చారు. మళ్లీ మాట మార్చి.. బైక్ తమ వద్ద లేదని, తెలంగాణలోని మధిర పోలీస్‌స్టేషన్‌లో ఉందని చెప్పారు. ఈ చోరీ ఘటనపై ఇప్పటికే భవానీపురం సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. వీరులపాడు పోలీసులు మాత్రం తమ పోలీస్‌స్టేషన్ పరిధిలో మోటారు సైకిల్ చోరీ అయినట్టుగా ఫిర్యాదు ఇవ్వాలని బాధిత యువకుడికి చెప్పడం గమనార్హం. చోరీ అయిన బైక్ దొరక్కుండానే తమ వద్ద ఉందంటే.. తమ వద్ద ఉందంటూ పోలీసులు బాధితుడికి చెప్పడం, అతడిని జిల్లా అంతటా తిప్పడం.. పోలీస్ సిబ్బంది మధ్య సమన్వయలోపాన్ని తెలియజేస్తోంది. రాజు నుంచి ఫిర్యాదు స్వీకరించిన భవానీపురం సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేయకుండా దర్యాప్తు చేస్తున్నట్టుగా చెప్పుకొచ్చారు. మోటారు సైకిల్‌ను రప్పించాలంటే ఫిర్యాదు చేయాల్సిందేనని, అప్పుడు మాత్రమే కేసు నమోదు చేస్తామని వీరులపాడు పోలీసులు చెప్పడం కొసమెరుపు.

విచారణాధికారినే మార్చేశారు..!

(5వ పేజీ తరువాయి)

తనకు వచ్చిన అధికారాన్ని ఆసరాగా చేసుకుని ఓ కీలక నేతపై ఒత్తిడి తెచ్చి మరీ నెల రోజుల్లోనే డీఎంను బదిలీ చేయించారు. ఆయన యథాతథంగా రిపోర్టు ఇస్తే సిండికేట్ త్రయం వ్యాపారానికి ఎక్కడ దెబ్బ పడుతుందోనని భావించే ఈ పనిచేశారు. అంతకుముందు ఉన్న సివిల్ సప్లయిస్ డీఎంను తీసుకొచ్చుకున్నారు. ఈయన కూడా గతంలో ఈ సిండికేట్ త్రయం ఇలాకాలోనే పనిచేయగా, అనూహ్యంగా కొద్ది నెలలకే బదిలీ అయ్యి వెళ్లిపోయారు. ఈ అంశంపై కలెక్టర్ లక్ష్మీశ దృష్టి సారించి విచారణాధికారిని మార్చాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

బీజేపీ నేతలవి ఒట్టిమాటలే

- సీపీఎం నాయకుడు బాబూరావు

విజయవాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతలవి ఒట్టిమాటలేనని, అమరావతిపై కపట ప్రేమ కురిపించడం తప్ప నిర్మాణాల ఊసే ఎత్తడం లేదని సీపీఎం నాయకుడు బాబూరావు విమర్శించారు. ప్రధాని మోదీ మే 2న రాజధాని పర్యటనకు రాబోతున్న సందర్భంగా సీపీఎం నాయకులు కేంద్ర ప్రభుత్వ సంస్థలకు కేటాయించిన స్థలాలు, వాటి పురోగతిని శనివారం పరిశీలించారు. సీపీఎం నాయకుడు బాబూరావు మాట్లాడుతూ రాజధాని విషయంలో సుమారు తొమ్మిదేళ్ల కాలాన్ని కేంద్ర ప్రభుత్వం వృథా చేసిందన్నారు. పలు కేంద్ర కార్యాలయాలకు కేటాయించిన స్థలాలను కనీసం స్వాధీనం చేసుకోవడమో, ఒప్పందం చేసుకోవడమో వంటివి జరగలేదని చెప్పారు. అత్యంత ముఖ్యమైన రిజర్వ్ బ్యాంక్, సీఏజీ, సీబీఐ, నేవీ, ఆర్మీ, పోస్టల్, ప్రభుత్వ బ్యాంకులు, ఎల్ఐసీ, ఆయిల్ సంస్థలు, హడ్కో, ఫ్యాషన్ టెక్నాలజీ, కేంద్రీయ విద్యాలయాలు, పలు సాంకేతిక సంస్థలకు కేటాయించిన స్థలాల్లో నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు నిర్మాణాలు జరిగి ఉంటే ప్రజలకు కనీసం ఉపాధి లభించి, వారి అభివృద్ధికి సహాయపడేదన్నారు. దీంతో అనేక ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో పాటు రాజధాని అభివృద్ధిలో కీలకమవడానికి అవకాశం ఉండేదన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- పౌరసరఫరాల మేనేజర్ టి.వి. సతీష్

విజయవాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రప్రదేశ్): దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యాన్ని విక్రయించే రైతులు జిల్లాలోని కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ టి.వి.సతీష్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. జిల్లాలో మొత్తం 107 రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గోనె సంచులతో పాటు కూలీలు, రవాణా సౌకర్యం అవసరమైనవారికి వాహనాలు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఏ- గ్రేడ్ ధాన్యానికి కనీస మద్దతు ధర రూ. 2,320 గాను, సాధారణ రకం ధాన్యానికి రూ.2,300 నిర్ణయించినట్లు తెలిపారు. తిరువూరు డివిజన్ పరిధిలో 41, విజయవాడ డివిజన్‌లో 25, నందిగామ డివిజన్‌లో 41 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వాతావరణం ప్రతికూలంగా ఉన్న సమయంలో కూడా కొనుగోలు కేంద్రాల దగ్గర కనీస మద్దతు ధరకు అమ్ముకోవచ్చని తెలిపారు. వాతావరణం దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో 1000 టార్పాలిన్లు అందుబాటులో ఉంచామని, ఎంటీయు 1010 రకం ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీవో 131తో హోటల్, పర్యాటకం అభివృద్ధి

- ఏపీ హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి. స్వామి



ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్.వి.స్వామి

విజయవాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం హోటళ్లలో బార్ల లైసెన్సు ఫీజులను తగ్గిస్తూ తీసుకొచ్చిన జీవో 131 హోటల్, పర్యాటక రంగ అభివృద్ధికి మేలు చేస్తుందని రాష్ట్ర హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా త్రీ స్టార్, అంతకన్నా పెద్ద స్టార్ హోటళ్లలో బార్ల లైసెన్సు, నాన్ రిఫండబుల్ రిజిస్ట్రేషన్ చార్జీని తగ్గించి ఆతిథ్య రంగానికి ఊతమిచ్చేలా నిర్ణయం ప్రభుత్వం తీసుకోవడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. త్రీస్టార్, అంతకన్నా పెద్ద హోటళ్లలో మద్యం అమ్మకాలకు సంబంధించి బార్ లైసెన్సింగ్ ఫీజుల్లో మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 131ను స్వాగతిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు రాష్ట్ర హోటల్ అసోసియేషన్ రుణపడి ఉంటుందన్నారు. ఈ నిర్ణయంతో రిజిస్ట్రేషన్ చార్జీ రూ.66 లక్షల నుంచి రూ.25 లక్షలకు తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వల్ల హోటల్ రంగానికి మేలు చేసినట్లు అయిందన్నారు. దీంతో పర్యాటక రంగంతో పాటు ఆతిథ్య రంగాల అభివృద్ధికి ఈ జీవో దోహదపడుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేనంత ఎక్కువ రిజిస్ట్రేషన్ చార్జీలు ఇక్కడ ఉండడంతో తమ ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి తమిళనాడు, ఢిల్లీ, మహారాష్ట్ర పశ్చిమ బంగాల్, కర్ణాటక రాష్ట్రాలతో సమానంగా లైసెన్సు ఫీజులను సవరిస్తూ ఆదేశాలు జారీ చేశారని స్వామి తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130,139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 425

ఆహార పొట్లాల పంపిణీ

పటమట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకాని రామ్మోహన్‌రావు 20వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు తరుణ్ కాకాని శనివారం బెంజిసర్కిల్‌లో పేదలకు ఆహార పొట్లాలు, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ధనశేఖర్, రమణ వేములపల్లి, ఉమ్మడి రామకృష్ణ, మోతుకూరి వెంకటేశ్వరరావు, పి.ఎస్.వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





అయ్యప్పనగర్‌లో మహిళల ర్యాలీ

ఉగ్రదాడికి నిరసనగా మహిళల శాంతి ర్యాలీ



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఆచార్య రామానుజ సంక్షేమ సమితి సభ్యులు

పటమట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడులకు నిరసనగా 12వ డివిజన్‌లో అయ్యప్పనగర్ భాస్కర్‌హోమ్స్ కమ్యూనిటీకి చెందిన మహిళలు శనివారం సాయంత్రం గోగుల ధనశేఖర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్, సీహెచ్ రవికిషోర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల నిరసన

భారతీనగర్: పహెల్గాంలోని పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ మహానాడురోడ్డు సెంటర్‌లోని ఎన్టీఆర్ వైద్యవిశ్వవిద్యాలయం వద్ద శనివారం సాయంత్రం ఆచార్య రామానుజ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ విశ్వ విద్యాలయం నుంచి భారతీనగర్ సెంటర్ వరకు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆచార్య రామానుజ సంక్షేమ సమితి సభ్యులు, న్యాయవాదులు కమతం నాగేంద్ర రెడ్డి, కర్లపూడి అఖిల, స్థానికులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని అందుకోవాలంటే క్రమశిక్షణ తప్పనిసరి

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు సోమేశ్వరరావు

మొగల్రాజపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని అందుకోవాలంటే క్రమశిక్షణ ముఖ్యమని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు సోమేశ్వరరావు చెప్పారు.

పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో ఉన్న సాయిమేథ కోచింగ్ సెంటర్‌లో డైరెక్టర్ ఎం. బాలకృష్ణ ఆధ్వర్యంలో శనివారం క్రమశిక్షణ- నడవడిక- ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలతోనే కాకుండా ప్రవర్తన, నడవడిక, సమయ పాలన వంటి లక్షణాలను అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ సెట్ 2025కి సిద్ధం అవుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

వేగంగా సాగుతున్న

హైటెన్షన్ రోడ్డు పనులు

● స్థల సేకరణలో జాప్యం...నిలిచిన పనులు ● కూటమి అధికారంలోకి వచ్చాక పనులు ప్రారంభం



గురునానక్ రోడ్డు న్యాక్ కల్యాణమండపం సమీపంలో జరుగుతున్న హైటెన్షన్ రోడ్డు పనులు

భారతీనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గంలోని పలు డివిజన్లను కలుపుతూ జాతీయ రహదారికి ప్రత్యామ్నాయంగా వేసిన హైటెన్షన్ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే పంటకాలువ రోడ్డు నుంచి కరెన్సీనగర్ కాలనీ వరకు రోడ్డు నిర్మించారు. గురునానక్ రోడ్డు న్యాక్ కల్యాణమండపం సమీపంలో స్థలం సేకరణలో కొంత జాప్యం ఏర్పడి పనులు మధ్యలో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు పలుమార్లు స్థానిక స్థల యజమానులతో చర్చించారు. నగరపాలక సంస్థ నుంచి వారికి బాండ్లు అందించే చర్యలు ప్రజాప్రతినిధులు చేపట్టడంతో సుమారుగా గత ఐదు ఏళ్ల నుంచి నిలిచిపోయిన న్యాక్ కళ్యాణమండపం సమీపంలో హైటెన్షన్ రోడ్డు పనులు శనివారం వేగంగా జరుగుతున్నాయి. సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోని తీసుకువస్తామని అధికారులు తెలుపుతున్నారు.

సేవతో ప్రజల మన్ననలు పొందొచ్చు

22వ డివిజన్‌లో మెడికల్ క్యాంపులో మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా



మందులు అందజేస్తున్న వంగవీటి రాధాకృష్ణ, గద్దె క్రాంతికుమార్, బొప్పన భవకుమార్

కృష్ణలంక, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : సేవ చేయడం ద్వారానే ప్రజల మన్ననలు పొందవచ్చని, సేవ ద్వారానే రాజకీయాలలో కూడా గుర్తింపు వస్తుందని టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ పేర్కొన్నారు. శనివారం కృష్ణలంక 22వ డివిజన్‌లోని గంగానమ్మ గుడి వద్ద నాగవరపు గణేష్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కృష్ణ సుధీర్, స్వర హాస్పటల్ సహకారంతో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వంగవీటి రాధాకృష్ణ, గద్దె క్రాంతికుమార్, బొప్పన భవకుమార్‌లు ప్రారంభించారు.ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ పేద ప్రజలు వుండే కృష్ణలంకలో ఇటువంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా వుందన్నారు. గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై వుందన్నారు. బొప్పన భవకుమార్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించుకొనేందుకు వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పలిశెట్టి అన్నారావు, గొరిపర్తి నామేశ్వరరావు, తోట శ్రీనివాస్, పెద్ది అన్నారావు, నిమ్మల జ్యోతిక, స్వర హాస్పటల్ మేనేజర్ రత్నరాజు, డాక్టర్లు సుకుమార్, శ్వేత, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

ప్రయాణికుడు మర్చిపోయిన కెమెరాను అందజేసిన వైనం



కెమెరాను యజమానికి అందజేస్తున్న గుణదల పోలీసులు

గుణదల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి ఆటోలో మర్చిపోయిన కెమెరాను పోలీసు లకు అందజేసిన ఆటోడ్రైవర్‌ను గుణదల పోలీస్‌స్టేషన్ సీఐ వాసి రెడ్డి శ్రీనివాస్ అభినందించారు. హైదరాబాద్‌కు చెందిన పి.మ హేష్ ఈనెల 23న గ్రాండ్ హోటల్‌లో ఈవెంట్‌లో పాల్గొనేం దుకు వచ్చాడు. ఈవెంట్ పూర్తయిన తర్వాత తిరిగి హైదరాబాద్ వెళ్లడానికి బస్టాండ్‌కి ఉబర్ యాప్ ద్వారా ఆటో బుక్ చేసుకున్నాడు. ఆటోలో బస్టాండ్ వెళ్లిన మహేష్ ఆటోలో తన కెమెరా బ్యాగ్‌ను మర్చిపోయి వెళ్లిపోయాడు. ఆటో డ్రైవర్ శ్రీను కొద్ది సేపటి తర్వాత చూసుకుంటే ఆటో వెనుక సీట్లో కెమెరా బ్యాగ్ కనిపించింది. దీంతో సదరు బ్యాగ్‌ను గుణదల పోలీస్‌స్టేషన్లో అప్పగించాడు. గ్రాండ్ హోటల్ వద్దకు వెళ్లి మహేష్ వివరాలు తీసుకుని అతనికి కాల్ చేసిన గుణదల సీఐ ఆటో డ్రైవర్ శ్రీను సమక్షంలోనే తిరిగి కెమెరా బ్యాగ్‌ను మహేష్‌కు శనివారం అందజేశారు. ఆటో డ్రైవర్ శ్రీనును గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను అభినందించారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం

ముంబై ఎంజీఎం వైద్య కళాశాల మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సుదీప్‌రాయ్



ప్రభుత్వాసుపత్రి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ధ్యానం వలన ఒత్తిడి దూరమవుతుందని, మేధస్సు పెరుగుతుందని ముంబై ఎంజీఎం వైద్య కళాశాల మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సుదీప్‌రాయ్ అన్నారు. సిద్ధార్థ మెడికల్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థి డాక్టర్ మధు రాయ్ ఆధ్వర్యంలో సహజ యోగా ట్రస్టు తరుపున ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌శ్రీ, డాక్టర్ ఎ.ప్రభాకర్, పాల్గొన్నారు.

అన్నవరపు రామస్వామికి రాజ్యలక్ష్మి పురస్కారం



రాజ్యలక్ష్మి పురస్కారాన్ని అందుకుంటున్న అన్నవరపు రామస్వామి

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్వరఝురి సంగీత సంస్థ 37వ వార్షికోత్సవ కార్యక్రమం సత్యనారాయణపురంలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు అన్నవరపు రామస్వామి శతవసంతంలోకి అడుగిడిన సందర్భంగా చింతలపాటి రాజ్యలక్ష్మి స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. వీఎల్ నారాయణరావు రచించిన జనకరాక గ్రహభేద మంజరి పుస్తకాన్ని అన్నవరపు రామస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్తీక త్రివేణి సంగీత కచేరి ప్రేక్షకులను అలరించింది. ఆమె గాత్రానికి పెరవలి నందకుమార్ వయోలిన్‌పై కుందుర్తి అరవింద్ మృదంగంపై వాయిద్య సాకారం అందించారు. కార్యక్రమంలో ఎం. సుధాకర్, అంజని, మల్లాది సూరిబాబు,ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనరసమ్మ, రామస్వామి శిష్య ప్రశిష్యులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ల బృందం మధురై కార్పొరేషన్ సందర్శన



మధురై మేయర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కార్పొరేటర్ల బృందం

కార్పొరేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది రాష్ట్రాలకు విజ్ఞాన యాత్రలో భాగంగా శనివారం విజయ వాడ కార్పొరేటర్ల బృందం మధురై కార్పొరేషన్‌ను దర్శించగా మేయర్ ఇంద్రాణి పొన్వసంత్, కమిషనర్ చిత్ర విజయన్ స్వాగతం పలికారు. ఈ సందర్భంలో మధురై మేయర్ ఇంద్రాణి పొన్వసంత్ మాట్లాడుతూ మధురై నగరంలో వంద వార్డులు, ఐదు జోన్‌లు ఉన్నాయన్నారు. గతంలో కేవలం ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు మాత్రమే నీటి సరఫరా ఇచ్చేవారని, ఇప్పుడు రెండు వేల కోట్లతో 24/7 వాటర్ సప్లై అందించడం జరుగుతుందన్నారు. మధురై నగర కమిషనర్ చిత్ర విజయన్ మాట్లాడుతూ మధురై నగరం స్మార్ట్ సిటీ నగరం అని, ముఖ్యంగా మధురై మున్సిపల్ కార్పొరేషన్‌లో పెరియార్ బస్టాండ్‌ను రూ.174.56 కోట్ల నిధులతో ఐదు అంతస్తులు నిర్మించారన్నారు. అనంతరం విజయవాడ కార్పొరేటర్ల బృందానికి పెరియార్ బస్టాండ్‌ను చూపించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ కార్పొరేటర్ల బృందం, మధురై కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.











నాగార్జున ఆసుపత్రికి వచ్చిన గుర్తింపు సర్టిఫికెట్‌ను ప్రదర్శిస్తున్న ఎండీ డాక్టర్ జగన్మోహనరావు, వైద్యులు

ఎండోస్కోపీలో 'నాగార్జున'కు జాతీయ గుర్తింపు

- సురక్షిత, నాణ్యమైన ఎండోస్కోపీలో మైలురాయి
- ఆసుపత్రి ఎండీ డాక్టర్ కొడాలి జగన్మోహన్‌రావు

పెనమలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కానూరు నాగార్జున ఆసుపత్రికి ఎండోస్కోపీలో జాతీయ గుర్తింపు లభించిందని ఆసుపత్రి ఎండీ డాక్టర్ కొడాలి జగన్మోహన్‌రావు తెలిపారు. శనివారం ఆసుపత్రి ఆవరణలోని అమెరికన్ ఆంకాలజీ విభాగంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి వైద్యులతో కలిసి ఆయన మాట్లాడారు. అత్యంత సురక్షిత, నాణ్యతాప్రమాణాలతో కూడిన సేవలందించే నాగార్జున ఆసుపత్రి గ్యాస్ట్రో ఇంటెస్టినల్, పల్మనాలజీ ఎండోస్కోప్ విభాగం నాణ్యత ప్రమాణాలను పెంపొందించిందని తెలిపారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ అక్రిడేటెడ్ హెల్త్‌కేర్ ఆర్గనైజేషన్స్ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎండోసేఫ్ ఆడిట్‌లో భాగంగా ఆసుపత్రికి ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు, గౌరవం లభించాయన్నారు. ఎండోసేఫ్‌లో భాగంగా పరీక్షించిన 174 అంశాల్లో స్టెరిలైజేషన్, డాక్యుమెంటేషన్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్, రిస్క్ మేనేజిమెంటు వాటితో సహా నాగార్జున ఆసుపత్రి జాతీయ అత్యున్నత ప్రమాణాలను అందుకొందన్నారు. ఎంతోమందికి జీర్ణకోశ వ్యాధుల నిర్ధయంలో కీలకపాత్ర పోషించడమే కాకుండా ఎండోస్కోపీ చికిత్స ఇవ్వడం ద్వారా ప్రాణాలను రక్షించామన్నారు. తమ ఆసుపత్రికి వచ్చిన గుర్తింపు సర్టిఫికేట్‌ను ప్రదర్శించారు. ఆసుపత్రి సీఏవోలు డాక్టర్ ధనిష్, డాక్టర్ అబ్బాస్, వైద్యులు డాక్టర్ భవన్నారాయణ, డాక్టర్ సంతోషి, డాక్టర్ శ్వేతాపరిమళ, డాక్టర్ ఇందిరారాణి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

నవ్యాంధ్ర సారథి చంద్రబాబు

- కర్నూలులో చంద్రబాబు జన్మదిన వారోత్సవాల ముగింపు సభలో మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చతికిలపడ్డ రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ అభివృద్ధి పథంవైపు నడిపిస్తున్న నవ్యాంధ్ర సారథి సీఎం చంద్రబాబు నాయుడు అని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. కర్నూలు నగరంలో వారం రోజులుగా కొనసాగుతున్న సీఎం చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వజ్రోత్సవ సాంస్కృతిక వారోత్సవాలు శనివారం రాత్రి ఘనంగా ముగిశాయి. కర్నూలు సి.క్యాంపు సెంటర్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఈ సాంస్కృతిక వారోత్సవాల్లో చివరి రోజు ప్రదర్శనగా టీజీవీ కల్చరల్ అకాడమీ సంస్థ వారి 'శ్రీవేంకటేశ్వర మహత్యం' భక్తిరస నాటకాన్ని ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వారోత్సవాలను కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రం సంస్థ నిర్వహించడం హర్షణీయమన్నారు. నవ్యాంధ్ర రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సాగుతున్నారని తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వజ్రోత్సవ సాంస్కృతిక వారోత్సవాలు నిర్వహించడం కళాకారులకు ఉత్సాహం నింపిందని చెప్పారు.

చట్టాలపై న్యాయమూర్తులు నైపుణ్యం పెంచుకోవాలి

- హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మన్మథరావు, జస్టిస్ కృపాసాగర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ మన్మథరావు, జస్టిస్ కృపాసాగర్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మారుతున్న చట్టాలపై న్యాయమూర్తులు నైపుణ్యం పెంచుకుని కేసులను త్వరిగతిన పరిష్కరించాలని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్ సూచించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని కోర్టుల్లోని న్యాయమూర్తులకు ఏలూరులోని జిల్లా కోర్టు కాన్ఫరెన్సు హాలులో శనివారం ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాపులు న్యాయమూర్తులు తమ పనితీరును మెరుగుపరుచుకోవడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి, పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో మే డే పోస్టర్ ఆవిష్కరణ

అమరావతి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): విజయవాడ సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో మే 1న జరిగే కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామ రాజు పిలుపునిచ్చారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి వాసంశెట్టి సుభాశ్ శనివారం మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

నేడూ వడగాడ్పులు.. ఉత్తరాంధ్రలో వర్షాలు!

అమరావతి, విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్ర ప్రభావం చూపుతోంది. శనివారం కోస్తా, రాయలసీమలోని 95 ప్రాంతాల్లో 40 డిగ్రీలపైన ఉష్ణోగ్రత నమోదైంది. కడప జిల్లా సిద్ధవటంలో 42.5, నంద్యాల జిల్లా గోస్పాడులో 42.2, విజయనగరం జిల్లా తుమ్మికపల్లిలో 41.9, ప్రకాశం జిల్లా పునుగోడులో 41.8, కర్నూలు జిల్లా లద్దగిరిలో 41.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం కూనవరం, జగ్గంపేట, కిర్లంపూడి, ఏలేశ్వరం మండలాల్లో తీవ్రంగా, ఉత్తర కోస్తాలోని మరో 17 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అయితే ఉత్తరాంధ్రలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

ఎస్సీ వర్గీకరణపై హైకోర్టులో పిటిషన్

- దాఖలు చేసిన జై భీమ్‌రావ్ భారత్ పార్టీ

అమరావతి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. విజయవాడకు చెందిన జై బీమ్‌రావ్ భారత్ పార్టీ అధ్యక్షుడు పరసా సురేష్‌కుమార్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఏకసభ్య కమిషన్ నివేదిక ఆధారంగా ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరిస్తూ ఆర్డినెన్స్ జారీ సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఆర్డినెన్స్‌ను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటిస్తూ దానిని రద్దు చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణపై నిర్దిష్ట సిఫారసులు చేసేందుకు 1948 జనాభా లెక్కల చట్టంలోని నిబంధనల ప్రకారం కేంద్రం పర్యవేక్షణ, ఆమోదంతో స్వతంత్ర కమిషన్ ఏర్పాటుచేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. కేంద్ర ప్రణాళిక మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి, డైరెక్టర్, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి డైరెక్టర్‌ను ప్రతివాదులుగా చేర్చారు.

ఏపీ నాటి సు'గ్రంథాలు..?'

స్వాతంత్ర్యోద్యమంలో గ్రంథాలయ ఉద్యమం మరువలేనిది ● నేడు ఆదరణ కోల్పోతున్న వైనం ● గ్రంథాలయాల పునర్వికాసం కోసం నేడు బెజవాడలో కార్యాచరణ



సర్వోత్తమ గ్రంథాలయం

ఒకప్పుడు జాతీయోద్యమాన్ని రగిల్చిన గ్రంథాలయాలు నేడు.. మనుగడ కోసం పోరాడాల్సి వస్తోంది! డిజిటల్ యుగంలో గ్రంథాలయాల మనుగడ మరింత సంక్లిష్టంగా మారుతోంది. గ్రంథాలయాలకు ఆదరణ దెబ్బతింటోంది. ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. సమాజాన్ని మేల్కొలుపుతూ చైతన్యాన్ని రగిల్చే గ్రంథాలయాల వికాసానికి ఇప్పుడు ఉద్యమం చేయాల్సి వస్తోంది. నాడు గ్రంథాలయాలు జాతీయోద్యమాన్ని చేయిస్తే.. నేడు గ్రంథాలయాల వికాసానికి ఉద్యమం చేయాల్సి వస్తోంది. బెజవాడ వేదికగా ఆదివారం గ్రంథాలయ పునర్వికాస వేదిక ఆధ్వర్యంలో ఒకరోజు వర్క్‌షాప్ జరుగనుంది. గ్రంథాలయాల ప్రభుత్వాలు రాజకీయాలకతీతంగా చేపట్టాల్సిన చర్యలు వంటివి చర్చించి ఒక కార్యాచరణను రూపొందించటం జరుగుతుంది. ఆ కార్యాచరణ దిశగా గ్రంథలయ వికాసోద్యమాన్ని నడిపించనున్నారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి



కాకాని భవన్‌లోని రాగూర్ గ్రంథాలయం

గ్రంథాలయాల పునర్వికాసానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించడానికి నగరంలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉదయం 9.30 నుంచి సాయంత్ర 5.30 గంటల వరకు సదస్సులు జరగబోతున్నాయి. ఇందులో గ్రంథాలయాల పునర్నిర్మాణం, నేటితరానికి పుస్తక పఠన ఆవశ్యకత, గ్రంథాల్లో సాహిత్యానికున్న ప్రాధాన్యత అనే అంశాలపై సదస్సులు నిర్వహించబోతున్నారు. గ్రంథాలయ పునర్వికాస వేదిక ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన సాహితీ, విద్యారంగ ప్రముఖులు, కేంద్ర, రాష్ట్ర సాహిత్య పురస్కార గ్రహీతలు అధిక సంఖ్యలో పాల్గొంటారు. నేటితరం విద్యార్థులు, ప్రజలకు గ్రంథాలయం విలువ తెలిపే ప్రయత్నమిది. దశాబ్దంన్నర కిందట ఎలాంటి సమాచారం, సామాజిక, మానసిక వికాసానికి చెందిన పుస్తకాలు కావాలన్నా గ్రంథాలయాలను ఆశ్రయించేవారు. స్మార్ట్‌ఫోన్ వచ్చాక సమాజంలో ప్రజలు నిత్యం వాడే వస్తువులు ఎలా మరుగున పడిపోయాయో, అలాగే గ్రంథాలయాలను కూడా సమాజం మరిచిపోయే స్థితికి వచ్చింది.

వందేళ్ల క్రితమే ప్రారంభం

ప్రజలకు సామాజిక స్పృహ కలిగించడం, జాతీయోద్యమానికి ఊతం ఇవ్వడం, ప్రజల్లో మానవత్వ వ్యక్తిత్వ వికాసం పెంపొందించడం వంటి లక్ష్యాలతో స్వాతంత్రోద్యమకాలంలో వందేళ్ల కిందట గ్రంథాలయ ఉద్యమం ప్రారంభమైంది. 1916లో విజయవాడ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఏర్పడి, అప్పట్లో ఈ ఉద్యమం వాడవాడలా విస్తరించింది. దేశంలో అనేక సంఘసంస్కరణలకు పునాదులు వేసింది కూడా గ్రంథాలయ ఉద్యమమే. వయోజన విద్య, స్త్రీ విద్యా వ్యాప్తికి కృషి చేసి అస్పృశ్యత నివారణకు నడుం కట్టడమే కాకుండా, నాడు దేశ ప్రజలను స్వాతంత్రోద్యమ పోరాట యోధులుగా తీర్చిదిద్దడంలో ప్రముఖపాత్ర పోషించింది. ఈ ఉద్యమ స్ఫూర్తితో తెలుగు రాష్ట్రంలో లెక్కలేనన్ని గ్రంథాలయాలు ఏర్పడ్డాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భాషా ప్రాతిపదికన అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల విభజన చేసింది. కొంతకాలానికే 1960లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ చట్టం ఏర్పడింది. దీనిద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జిల్లా గ్రంథాలయ సంస్థలు, శాఖా గ్రంథాలయాలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద గ్రంథాలయాలు ఏర్పడ్డాయి.

సెస్సులతో గ్రంథాలయాల అభివృద్ధి.!

గ్రంథాలయ శాసనచట్టం ప్రకారం ప్రజలు చెల్లించే ఆస్తిపన్ను, ఇంటి పన్నులో ప్రతి రూపాయిలో ఎనిమిది పైసలు గ్రంథాలయ సెస్సు వసూలు చేసి గ్రంథాలయ నిధిని ఏర్పాటు చేశారు. ఈ నిధి నుంచి గ్రంథాలయ సంస్థలు తమ ఆధీనంలో గల గ్రంథాలయాలను నిర్వహిణ చూసుకుంటాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్ధతిలో సిబ్బందికి జీతభత్యాలను చెల్లిస్తుంది. ఈ రకంగా రాష్ట్రంలో గ్రంథాలయ సేవలను విస్తృతం చేసింది. అయితే కాలక్రమంలో ప్రభుత్వం దీనిపై శ్రద్ధ పెట్టకపోవడం, ప్రజలు కూడా ఆసక్తి చూపకపోవడంతో 1986 తర్వాత నుంచి గ్రంథాలయ అభివృద్ధి కుంటుపడింది. పుస్తకాలు కొనుగోలు చేయకపోవడం, సిబ్బంది కొరత, వారిని భర్తీ చేయకపోవడం, గ్రంథాలయాల నిర్వహణ సజావుగా లేకపోవడంతో కొత్త గ్రంథాలయాల స్థాపన జరగకపోవడంతో ఈ వ్యవస్థ దాదాపు స్తంభించిపోయింది. రాష్ట్ర విభజన తరువాత ఈ పదేళ్లలో రాష్ట్ర కేంద్ర గ్రంథాలయ పాలనా భవనాన్ని కూడా నిర్మించుకోలేకపోయిందటే గ్రంథాలయ శాఖ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు తెలుగుభాష, సాహిత్యం, సంస్కృతుల పరిరక్షణకు గ్రంథాలయ ఉద్యమం దన్నుగా నిలిచింది. దేశ స్వాతంత్రోద్యమానికి ఊపిరి పోయడంతో పాటు తెలుగుజాతి సభ్యత, సంస్కారం, సామాజిక స్పృహ పెంపు, సాంఘిక చైతన్యానికి గ్రంథాలయ ఉద్యమం దోహదపడిందంటే అతిశయోక్తి కాదు.



పునర్వికాసానికి ఉద్యమం

జాతి ఔన్నత్యానికి, ఉన్నతికి కొలమానం లాంటి గ్రంథాలయ వ్యవస్థను సంరక్షించుకోవడానికి గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం ప్రారంభించాలని పుస్తకప్రియుల వాదన. దానికనుగుణంగా గ్రంథాలయాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని రాష్ట్ర గ్రంథాలయ శాఖ పేర్కొంది. అదే విధంగా ప్రజలకు పుస్తకపఠం, గ్రంథాలయాల ప్రయోజనాలను వివరించి, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమాన్ని చేపట్టాలని గ్రంథాలయ శాఖ కమిటీ నిర్ణయించింది.

పశ్చిమకు.. న్యూ లుక్..!

- అధునాతనంగా సితార జంక్షన్ అభివృద్ధి
- ప్రధాన రోడ్ల వెంబడి ఈట్‌వాక్ కాంప్లెక్సులు
- రోడ్ల వెంబడి పాత్‌వేలు, సైకిల్ ట్రాక్స్, గ్రీన్‌బెల్ట్స్
- పంజాలో వ్యాపారాల కోసమే ఎలివేటెడ్ కారిడార్
- ప్రణాళికలు తయారు చేయించిన ఎమ్మెల్యే సుజనా చౌదరి
- నిధుల సమీకరణ యత్నాలు.. అతి త్వరలోనే కార్యరూపం





సితార జంక్షన్ ఐలాండ్



ఆంధ్రజ్యోతి, విజయవాడ

బెజవాడలో పశ్చిమ నియోజకవర్గ రూపురేఖలను మార్చేందుకు ప్రణాళికలు సిద్ధమౌతున్నాయి. బెజవాడకు ఓల్డ్ సిటీగా చెప్పుకొనే పశ్చిమ నియోజకవర్గ రూపురేఖలను పూర్తిగా మార్చడానికి అడుగులు పడుతున్నాయి. 'ఆపరేషన్ న్యూ సిటీ' పేరుతో ఎమ్మెల్యే సుజనా చౌదరి సరికొత్త ప్రణాళికలకు శ్రీకారం చుట్టారు. దీని కోసం తన కార్యాలయంలో ప్రత్యేకంగా సిబ్బందిని పెట్టుకొని మరీ పాత నగరం రూపురేఖలు మార్చడానికి ప్రణాళికలు తయారు చేయిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల కోసం నిధుల సమీకరణపైనా ఆయన దృష్టి సారించారు. నగరంలోని ప్రధాన జంక్షన్లన్నింటినీ సరికొత్తగా ఆధునీకరించాలని నిర్ణయించారు. ప్రధానంగా సితార జంక్షన్‌ను అత్యద్భుతంగా అభివృద్ధి చేయడానికి డిజైన్ల రూపకల్పన జరిగింది. సితార జంక్షన్ అనేది పశ్చిమ నియోజకవర్గంలో చాలా పెద్ద జంక్షన్. గొల్లపూడి నుంచి మిల్క్ ఫ్యాక్టరీ మీదుగా వెళ్లే ఇన్నర్ రింగ్ రోడ్డు, కనకదుర్గ ఫ్లై ఓవర్ దిగువన ఎన్‌హెచ్ -65 నుంచి మొదలయ్యే కుమ్మరపాలెం ప్రధాన రోడ్డు, చిట్టినగర్ సొరంగం నుంచి వచ్చే ప్రధాన రోడ్డు ఈ మూడు కూడా సితార జంక్షన్ దగ్గర కలుస్తాయి. ఈ మూడు కూడా చాలా ప్రధానమైన రోడ్లు కావడంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం సితార జంక్షన్ దగ్గర ఎలాంటి ట్రాఫిక్ ఐలాండ్ లేదు. కేవలం సిమెంట్ కాంక్రీట్ బార్ కేడింగ్‌తో మాత్రమే జంక్షన్‌ను నిర్వహిస్తున్నారు. ఈ జంక్షన్ రూపురేఖలు మార్చటానికి మంచి సుందరమైన ట్రాఫిక్ ఐలాండ్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే ట్రాఫిక్ ఐలాండ్ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా మంచి డిజైన్లను రూపొందించారు. త్రికోణాకారంలో ఉండే ట్రాఫిక్ ఐలాండ్ డిజైన్ చాలా బాగుంది. ఈ ట్రాఫిక్ ఐలాండ్ ప్రత్యేకత ఏమిటంటే.. దీని చుట్టూరా పాదచారుల కోసం ప్రత్యేకంగా పాత్‌వేలను ఏర్పాటు చేస్తారు. ఈ పాత్‌వేల వెంబడి రంగు రంగుల పూల మొక్కలతో ఒక వరుస నిర్మాణం ఉంటుంది. దీని తర్వాత ట్రాఫిక్ ఐలాండ్ ఉంటుంది. ఈ ట్రాఫిక్ ఐలాండ్ ముందు భాగంలో ఒక స్టాట్యూ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ట్రాఫిక్ ఐలాండ్‌లో రంగురంగుల పూలమొక్కలు, ఆహ్లాదాన్ని పంచే చెట్లు ఏర్పాటు చేస్తారు. మధ్యలో అతిపెద్ద ఫౌంటెయిన్ కూడా ఏర్పాటు చేస్తారు. నీటిలో పెలికాన్స్ బొమ్మలను ఏర్పాటు చేస్తారు. ఈ ట్రాఫిక్ ఐలాండ్ ద్వారా సితార జంక్షన్ రూపురేఖలే పూర్తిగా మారిపోనున్నాయి.

ఫుడ్‌వాక్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు

పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ప్రధాన రోడ్ల వెంబడి ఈట్ స్ట్రీట్ తరహాలో ఫుడ్‌వాక్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. ఫుడ్ వాక్‌లో ప్రత్యేకంగా తినుబండారాల దుకాణాలతో పాటు, రకరకాల ఇతర దుకాణాలు కూడా ఉంటాయి. నియోజకవర్గంలో ప్రధాన రోడ్ల వెంబడి ఈ ఫుడ్‌వాక్‌లను ఏర్పాటు చేస్తారు. వీటి దగ్గర రోడ్ల వెంబడి ఫుట్ పాత్‌లు, సైకిల్ ట్రాక్స్, గ్రీన్‌బెల్ట్స్‌తో కూడిన ల్యాండ్ స్కేపింగ్ ఏర్పాటు చేస్తారు. ఎక్కడా కూడా మట్టి అనేది కనిపించకుండా టైల్స్ ఏర్పాటు చేస్తారు. ముఖ్య కూడళ్లలో గ్రానైట్ వంటివి ఏర్పాటు చేస్తారు. విదేశాలు వెళ్లినప్పుడు అక్కడ వీధులెలా ఉంటాయో ఆ విధంగా పశ్చిమ నియోజకవర్గ వీధులను కూడా ప్రత్యేకంగా తీర్చిదిద్దనున్నారు. రోడ్ల వెంబడి చక్కటి డిజైన్లతో కూడిన ఆకృతులను ఏర్పాటు చేయనున్నారు. ఎటు చూసినా రంగు రంగుల అధునాతన సొబగులు కనిపించేలా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందించారు. రోడ్ల వెంబడి కార్లు మోటార్ వెహికల్స్‌ను పార్క్ చేసుకోవడానికి వీలుగా అధునాతనమైన పార్కింగ్ స్టాండ్‌లను ఏర్పాటు చేయనున్నారు.

పంజాలో ఎలివేటెడ్ కారిడార్

పంజా సెంటర్‌లో నెలకొన్న ట్రాఫిక్ దృష్ట్యా అక్కడ వ్యాపారస్థులకు, చిరు వ్యాపారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేకంగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ఎలివేటెడ్ కారిడార్‌ను పంజా సెంటర్ అంతా కవరయ్యేలా చూస్తారు. ఈ ఎలివేటెడ్ కారిడార్‌పై కేవలం దుకాణాలు, చిరు దుకాణాలు, స్ట్రీట్ వెండర్స్ వంటి వారికి మాత్రమే అనుమతిస్తారు. పంజా రోడ్డు చాలా ఫ్రీగా ఉంచేందుకే ఏర్పాటు చేస్తున్నారు. పంజాసెంటర్ ఎలివేటెడ్ కారిడార్ విజయవాడ నగరంలో అతిపెద్ద స్ట్రీట్ సెంటర్‌గా తీర్చిదిద్దనున్నారు.

పోలీసులకు ల్యాప్‌టాప్‌ల బహూకరణ



విజయవాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద పోలీసు కమిషనరేట్ పరిధిలోని అధికారులకు, సిబ్బందికి కంట్రోల్ ఎస్ డేటా సెంటర్, తెలంగాణ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ ల్యాప్‌టాప్‌లను అందజేశాయి. విజయవాడలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఏఎస్ఐ, హెచ్‌సీ, పీసీలకు మొత్తం 50 ల్యాప్‌టాప్‌లను అందజేశారు. కార్యక్రమంలో పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, కంట్రోల్ ఎస్ డేటా సెంటర్ డైరెక్టర్ రాజీవ్ కుమార్ త్రివేది(మాజీ డీజీపీ), తెలంగాణ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గిన్నిస్‌బుక్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తున్న తాతయ్య

పేట వాసులకు గిన్నిస్ బుక్ సర్టిఫికెట్లు

జగ్గయ్యపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సామూహికంగా సరళీస్వరాలను కీబోర్డులో పలికించటం ద్వారా నలుగురు జగ్గయ్యపేట వాసులకు గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్లను అందుకున్నారు. విజయవాడకు చెందిన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలో పట్టణంలో జలవనరుల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగి ఎం.విజయ వర్ధన్ భార్య స్రవంతి, కుమార్తెలు అగస్త్యా, మేధా ఆజాలియా, చెరుకూరి వారి వీధికి చెందిన రోజా మాధురి గంట కాలపరిమితిలో లయబద్ధంగా సరళీ స్వరాలను కీబోర్డులో పలికించి అప్‌లోడ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి 1090 మంది అప్‌లోడ్ చేయగా 1046 మంది అర్హత సాధించి గిన్నిస్‌బుక్‌లో చోటు సాధించారు. ఈ నలుగురికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పార్టిసిపేషన్ సర్టిఫికేట్లను అందజేసింది. శనివారం ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య దంపతులు అభినందించారు.

ఏఎన్ఎంలకు పదోన్నతులపై హర్షం

కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో వైద్యారోగ్య శాఖ విభాగం విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఏఎన్ఎంలుగా పదోన్నతులు కల్పించిన వైద్యారోగ్యశాఖ అధికారులకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు సంఘం నేతలు డి.సత్యనారాయణరెడ్డి, పి.రమేష్ తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయంలో సేవలందిస్తున్న ఏఎన్ఎంలకు పదోన్నతులు కల్పించాలని ఎన్జీవో నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఈ నేపథ్యంలో శనివారం 270 మంది వైద్యారోగ్య శాఖ ఉద్యోగులకు ఏఎన్ఎంలుగా పదోన్నతి లభించింది. తమ విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి వేగవంతమైన చర్యలు తీసుకొన్న ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శర్మిష్టను మచిలీపట్నంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఎన్జీవో సంఘం నేతలు జి.రామకృష్ణ, సీవీఆర్ ప్రసాద్, ఎ.శ్రీనివాస్, ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విజయవాడ బ్రాండ్ ఇమేజ్

టైటిల్ పోటీలకు అనూహ్య స్పందన

- జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి గేట్‌వే నగరమైన విజయవాడకు గుర్తింపు తెచ్చేందుకు నిర్వహించిన బ్రాండ్ ఇమేజ్ టైటిల్ పోటీలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని దాదాపు 200 మందికి పైగా తమ ఎంట్రీలను పంపారని, ఔత్సాహికులకు మరో అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఎంట్రీలకు మే 10న చివరితేదీగా నిర్ధారించినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. విజయవాడ బ్రాండ్ ఇమేజ్ టైటిల్ పోటీల నిర్వహణపై శనివారం కలెక్టర్ లక్ష్మీశ పత్రికా ప్రకటన విడుదల చేశారు. చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచేలా నగరంపై ఉన్న ఆసక్తిని, ఆలోచనలను ప్రతిబింబించేలా టైటిల్, ట్యాగ్‌లైన్‌లను సూచించాలని, ఎంట్రీలను ఈ-మెయిల్‌లో పంపాలని మరోసారి కోరుతున్నామన్నారు. బ్రాండ్ టైటిల్, ట్యాగ్‌లైన్‌ను బ్రాండ్‌వీజేఏ కాంప్.కలెక్టర్‌ఎన్‌టీఆర్‌డిస్ట్రిక్ట్‌ఎట్‌దిరేట్‌ఆఫ్‌జీమెయిల్.కామ్ మెయిల్ ఐడీకి పంపాలన్నారు. అలాగే పంపిన వారి పేరు, చిరునామా, మొబైల్ నెంబర్ తెలపాలన్నారు. విజేతలకు ప్రశంసాపత్రం, బహుమతులతో పాటు వారికి సముచిత గుర్తింపు కల్పిస్తామన్నారు. పోటీల్లో పాల్గొని ఎంట్రీలు పంపిన ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

నూతన సంస్కరణలకు పోప్ ఫ్రాన్సిస్ శ్రీకారం

- బిషప్ జోసఫ్ రాజారావు సందేశం



బెంజిసర్కిల్‌లోని సెయింట్ పాల్స్ కథెడ్రల్‌లో దివంగత పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటం వద్ద పూలతో కడసారి నివాళులు అర్పిస్తున్న బిషప్ జోసఫ్ రాజారావు

బెంజిసర్కిల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విశ్వశాంతిదూత, జగద్గురువులు, పరిశుద్ధ పోప్ ఫ్రాన్సిస్ కతోలిక శ్రీసభలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని విజయవాడ కేథలిక డయోసిస్ బిషప్ మోస్ట్ రెవ. డాక్టర్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. దివంగత పరిశుద్ధ పోప్ ఫ్రాన్సిస్ సేవలను కొనియాడుతూ శనివారం ఉదయం బెంజిసర్కిల్‌లోని సెయింట్ పాల్స్ కథెడ్రల్‌లో విజయవాడ కేథలిక డయోసిస్ ఆధ్వర్యంలో పోప్ ఫ్రాన్సిస్ కడసారి నివాళులర్పిస్తూ అంతిమ దివ్యపూజాబలి సమర్పణ జరిగింది. తొలుత పవిత్ర పూజాపీఠంపై దివంగత పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటానికి బిషప్ రాజారావు, మోన్సిగ్నోర్ రెవ. ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ రెవ. ఫాదర్ మొశపాం గాబ్రియేలు, లయోల కళాశాల రెక్టార్ ఫాదర్ పుదోటి రాయప్పజాన్ తదితర గురువులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. పోప్ సేవలను బిషప్ కొనియాడుతూ సందేశమిచ్చారు. కేథలిక్ డయోసిస్ ప్రొక్రెయిటర్ ఫాదర్ బి. ఆనందబాబు, గుణదల పుణ్యక్షేత్రం రెక్టార్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్‌లు కొలకాని మరియన్న, తోట సునీల్‌రాజు, చిన్నప్ప, తోమస్, వినోద్, గురువులు, కన్యాస్త్రీలు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



చిరంజీవిగారు మమ్మల్ని పిలిచి గిఫ్ట్స్ ఇవ్వటం ఈ మధ్య కాలంలో మరచిపోలేని అనుభవం

ఎప్పటి నుంచో నాకు శాంతాబయోటెక్ చైర్మన్ వరప్రసాదరెడ్డి గారి బయోపిక్ చేయాలని ఉంది. ఎప్పటికైనా ఆ అవకాశం వస్తుందేమోనని ఎదురుచూస్తున్నాను.

కామెడీ నటుడిగా వచ్చి... క్యారక్టర్ ఆర్టిస్ట్‌గా పేరు తెచ్చుకున్నారు... ప్రియదర్శి. 'కోర్ట్' సినిమాతో నటుడిగా ఆయన మరో మెట్టు ఎక్కారు. ఎంతోమంది అభిమానానికి... ప్రశంసలకు పాత్రుడయ్యారు. వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ప్రియదర్శి... తన రాబోయే చిత్రాల గురించి... పరిశ్రమలో తన ప్రయాణం గురించి 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.

అందంగా ఉంటేనే నటుడు కాలేడు

ఎలా ఉన్నారు? ఇప్పటి దాకా జర్నీ ఎలా ఉంది?

చాలా బావుందండి. ఇల్లు, పని... ఈ రెండూ తప్ప ఇంకేం తెలియడంలేదు.

కోర్ట్... సినిమాకు మంచి ఆదరణ లభించింది కదా. ఎలా ఫీలవుతున్నారు?

అనూహ్యంగా అనేక మంది ప్రశంసలు కురిపిస్తున్నారు. మొన్న జిమ్‌లో ఒక ఆవిడ వచ్చి "థ్యాంక్యూ" అంది. నాకు మొదట అర్థం కాలేదు. "కోర్ట్ మూవీ ఇచ్చినందుకు చాలా థ్యాంక్స్. నాకు ఇద్దరు టీనేజ్ అబ్బాయిలు ఉన్నారు. వాళ్లకు చట్టపరమైన విషయాలు ఎలా చెప్పాలో నాకు అర్థమయ్యేది కాదు. వాళ్లకు ఈ సినిమా చూపించా.." అన్నారు. చాలా ఆనందంగా అనిపించింది. మగాళ్లను కూడా సరిగ్గా పెంచాలని ఒక తల్లి తాపత్రయ పడటం బాగా అనిపించింది.

మీరు చేస్తున్న పాత్రలు.. మీ దగ్గరకు వస్తున్న స్క్రిప్ట్‌ల పట్ల సంతృప్తిగా ఉన్నారా?

కథల విషయంలో నేను ఆచితూచి వ్యవహరిస్తూ ఉంటాను. నాకు వచ్చే పాత్రల పట్ల సంతృప్తికరంగానే ఉన్నాను. 'జాతిరత్నాలు' సినిమా తర్వాత బడ్డీ కామెడీ స్క్రిప్ట్‌లు కొన్ని వచ్చాయి. 'కోర్ట్'కు ముందు నేను కోర్టు డ్రామాలు ఏమీ చేయలేదు. లాయర్‌లాంటి పాత్ర చేసి ఉండచ్చు. కానీ ఫుల్ కోర్టు డ్రామా చేయలేదు. ఇది నా దగ్గరకు వచ్చినప్పుడు చాలా నచ్చింది. చేసేశాను.

మీరు కమర్షియల్ సినిమాల్లో ఎక్కువ కనిపించటం లేదు కదా..!

మాస్ చిత్రాలు ఎక్కువగా చేయాలని అనుకోలేదు. నిజం చెప్పాలంటే నాకు ఎక్కువ మాస్ సినిమాల ఆఫర్లు రాలేదు కూడా! కొన్ని ఆఫర్స్ వచ్చాయి. కథ నచ్చలేదు. కథ పట్ల నాకే సంతృప్తి లేకపోతే ప్రేక్షకులు ఎలా సంతృప్తి చెందుతారు? అందుకనే మాస్ మసాలా సినిమాలు ఎక్కువ చేయటంలేదు. అంతే కాకుండా... ప్రస్తుతం నేను చేస్తున్న పాత్రలన్నీ మాస్ సినిమాలకు భిన్నమైనవే కదా. అందువల్ల 'వీడు మాస్ సినిమాలు చేయడు' అనుకొని కొందరు ఆఫర్ కూడా చేయటం లేదేమో! ఇది నా అపోహ కూడా కావచ్చు.

'సారంగపాణి జాతకం' డైరక్టర్ ఇంద్రగంటితో పని చేయటం ఎలా అనిపించింది?

ఆయన మాస్టర్ క్రాఫ్ట్‌మన్ అని చెబుతా. మంచి తెలుగులో కామెడీ రాయగలిగిన అతి కొద్ది దర్శకుల్లో ఆయన కూడా ఒకరు.

ఇప్పటిదాకా ఆయన చేసిన సినిమాలు చూస్తే... సినిమా తీయటంలో ఆయనకు ఉన్న పట్టు మనకు అర్థమవుతుంది. ఇంద్రగంటి గారితో పని చేయటం అంటే యూనివర్సిటీ రోజులకు వెళ్లినట్లు అనిపించింది. ఒకసారి రౌండ్‌టేబుల్ సమావేశంలాంటిది పెట్టుకొని అందరం స్క్రిప్ట్ చదివాం. అది మరచిపోలేని విషయం.

అలాగే మొదటి రోజు షూటింగ్‌లో కొత్త నటీనటులను ఆయన ప్రోత్సహించిన తీరు కూడా మరచిపోలేను. ఒక గొప్ప డైరక్టర్ మాత్రమే నటీనటులను తనకు నచ్చిన విధంగా మలుచుకోగలుగుతాడు. ఈ సినిమా చాలా బాగా వచ్చింది.

కష్టాలు అన్ని వృత్తుల్లోనూ ఉంటాయి. అయితే సినీరంగంలో ఎదురయ్యే కష్టాలకు ఓర్పు ఎక్కువ కావాలి. ఎందుకంటే ఇందులోకి వచ్చేవాళ్లకు పరీక్షలు ఉండవు. ఎవరూ మనకు పరీక్షలు పెట్టి 'నీ సామర్థ్యం ఇంత' అని నిర్ణయించరు. అందువల్ల కొందరు ఆశతో ఉండిపోతూ ఉంటారు. కొందరు పూర్తి స్థాయి నటులు కాలేక ఇక్కడే మిగిలిపోతారు.

మీరు నటుడు ఎందుకయ్యారు?

చిన్నప్పటి నుంచి నాకు కదిలే బొమ్మలంటే ఇష్టం. సినిమా నాకు శక్తిని ఇస్తుంది. జీవించేటట్టు చేస్తుంది. చిన్నప్పటి నుంచి సినిమా నటుడిని అవ్వాలని ఉండేది. నా చదువు కూడా ఆ వైపే ఎంచుకున్నాను. యూనివర్సిటీలో కూడా ఎప్పుడూ ఈ ధ్యాసే ఉండేది. కొద్ది కాలం నాటకాలు వేశాను. భిక్షుగారు, అరుణ భిక్షు గారి శిక్షణవల్ల నాకు సినిమా పట్ల అవగాహన పెరిగింది.



మీపై మీ నాన్నగారి ప్రభావం ఉందా?

నా మీద మా నాన్న పులికొండ సుబ్బాచారి ప్రభావం చాలా ఎక్కువ. ఆయన సాహితీవేత్త. అనేక మంది ఇంటికి వస్తూ పోతూ ఉండేవారు. నాకు, మా చెల్లి నగజకు మంచి ఆలోచనా విధానం రావడానికి నాన్న, అమ్మ జయమ్మ ముఖ్య కారణం. అమ్మ టీచర్‌గా పని చేసేది. చిన్నప్పుడు మేము సైదాబాద్‌లో ఉండేవాళ్లం. ఇంట్లో గిన్నెల కన్నా పుస్తకాలు ఎక్కువ ఉండేవి. ఇప్పటికీ మా ఇంట్లో గిన్నెల కన్నా పుస్తకాలే ఎక్కువుంటాయి. నాన్నకి, చెల్లికి అనేక సత్కారాలు లభిస్తూ ఉండేవి. నాకన్నా వాళ్లు సాధించిందే ఎక్కువ. సినిమాలు చూసిన తర్వాత ఇంట్లో చర్చలు జరిగేవి. నాన్న విశ్లేషించేవాడు. కవి సమ్మేళనాలకు వెళ్లేవాళ్లం. 1990ల్లో హైదరాబాద్‌లో సాహితీ వాతావరణం ఇప్పటితో పోలిస్తే చాలా భిన్నంగా ఉండేది. అప్పటి అనుభవాలన్నీ నటుడిగా నాకు ఎంతో ఉపకరించాయి.

సినిమాల్లోకి రావాలంటే బాడీ బిల్డింగ్ చేయాలి... అందంగా ఉండాలనేవి అపోహలేనా?

నటుడు ఎలా ఉండాలనే విషయంపై ప్రజల్లో కొన్ని అభిప్రాయాలు ఉన్నాయి. కానీ అవి చాలా కాలంగా పేరుకుపోయిన అపోహలు మాత్రమే. అందంగా ఉంటేనే.. లేదా జిమ్‌కు వెళ్తే మాత్రమే నటుడు అవుతాడనేది నా దృష్టిలో కేవలం ఒక అపోహ. వ్యాయామం కోసమైతే జిమ్‌కు వెళ్లచ్చు. నేను కూడా వెళతాను. కానీ నటుడు కావటానికి జిమ్‌లో వ్యాయామం చేస్తే మాత్రమే చాలదు. మనం చేస్తున్న పని పట్ల అవగాహన, నిబద్ధత ఉండాలి. అప్పుడే మంచి నటుడు అవుతారు. ఈమధ్య వస్తున్న నటులలో చాలా మందికి ఈ అవగాహన ఉంది.


● సిహెచ్ఎల్ఎన్ ప్రసాద్

ఈ వారమే విడుదల



ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
అమెజాన్ ప్రైమ్		
ఆనదర్ సింపుల్ ఫేవర్	హాలీవుడ్ మూవీ	మే 01
జియో హాట్‌స్టార్		
కుల్ల్	హిందీ సిరీస్	మే 02
సోనీ లివ్		
బ్రోమాన్స్	మలయాళచిత్రం	మే 01
బ్లాక్ వైట్ అండ్ గ్రే	హిందీ సిరీస్	మే 02
ఎంఎక్స్ ప్లేయర్		
ఈఎంఐ	తమిళ చిత్రం	మే 01



అధికార పోరులో అందలం ఎవరికో?

ఓ శక్తిమంతమైన రాజకుటుంబంలో రాజకీయ వారసత్వం కోసం జరిగిన పోరు ఎలాంటి పరిణామాలకు దారితీసిందనే పాయింట్ చుట్టూ అల్లుకున్న కథతో తెరకెక్కిన హిందీ సిరీస్ 'కుల్ల్'. నిమ్రత్ కౌర్, రిధి డోగ్రా, అమోల్ పరాశార్ కీలక పాత్రలు పోషించారు. షాహిర్ రాజా దర్శకత్వంలో బాలాజీ టెలిఫిల్మ్స్ తెరకెక్కించింది. బికనీర్‌లోని ప్రముఖరాజకీయ నాయకుడు రాయ్‌సింగ్ హత్యలో ఇద్దరు కూతుర్లు, కుమారుడు ప్రమేయం ఉందనే అనుమానంతో పోలీస్ విచారణ మొదలవుతుంది. మరో వైపు అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు కుటుంబ సభ్యుల ప్రయత్నాలు ముమ్మరం అవుతాయి. అధికార స్వార్థం కోసం తెగించే వ్యక్తుల అంతరంగాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు.

సెలబ్ టాక్

సినిమాల పట్ల ఏమాత్రం అవగాహన లేని ఒక సాదాసీదా వ్యక్తి, ప్రపంచవ్యాప్త అభిమానులను కలిగి ఉన్న ఒక ప్రముఖ తారను పెళ్లాడడం లాంటి సంఘటనలు సినిమాలకే పరిమితం కాదు. ప్రముఖ హిందీ నటి మాధురి దీక్షిత్‌ను పెళ్లాడిన హృద్రోగ వైద్యుడు డాక్టర్ శ్రీ రామ్ నెనె నిజ జీవిత కథ అలాంటిదే! మాధురితో పెళ్లి తర్వాత తానెదుర్కొన్న అనుభవాలనూ, ఆమె నుంచి ప్రేరణ పొందిన సందర్భాలనూ శ్రీరామ్ ఇలా వివరిస్తున్నాడు.

నా బెటర్ హాఫ్

"నేను అమెరికాలో స్థిరపడిన హృద్రోగ వైద్యుడిని. ఆమె భారతీయ అగ్ర నటి. మాధురి తమ్ముడు అజిత్ మమ్మల్ని కలిపాడు. ఇద్దరం ఒకర్నొకరం ఇష్టపడ్డాం. పెళ్లి తర్వాత మాధురి నాతో పాటు అమెరికా వచ్చేసింది. కానీ అప్పటివరకూ నాకు మాధురి ఒక నటి అనే విషయం మాత్రమే తెలుసు. ఆమెకు ప్రపంచవ్యాప్త అభిమానులున్నారనీ, భారతీయ సినీ రంగంలో ఆమె సుదీర్ఘ ప్రస్థానాన్ని కలిగి ఉందనీ నాకు తెలియదు. పెళ్లయ్యాక కాస్త ఆలస్యంగా నేనీ విషయాన్ని గ్రహించాను.

ఏ వేడుకకు వెళ్లినా ఆమె అందుకునే గౌరవమర్యాదలు, అభిమానుల ప్రేమాభిమానాలు నన్ను ఆశ్చర్యపరిచేవి. నిజం చెప్పాలంటే ఆమె ప్రకాశవంతమైన వెలుగు ముందు నేను వెలవెలపోతూ ఉండేవాడిని. మరీ ముఖ్యంగా ప్రజల దృష్టిలో నాకు అంతగా ప్రాధాన్యం ఉండేది. అభిమానులు నన్ను పక్కకు తప్పించేసి, మాధురి చుట్టూ ముసురుకున్న సందర్భాలు చాలా ఉన్నాయి. ఇలాంటప్పుడు మనసు నొచ్చుకోని వారు ఉండరు కదా! నా విషయంలోనూ అదే జరిగింది. కానీ అదంతా తాత్కాలికమే! తర్వాత మాధురి భర్తగా కొత్త జీవితాన్ని స్వాగతించాను. మేమిద్దరం పూర్తి స్వతంత్రులం. మాధురి నా జీవితంలో 'బెటర్ హాఫ్' అని కచ్చితంగా చెప్పగలుగుతాను. పరస్పర గౌరవాన్ని నేను విశ్వసిస్తాను. మా ఇంట్లో, వృత్తి ప్రదేశంలో ప్రతి ఒకర్నీ సమంగా పరిగణిస్తాం! ఎక్కడా అధికార శ్రేణులనేవే ఉండవు.

18 కిలోల బరువు తగ్గి...

జీవనశైలి రుగ్మతలతో ప్రాణాలు కోల్పోతున్న వాళ్లను ఎంతోమందిని చూశాను. ఆరోగ్య పరీక్షల్లో నా ఆరోగ్యం కూడా అదే స్థితికి చేరుకుంటున్నట్టు గ్రహించి వెంటనే జీవనశైలిని మార్చుకున్నాను. ఇందుకోసం మాధురి నుంచి ప్రేరణ పొందాను. ఆమె ఆరోగ్యం పట్ల కనబరిచే శ్రద్ధ నాలో మార్పుకు దోహదపడిందని చెప్పవచ్చు. ఆరోగ్యం మెరుగుపరచుకోవాలని నిర్ణయించుకున్న వెంటనే మద్యపానం మానేసి, పూర్తి శాకాహారిగా మారిపోయాను. జీవనశైలి రుగ్మతలను తుదముట్టించే ఆరోగ్య నియమాలను పరీక్షించాలనే ఉద్దేశంతో స్వీయ ప్రయోగాలకు పూనుకున్నాను. మా నాన్న 55 ఏళ్లుగా మధుమేహంతో బాధపడుతున్నారు. ఇప్పుడాయనకు 81 సంవత్సరాలు. ప్రయోగాత్మకమైన ఆరోగ్య నియమాలతో మందులతో పని లేకుండా నాన్న మధుమేహాన్ని అదుపులోకి తీసుకురాగలిగాను. ఇప్పుడాయన ఎంతో ఆరోగ్యంగా ఉన్నారు. నేను కూడా 18 కిలోల బరువు తగ్గి పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలిగాను. శరీర కొవ్వును 16 శాతానికి తగ్గించుకోగలిగాను. వచ్చే పుట్టిన రోజు నాటికి శరీర కొవ్వును 12 నుంచి 15 శాతానికి తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాను."

మాధురి భర్తగా గుర్తింపు...

నా కోసం మాధురి తన కెరీర్‌ను వదులుకుంది. నాతో పాటే పదేళ్ల పాటు అమెరికాలో ఉండిపోయింది. ఆమె త్యాగాన్ని గౌరవిస్తూ ఆమెతో పాటు పదేళ్ల క్రితం భారతదేశానికి వచ్చేసి, హెల్త్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారిపోయాను. మాధురి కూడా తన నటనా జీవితాన్ని కొనసాగించింది. అమెరికాలోని యుసిఎల్ఎ మెడికల్ సెంటర్‌లో గుండె వైద్యుడిగా పనిచేసేటప్పుడు,

పెళ్లికి ముందు నుంచే నేనెంతో మంది ప్రముఖులకు సేవలందించాను. వాళ్లందరూ గుర్తింపును దాచి ఉంచమని నన్ను అభ్యర్థించేవారు. ఇప్పుడిక్కడ నా పరిస్థితి పూర్తి భిన్నంగా మారిపోయింది. మాధురి భర్తగా పొందిన ప్రత్యేక గుర్తింపుతో అందరూ నాతో సెల్ఫీలు దిగడం కోసం పోటీ పడుతూ ఉంటారు. నాకైతే వాళ్లందరితో మాట్లాడాలనిపిస్తుంది. మాధురి, నేనూ ఎంతో వినయపూర్వకమైన వ్యక్తులం. మేమెప్పుడూ కీర్తి కోసం పాకులాడలేదు.



భారతీయ చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం సీక్వెల్స్ ట్రెండ్ నడుస్తోంది. దర్శకుడు రాజమౌళి బాహుబలి కథను రెండు భాగాలుగా తీసుకొచ్చారు. అప్పటి నుంచి సీక్వెల్స్ జోరు ఊపందుకుంది. సినిమా చివర్లో దానికి కొనసాగింపు ఉంటుందని హింట్ ఇచ్చి సీక్వెల్ మీద అంచనాలు పెంచుతున్నారు దర్శకనిర్మాతలు. ఈ ట్రెండ్ అన్ని భాషల్లోనూ ఉన్నప్పటికీ తెలుగు సీక్వెల్ చిత్రాలే ఎక్కువగా విజయవంతం అవుతున్నాయి.

సీక్వెల్ జోరు..!

రాజమౌళి 'బాహుబలి', అల్లు అర్జున్- సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన 'పుష్ప' చిత్రాలు పాన్ ఇండియా స్థాయిలో బ్యాక్ టు బ్యాక్ హిట్ అందుకున్నాయి. ఈ చిత్రాలు పాన్ ఇండియా సీక్వెల్స్‌కు దారిచూపాయి. దాంతో జూనియర్ ఎన్టీఆర్ కొరటాల కాంబినేషన్‌లో వచ్చిన 'దేవర'ను కూడా ఇదే స్థాయిలో నిర్మించి విజయం సాధించారు. ఈ చిత్రానికి సీక్వెల్ ఉంటుందని చిత్రబృందం ప్రకటించింది. అయితే తక్కువ బడ్జెట్‌తో నిర్మించిన చిత్రాల సీక్వెల్స్ కూడా మంచి విజయాలనే నమోదు చేశాయి. 'హిట్' ఫ్రాంచైజీలో వచ్చిన రెండు చిత్రాలు బాక్సాఫీసు వద్ద విజయం సాధించాయి. దాంతో 'హిట్-3' ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అంతేకాదు 'హిట్-4' కూడా ఉంటుందని, ఇందులో తమిళ హీరో 'కార్తీ' నటించనున్నారనే వార్తలు ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తున్నాయి.

'డీజే టిల్లు' సృష్టించిన హంగామా అంతా ఇంతా కాదు. దీనికి సీక్వెల్‌గా ఇటీవలె వచ్చిన 'టిల్లు స్క్వేర్' కూడా ప్రేక్షకుల మన్ననలు పొందింది. 'మ్యాడ్'కు కొనసాగింపుగా వచ్చిన 'మ్యాడ్ స్క్వేర్' కూడా తెలుగు ప్రేక్షకులను అలరించిందనే చెప్పాలి. అలాగే 'ఓదెల రైల్వే స్టేషన్'కు సీక్వెల్‌గా వచ్చిన తాజా చిత్రం 'ఓదెల-2'. ఈ చిత్రానికి కూడా సీక్వెల్ ఉంటుందని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రాలన్నీ కూడా మొదటి భాగం పాయింట్‌ని ఇంకాస్త స్ట్రాంగ్‌గా చూపించడంతో ప్రేక్షకులను ఆకట్టుకోగలిగాయి. టెక్నికల్‌గా, స్క్రిప్ట్ పరంగా ప్రేక్షకులు మెచ్చేవిధంగా తీయడం వల్లనే ఈ చిత్రాలు విజయాలను అందుకోగలిగాయి. కానీ ఇతర ఇండస్ట్రీల్లో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.

ఇతర దక్షిణాది చిత్రాలు

తమిళంలో 'భారతీయుడు'కి కొనసాగింపుగా వచ్చిన 'ఇండియన్-2' ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అదేవిధంగా మలయాళంలో 'లూసిఫర్'కి సీక్వెల్‌గా వచ్చిన 'ఎంపురాన్' కలెక్షన్ల పరంగా ఆశాజనకంగా ఉన్నప్పటికీ కథ బలహీనంగా ఉండడంతో మేకర్స్ అంచనాలు తప్పాయి. ఈ రెండు చిత్రాలను బట్టి చూస్తే స్టార్ కాస్టింగ్ కంటే బలమైన కంటెంట్ ఉన్న సీక్వెల్ చిత్రాలే ప్రేక్షకుల మన్ననలు పొందుతాయని రుజువైంది. ఈ రెండు చిత్రాల మొదటి భాగాలు సక్సెస్ అయ్యాయి. కాని సీక్వెల్స్ మెప్పించలేకపోయాయి.



అయితే కన్నడలో 'కెజిఎఫ్'కి సీక్వెల్‌గా వచ్చిన 'కెజిఎఫ్-2' ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. పాన్ ఇండియా మార్కెట్‌ని ప్రభావితం చేసింది.

బాలీవుడ్‌లో...

అటు బాలీవుడ్‌లోనూ సీక్వెల్ చిత్రాల హవా కొనసాగుతోంది. 'క్రిష్' సిరీస్‌లో ఇప్పటికే మూడు చిత్రాలు విజయవంతమయ్యాయి. నాలుగో చిత్రం త్వరలో సెట్స్ పైకి వెళ్లనుంది. ఇందులో హృతిక్ రోషన్ హీరోగా నటించడమే కాకుండా దర్శకత్వ బాధ్యతలు కూడా తీసుకున్నారు. 'ఆషికీ' ఫ్రాంచైజీలో ఇప్పటికే రెండు సినిమాలు వచ్చాయి. మూడో చిత్రం తెరకెక్కుతోంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన 'యానిమల్'కు కొనసాగింపు ఉంటుందని చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది.

● సన్నీడియోల్ హీరోగా తెలుగు దర్శకుడు మలినేని గోపిచంద్ దర్శకత్వంలో ఇటీవలె వచ్చిన 'జాట్' సినిమా మంచి పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకుంది. బాలీవుడ్‌లో సూపర్ హిట్‌గా నిలిచింది. తాజాగా ఈ సినిమాకు సీక్వెల్ రానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. 'గదర్-2' తర్వాత హిట్ కోసం ఎదురుచూస్తున్న సన్నీడియోల్ కెరీర్‌కి 'జాట్' కొత్త జీవితాన్ని ప్రసాదించింది. దీంతో ఈ హీరో ఏకంగా మరో రెండు సీక్వెల్ చిత్రాలను తీయబోతున్నారు. 'జాట్-2'తో పాటు 'గదర్-3', 'బోర్డర్-2' ప్రాజెక్టులకు రెడీ అవుతున్నారు. గత ఏడాది బాలీవుడ్‌లో విడులైన సీక్వెల్ చిత్రాలు 'స్త్రీ-2', 'భూల్ భులయ్యా' మంచి విజయం సాధించాయి. అయితే 'కాగజ్-2', 'లవ్ సెక్స్ ఔర్ ధోకా-2' వంటి సినిమాలు నిరాశపరిచాయి.

వంటగదిలో అరలు ఇలా ఉండాలి

ఒకప్పుడు ఇంట్లో వంటగది, పడక గది, ముందు గది ఇలా ఏ గదిలోనైనా సామాన్లు పెట్టుకోవడానికి వీలుగా ప్రత్యేకమైన అరలు ఉండేవి. తరవాత ఇంటీరియర్ డిజైన్ ప్రభావంతో అరలకు తలుపులు వచ్చేశాయి. వీటివల్ల ఇల్లు అందంగా కనిపిస్తుందనే భావన ఉండేది. రాను రాను... రోజువారీ ఉపయోగించుకునే వస్తువులను కూడా తలుపులు వేసి ఉన్న అరల్లో పెట్టుకోవడం ఇబ్బందికరంగా ఉంటుందంటున్నారు గృహిణులు. ముఖ్యంగా వంటగదిలో! వస్తువుల కోసం వెతుక్కోకుండా చూడగానే కనిపించేలా ఉండే ఓపెన్ షెల్వింగ్‌కి ప్రస్తుతం ఆదరణ పెరుగుతోంది. వంటగదిలో కొన్ని అరలైనా ఓపెన్ షెల్వింగ్ విధానంలో ఉండాలంటున్నారు మహిళలు. ఈ అరలను అమర్చుకొనేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం...

● చెక్కతో చేసే అరలను సాధారణంగా గోడకే అమరుస్తుంటారు. అరలను అమర్చేటప్పుడు ఆ గోడలో నీటి పైపులు, కరెంట్ తీగలు ఏవైనా ఉన్నాయేమో పరీక్షించుకోవాలి. లేదంటే అరలు అమర్చేందుకు కొట్టే మేకుల వల్ల వాటికి నష్టం కలుగవచ్చు.



● తడి ఎక్కువగా చేరే గోడలకు అరలు అమర్చకూడదు. తేమ వల్ల చెక్క అరలు తొందరగా పాడవుతాయి.

● అరలను అందమైన ఆకృతిలో అమర్చుకుంటే వంటగది అందంగా విశాలంగా కనిపిస్తుంది.

● స్టవ్‌కు దగ్గరగా ఓపెన్ షెల్వింగ్ విధానంలో అరలు ఏర్పాటు చేసుకోవాలనుకుంటే ఆలోచించి నిర్ణయం తీసుకోవడం మంచిది. ఎందుకంటే వంటచేసేటప్పుడు విడుదలయ్యే పొగ, జిడ్డులాంటివి అరల్లోని వస్తువులకు పట్టే అవకాశం ఉంటుంది. దీనికి ప్రత్యామ్నాయంగా గాజు ప్యానెల్ ఏర్పాటు చేసుకోవడం మంచిదని డిజైనర్లు సూచిస్తున్నారు.

● వంటగదిలో వెలుతురుకు అడ్డం కాకుండా అరలు ఏర్పాటు చేసుకోవడం మంచిది.

● ఇంటీరియర్ అందం పాడవకుండా ఓపెన్ షెల్వింగ్ అరలు ఏర్పాటు చేసుకుంటే వంటగదిలో సౌకర్యంగా ఉంటుంది.

నేటి మ్యాచ్‌లు

ముంబై x లఖ్‌నవూ — మ.3.30 నుంచి — వేదిక: ముంబై

ఢిల్లీ x బెంగళూరు — రా.7.30 నుంచి — వేదిక: ఢిల్లీ

మనోళ్లు ఏం చేస్తారో?

నేటినుంచి సుదీర్మన్ కప్
తొలిపోరులో డెన్మార్క్‌తో భారత్ ఢీ



గ్జియామెన్ (చైనా): ప్రతిష్ఠాత్మక సుదీర్మన్ కప్ మిక్స్‌డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఆదివారం ఇక్కడ ప్రారంభం కానుంది. బ్యాడ్మింటన్‌లో.. వరల్డ్ కప్‌తో సమానంగా భావించే ఈ టోర్నీ ఇప్పటి వరకు 18సార్లు జరిగితే.. చైనా (13సార్లు), దక్షిణ కొరియా (4సార్లు), ఇండోనేసియా (ఒకసారి) మాత్రమే విజేతలుగా నిలిచాయి. ఇక..రెండుసార్లు (2011, 2017) క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరడమే ఈ టోర్నీలో భారత్‌కు అత్యుత్తమ ప్రదర్శన. డెన్మార్క్, రెండోసీడ్ ఇండోనేసియా, ఇంగ్లండ్‌లతో కలిసి భారత జట్టు గ్రూప్-డి నుంచి తలపడుతోంది. 16 జట్లు నాలుగు గ్రూపులుగా విడిపోయి తలపడతాయి. ఒక్కో గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్స్ చేరతాయి. ఫైనల్ మే 4న జరగనుంది. పురుషులు, మహిళల స్టార్ జోడీలు సాత్విక్/చిరాగ్, గాయత్రి/ట్రీసా లేకపోవడం భారత జట్టుకు పెద్ద దెబ్బ. ఈనేపథ్యంలో..ప్రతి పోరులో మిక్స్‌డ్ డబుల్స్ ద్వయం ధ్రువ్ కపిల/తనీషా శుభారంభం అందించాల్సి ఉంటుంది. సింగిల్స్‌లో భారత ఆశలన్నీ లక్ష్యసేన్, పీవీ సింధుపైనే. అలాగే అనుభవజ్ఞుడైన ప్రణయ్, అనుపమ ఎలా ఆడతారన్నది ఆసక్తికరం. సాత్విక్/చిరాగ్ అనారోగ్యంతో టోర్నీ నుంచి వైదొలగడంతో హరిహరన్/రూబన్ కుమార్ జంట ఏమాత్రం సత్తా చాటుతుందో చూడాలి. మహిళల డబుల్స్‌లో శ్రుతి మిశ్రా/ప్రియా కొంజెన్‌బామ్ బరిలో నిలిచారు. సతీష్ కుమార్/ఆద్య మిక్స్‌డ్ డబుల్స్‌లో రెండో జోడీగా ఉంది. భారత్ తన తొలి మ్యాచ్‌ను ఆదివారం డెన్మార్క్‌తో ఆడనుంది. ఆ తర్వాత మంగళవారం ఇండోనేసియాతో, గురువారం ఇంగ్లండ్‌తో భారత్ తలపడనుంది.

బోణీ కొట్టేదెవరో?

● శ్రీలంకతో భారత్ పోరు నేడు
● మహిళల ముక్కోణపు వన్డే సిరీస్



కొలంబో: ఐదు నెలల్లో మహిళల వన్డే వరల్డ్ కప్ జరగనున్న నేపథ్యంలో బౌలింగ్‌ను మరింతగా మెరుగులు దిద్దుకోవాలని భారత జట్టు భావిస్తోంది. ఈ క్రమంలో ఆతిథ్య శ్రీలంక, దక్షిణాఫ్రికా జట్లతో కలిసి పోటీపడుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌ను సన్నాహకంగా ఉపయోగించుకోవాలనుకొంటోంది. ఆదివారం జరిగే తొలి మ్యాచ్‌లో శ్రీలంకతో హర్మన్‌ప్రీత్ సేన తలపడనుంది. ఈ మ్యాచ్‌లో యువ పేసర్ కష్వీ గౌతమ్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. మహిళల ప్రీమియర్ లీగ్‌లో ప్రదర్శనతో భారత జట్టులో తొలిసారి చోటు పట్టేసిన కష్వీకి ఈ మ్యాచ్ ఎంతో కీలకం. ఇక, హర్మన్, స్మృతి మంధాన, రిచా ఘోష్, హర్లీన్ డియోల్‌తో భారత బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. అయితే, టిటాస్ సాధు, రేణుక, పూజ గాయాల బారిన పడడంతో బౌలింగ్ విభాగం కొంత బలహీనంగా కనిపిస్తోంది. ఈ క్రమంలో అరుంధతి, అమన్‌జోత్‌పైనే పేస్ బౌలింగ్ భారం పడనుంది. ఇక, మ్యాచ్‌కు వేదికైన ప్రేమదాస స్టేడియం వికెట్ స్లో బౌలర్లకు అనుకూలం కావడంతో దీప్తి శర్మ, స్నేహ్ రాణాతోపాటు తెలుగమ్మాయి శ్రీ చరణి ఎక్కువ ఓవర్లు బౌల్ చేసే చాన్సులున్నాయి. మరోవైపు చమరి ఆటపట్టు సారథ్యంలో శ్రీలంక జట్టు సొంతగడ్డపై జరుగుతున్న ఈ టోర్నీలో శుభారంభం చేయాలనే పట్టుదలతో ఉంది.

రెండో స్థానంలో ప్రజ్ఞానంద

వార్సా: గ్రాండ్ చెస్ టూర్ పోలెండ్ అంచె..ర్యాపిడ్ రౌండ్‌లో భాగంగా తొలిరోజు మూడు రౌండ్లు ముగిసే సరికే భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద (4) సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. మొత్తం 10 మంది తలపడుతున్న ఈ టోర్నీలో శనివారం తొలి రౌండ్‌లో లగ్రావ్‌పై, రెండో గేమ్‌లో సహచరుడు అరవింద్ చిదంబరంపై గెలిచిన ప్రజ్ఞానంద.. మూడో రౌండ్‌లో డానియల్ చేతిలో ఓడాడు. అరవింద్ చిదంబరం (3) సంయుక్తంగా నాలుగో స్థానంలో ఉన్నాడు.



న్యూఢిల్లీలో జరుగుతున్న ఆసియా యోగాసన చాంపియన్‌షిప్‌లో ఓ క్రీడాకారిణి అద్భుత విన్యాసం

ఆసియా బాక్సింగ్‌లో 43 పతకాలు ఖాయం

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల జోరు మీదున్నారు. శనివారం మరో నలుగురు సెమీఫైనల్ చేరారు. అండర్-17 బాలురలో అమన్ సివాచ్ (63కి.), దేవాన్ష్ (80కి.), బాలికల్లో సిమ్రన్‌జీత్ కౌర్ (60కి.), హిమాన్షి (70కి.) క్వార్టర్స్‌లో ప్రత్యర్థులను చిత్తు చేశారు. దీంతో టోర్నీలో భారత్‌కు 43 పతకాలు ఖాయమయ్యాయి. సెమీఫైనల్ చేరిన బాక్సర్లకు కనీసం కాంస్య పతకం దక్కుతుంది. అండర్-15 విభాగంలో కనీసం 25, అండర్-17 కేటగిరిలో 18 పతకాలు మనకు లభించనున్నాయి.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	8	6	2	0	12	1.104
ఢిల్లీ	8	6	2	0	12	0.657
బెంగళూరు	9	6	3	0	12	0.482
పంజాబ్	9	5	3	1	11	0.177
ముంబై	9	5	4	0	10	0.673
లఖ్‌నవూ	9	5	4	0	10	-0.054
కోల్‌కతా	9	3	5	1	7	0.212
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
రాజస్థాన్	9	2	7	0	4	-0.625
చెన్నై	9	2	7	0	4	-1.302

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

వరుణుడిదే విజయం



పంజాబ్ 201/4
ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ అర్ధసెంచరీలు
కోల్‌కతా ఇన్నింగ్స్‌కు వర్షం అంతరాయం

మ్యాచ్ రద్దు.. ఇరు జట్లకు చెరో పాయింట్

కోల్‌కతా: తాజా ఐపీఎల్‌లో తొలిసారి ఓ మ్యాచ్ వర్షార్పణమైంది. శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్-పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్‌కు వరుణుడు అడ్డు తగిలాడు. అయితే మొదట పంజాబ్ ఇన్నింగ్స్ సజావుగానే సాగింది. కానీ ఆ తర్వాత భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన కోల్‌కతా కేవలం ఒక ఓవర్ మాత్రమే ఆడగలిగింది. ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం ఆరంభం కావడంతో ఇరు జట్ల ఆటగాళ్లు పెవిలియన్‌కు చేరారు. వెంటనే పూర్తి మైదానాన్ని కవర్లతో కప్పి ఉంచినా వర్షం మాత్రం తెరిపినివ్వలేదు. గంటన్నర వేచి చూసినా పరిస్థితుల్లో మార్పు లేకపోవడంతో రాత్రి 11 గంటలకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. దీంతో ఇరుజట్లకు చెరో పాయింట్ లభించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 201 పరుగులు చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (49 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 83), ప్రియాన్ష్ ఆర్య (35 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 69) మెరుపు అర్ధసెంచరీలు సాధించగా.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (25 నాటౌట్) పర్వాలేదనిపించాడు. వైభవ్ అరోరాకు 2 వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనలో మ్యాచ్ ఆగే సమయానికి నైట్‌రైడర్స్ ఒక ఓవర్‌లో వికెట్ కోల్పోకుండా ఏడు పరుగులు సాధించింది.

ఓపెనర్లు అదుర్స్: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్‌కు ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ ఆర్య అదిరే ఆరంభాన్నిచ్చారు. కెప్టెన్ నిర్ణయాన్ని వమ్ము చేయకుండా ఇన్నింగ్స్‌ను కదం తొక్కించారు. చక్కటి సమన్వయంతో పాటు ఇద్దరూ పోటాపోటీ బౌండరీలతో చెలరేగారు. అయితే 15 ఓవర్లలోనే 161 స్కోరుతో ఉన్న వేళ పంజాబ్ స్కోరు సులువుగా 220కి చేరుతుందని పించింది. కానీ డెత్ ఓవర్లలో కోల్‌కతా పేసర్లు కట్టడి చేశారు. దీంతో జట్టు కష్టంగా 200 దాటగలిగింది. అంతకుముందు ప్రియాన్ష్ తొలి బంతినే ఫోర్‌గా మలిచి తన ఉద్దేశాన్ని చాటుకున్నాడు. నాలుగో ఓవర్‌లో ఆర్య 4,4.. ఐదో ఓవర్‌లో ప్రభ్ 4,6తో పవర్‌ప్లేలో జట్టు 56 రన్స్ సాధించింది. అలాగే హర్షిత్ ఓవర్‌లో ఆర్య వరుసగా 4,6,4తో 27 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేశాడు. ఇక 11వ ఓవర్‌లో ప్రభ్ రెండు సిక్సర్లు, ఆర్య ఓ సిక్సర్‌తో స్పిన్నర్ నరైన్ 22 పరుగులిచ్చుకున్నాడు. ఓవర్‌కు 10 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళుతున్న ఈ జోడీకి రస్సెల్ చెక్ పెట్టాడు. 12వ ఓవర్‌లో ప్రియాన్ష్‌ను అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆర్య నిష్క్రమించాక ప్రభ్‌సిమ్రన్ బ్యాట్ ఝుళిపించాడు. 13వ ఓవర్‌లోనే 4,4,6తో హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. స్పిన్నర్ వరుణ్ ఓవర్‌లో ప్రభ్ 4,4,6,4 బాదడంతో 19 పరుగులు వచ్చాయి. అయితే సెంచరీ ఖాయమనుకున్న వేళ పేసర్ వైభవ్ విసిరిన లో ఫుల్‌టా‌స్‌కు ప్రభ్ క్యాచ్ అవుటయ్యాడు. అయితే అప్పటికి ఓవర్‌కు 11 పరుగుల రన్‌రేట్‌తో పంజాబ్ దూసుకెళుతోంది. కానీ రస్సెల్, వైభవ్ డెత్ ఓవర్లలో కట్టడి చేశారు. ఈ సమయంలో మ్యాక్స్‌వెల్ (7), జాన్సెన్ (3) వికెట్లను సైతం కోల్పోయిన పంజాబ్ ఆఖరి ఆరు ఓవర్లలో చేసింది 43 పరుగులే. ఇక, శ్రేయాస్ క్రీజులోనే ఉన్నా భారీ షాట్లు ఆడలేకపోయాడు.



స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) వైభవ్ (బి) రస్సెల్ 69, ప్రభ్‌సిమ్రన్ (సి) పావెల్ (బి) వైభవ్ 83, శ్రేయాస్ (నాటౌట్) 25, మ్యాక్స్‌వెల్ (బి) వరుణ్ 7, జాన్సెన్ (సి) వెంకటేశ్ (బి) వైభవ్ 3, ఇంగ్లిస్ (నాటౌట్) 11, ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 20 ఓవర్లలో 201/4; వికెట్ల పతనం: 1-120, 2-160, 3-172, 4-184; బౌలింగ్: వైభవ్ అరోరా 4-0-34-2, సకారియా 3-0-39-0, హర్షిత్ 2-0-27-0, వరుణ్ 4-0-39-1, నరైన్ 4-0-35-0, రస్సెల్ 3-0-27-1.

కోల్‌కతా: గుర్బాజ్ (నాటౌట్) 1, నరైన్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం:** ఒక ఓవర్‌లో 7/0; **బౌలింగ్:** మార్కో జాన్సెన్ 1-0-6-0.

అసమానతలు తగ్గించాలి



ఐపీఎల్-దేశవాళీ క్రికెట్‌పై గవాస్కర్

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో రాణిస్తే భారత క్రికెట్ జట్టులో చోటు దక్కించుకోవడం సులువనే అభిప్రాయం అంతటా వ్యక్తమవుతుంటుంది. ఒక్క సీజన్‌లో అదరగొడితే చాలు అభిమానులు కూడా అందలం ఎక్కిస్తుంటారు. ఇప్పటికే ఈ లీగ్ ద్వారా ఎంతోమంది జాతీయ జట్టులోకి వచ్చారు. మరోవైపు దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన ఆటగాళ్లు మాత్రం పెద్దగా ఎవరి దృష్టిలోకి రావడం లేదు. ఐపీఎల్‌తో పోలిస్తే వీరికి చాన్స్‌ల పరంగానే కాకుండా జీతభత్యాల విషయంలోనూ భారీ వ్యత్యాసమే కనిపిస్తుంటుంది. ఇదే విషయాన్ని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ గుర్తుచేస్తున్నాడు. 'అనామక క్రికెటర్ కూడా ఐపీఎల్‌లో రాణిస్తే గౌరవం దక్కించుకుంటాడు. అదే రంజీ ట్రోఫీలో గొప్ప ప్రదర్శన చేసే ఆటగాడు కనీసం హెడ్‌లైన్స్‌లోనూ కనిపించడు. కెరీర్ మొత్తం రంజీల్లో ఆడినా రాని పేరు ఒక్క ఐపీఎల్ సీజన్‌లో రాణిస్తే వస్తుంది. దీనికితోడు దేశవాళీ క్రికెట్‌లో అన్ని టోర్నీల్లో ఆడినా కూడా ఐపీఎల్ అన్‌క్యాప్డ్ ప్లేయర్ కనీస ధర అయిన రూ.30 లక్షలు కూడా రావు. ఈ అసమానతలను తగ్గించే బాధ్యత రాష్ట్రాల క్రికెట్ బోర్డులతో పాటు బీసీసీఐపైనా ఉంది' అని గవాస్కర్ సూచించాడు.

'మాడ్రిడ్'లో జొకోవిచ్‌కు షాక్



మాడ్రిడ్: కెరీర్‌లో 100వ టైటిల్‌పై గురిపెట్టిన టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిచ్‌కు మాడ్రిడ్ ఓపెన్‌లో చుక్కెదురైంది. ఈ సెర్బియా యోధుడు అనూహ్యంగా ఆరంభ రౌండ్లోనే కంగుతిన్నాడు. ఇటలీకి చెందిన 44వ ర్యాంకర్ మ్యాటో అర్నాల్డి 5-3, 6-4తో 4వ సీడ్ జొకోవిచ్‌కు షాకిచ్చి సంచలనం సృష్టించాడు. ఇటీవలి కాలంలో వరుసగా విఫలమవుతున్న 37 ఏళ్ల జొకోవిచ్.. ఆరంభ మ్యాచ్‌లో ఓడడం గత ఐదు ఈవెంట్లలో అతనికిది నాలుగోసారి కావడం గమనార్హం.

బిజినెస్ ప్లస్



చుక్కల్లో పసిడి ధర.. మదుపు చేయటం ఎలా?

పసిడి ధర జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో రికార్డులు సృష్టిస్తోంది. దేశీయ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ఈ మధ్యనే రూ.లక్ష తాకింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర 3,500 డాలర్లను అధిగమించి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ బుల్ రన్‌లో బంగారంలో పెట్టుబడి పెట్టేందుకు ఉన్న అవకాశాలు ఏంటో చూద్దాం..

పసిడి పరుగుకు ఇప్పట్లో బ్రేక్ పడే సూచనలు కనిపించడం లేదు. గత ఏడాది కాలంలో పసిడిలో పెట్టుబడులు పెట్టిన మదుపరులకు 40 శాతం వరకు లాభాలు పంచాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోరుతో పసిడి ధర ఇప్పటికే రికార్డు స్థాయికి చేరింది. ఈ పరిస్థితులు ఇలానే కొనసాగితే ఈ ఏడాది చివరికల్లా ఔన్స్ పసిడి ధర 3,700 నుంచి 3,950 డాలర్ల మధ్య ట్రేడయ్యే అవకాశం ఉందని ప్రముఖ అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ అంచనా. ఆర్థిక అనిశ్చితి రాజ్యమేలుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడుల రక్షణ కోసం పసిడిని మించిన సురక్షిత పెట్టుబడి మరొకటి లేదు. ఈ నేపథ్యంలో రిటైల్ మదుపరులకు పసిడిలో పెట్టుబడి పెట్టేందుకు ఉన్న మార్గాలు ఏమిటో పరిశీలిద్దాం..

లిస్టెడ్ ఎస్‌జీబీలు

కొత్తగా సావరిన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీ) జారీని ప్రభుత్వం నిలిపి వేసింది. అయితే 2015 నుంచి 67 విడతలుగా జారీ చేసిన 14.7 కోట్ల యూనిట్ల ఎస్‌జీబీలు ఇప్పటికే బీఎస్ఈ, ఎన్ఎస్ఈ క్యాష్ సెగ్మెంట్‌లో ట్రేడవుతున్నాయి. కొన్ని ప్లాట్‌ఫామ్స్‌లో ఇవి మూడు నుంచి నాలుగు శాతం డిస్కౌంట్‌కు కూడా లభిస్తున్నాయి. డీమ్యాట్ ఫార్మాట్‌లో పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరులకు ఎస్‌జీబీలు అత్యంత అనువైనవి. ఎనిమిదేళ్ల కాలపరిమితితో జారీ చేసిన ఈ ఎస్‌జీబీల లాక్ ఇన్ పీరియడ్ ఐదేళ్లు. ఐదు, ఆరు, ఏడేళ్ల గడువు ముగిసిన ఎస్‌జీబీలను ఆర్‌బీఐ బైబ్యాక్ కూడా చేస్తుంది. పెట్టుబడుల వివిధీకరణ కోరుకునే మదుపరులు సెకండరీ మార్కెట్లో లభిస్తున్న ఎస్‌జీబీలనూ పరిశీలించవచ్చు.

గోల్డ్ ఈటీఎఫ్‌లు

నేరుగా బంగారం కొని దాచుకోలేని మదుపరుల ముందు ఉన్న మరో ఆప్షన్ గోల్డ్ ఈటీఎఫ్‌లు. డీమ్యాట్ ఖాతా ఉన్న ఎవరైనా వీటిని కొనుగోలు చేయవచ్చు. ఒక్కో గోల్డ్ ఈటీఎఫ్.. యూనిట్ల రూపంలో అందుబాటులో ఉంటాయి. వీటి ధరలు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మారుతుంటాయి. ఇవి స్టాక్ ఎక్స్ఛేంజీల్లో కూడా లిస్టయి ఉంటాయి. కాబట్టి ఎప్పుడు కావాలంటే అప్పుడు ట్రేడింగ్ రోజుల్లో వీటిని కొనుగోలు చేయవచ్చు. కాకపోతే ఇందుకు కొద్దిగా బ్రోకరేజీ చార్జీలు చెల్లించాలి. గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్‌తో పోలిస్తే వీటి నిర్వహణ ఖర్చుల నిష్పత్తి తక్కువ. అయితే వీటిని అమ్మాలన్నా.. కొనాలన్నా ఎంట్రీ, ఎగ్జిట్ లోడ్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

గోల్డ్ ఎంఎఫ్‌లు

పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరులు మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థలు అందించే గోల్డ్ ఎంఎఫ్‌లనూ పరిశీలించవచ్చు. ఇవి ఓపెన్ ఎండెడ్ ఎంఎఫ్ పథకాలు. ఈ పథకాల ద్వారా సమీకరించే నిధులను ఎంఎఫ్‌లు గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో మదుపు చేస్తాయి. ట్రేడింగ్ డే ముగిసిన వెంటనే ఎంఎఫ్‌లు ఈ గోల్డ్ ఎంఎఫ్‌ల ఎన్ఏవీల (నెట్ అసెట్ వాల్యూ)ను ఏ రోజుకు ఆ రోజు ప్రకటిస్తాయి. వీటిలో ఇన్వెస్ట్ చేసేందుకు డీమ్యాట్ ఖాతా అవసరం లేదు. కాకపోతే గోల్డ్ ఈటీఎఫ్‌లతో పోలిస్తే గోల్డ్ ఎంఎఫ్‌ల ఖర్చులు కొద్దిగా ఎక్కువ. మొత్తం ఎన్ఏవీలో ఈ ఖర్చులు ఒకటి నుంచి రెండు శాతం వరకు ఉంటాయి.

ఫిజికల్ గోల్డ్

మార్కెట్ నుంచి నేరుగా బంగారం కొనుగోలు చేయటం ఒక పద్ధతి. ఇది అందరికీ తెలిసిందే. అయితే ఇలా కొనేటప్పుడు ఆ పసిడి స్వచ్ఛత స్పష్టంగా తెలుసుకోవాలి. లేకపోతే అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉంది. ఈ బంగారాన్ని భద్రంగా దాచుకోవటం మరో సమస్య. ఈ రెండు అంశాలపై భరోసా ఉన్న మదుపరులు నేరుగా పసిడి కొనుగోలు చేసి అలానే లేదా నగల రూపంలో భద్రపరుచుకోవచ్చు.

ఎంత మదుపు చేయాలి?

మన మొత్తం పెట్టుబడుల్లో ఎంత వాటాను పసిడిలో మదుపు చేయాలనేది పెద్ద ప్రశ్న. సాధారణ పరిస్థితుల్లో కనీసం 10 శాతం, అసాధారణ పరిస్థితుల్లో 15 నుంచి 20 శాతం వరకు పసిడి సాధనాల్లో మదుపు చేయడం మంచిది. దీనివల్ల పెట్టుబడులకు భద్రతతో పాటు కాలం కలిసి వస్తే మంచి లాభాలూ కళ్ల చూడవచ్చు.

ఫారం గేటు అమ్మకం ధరలు

27వ తేదీ (నెక్ 100 గుడ్లు)

హైదరాబాద్	410
వరంగల్	412
చిత్తూరు	470
విజయవాడ	425
గోదావరి	415
విశాఖపట్నం	430



డజను గుడ్లు రూ. 60

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	122
వరంగల్	120	గుంటూరు	120
కరీంనగర్	120	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	92
కర్నూలు	120	నెల్లూరు	97
విశాఖపట్నం	111	అనంతపురం	97
గోదావరి	122		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,210 ▲	90,020 ▲	1,10,900 ▼
విజయవాడ	99,200 ▲	93,000 ▼	99,700 ▲
విశాఖపట్నం	98,210 ▼	90,020 ▼	1,11,900 ▲
రాజమండ్రి	98,240 ▼	90,050 ▼	1,00,900 ▲
ప్రొద్దుటూరు	97,400 ▼	89,610 ▼	99,500 ▼
ముంబై	95,631 ▼	87,598 ▼	97,684 ▲

జీవిత బీమా పాలసీదారులకు రైడర్లతో మరింత రక్షణ

జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. హఠాత్పరిణామాలను ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉండటమే ఉత్తమ వ్యూహం. ఆపద నుంచి రక్షించే కవచాల్లో బీమా ఒకటి. అది ఉంటే మీకే కాదు.. మీ కుటుంబ భవిష్యత్‌కూ ధీమా. అయితే, ఏ బీమా పథకమైనా కొన్ని సందర్భాల్లో పాలసీదారును ఆకస్మిక అవసరం నుంచి గట్టెక్కించలేకపోవచ్చు. అలాంటప్పుడే రైడర్లు పనికొస్తాయి. పాలసీ కవరేజీని విస్తరించే అదనపు ఫీచర్ల జోడింపే రైడర్. ఇవి పాలసీ పరిధిని విస్తృతపరచడం ద్వారా సంపూర్ణ రక్షణ కల్పిస్తాయి.



టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతి ఒక్కరూ పరిగణించాల్సిన పాలసీ. పాలసీదారు పాలసీ గడువు కాలంలో దురదృష్టవశాత్తు మరణిస్తే.. తన కుటుంబానికి ఆర్థిక భద్రత, భరోసాను కల్పిస్తుంది. టర్మ్ పాలసీ ద్వారా ఎంత మేర బీమా కవరేజీ కలిగి ఉండాలన్నది వ్యక్తి లేదా కుటుంబ అవసరంపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా, మీ వార్షిక దాయానికి కనీసం 10-15 రెట్ల బీమా కవరేజీ కొనుగోలు చేయడం మేలు. టర్మ్ పాలసీతో పాటు అదనంగా రైడర్లను ఎంపిక చేసుకోవడం ద్వారా మీ భవిష్యత్‌కు సమగ్ర బీమా కవరేజీని పొందవచ్చు. టర్మ్ పాలసీతో పాటు పరిగణించాల్సిన మూడు కీలక రైడర్ల వివరాలు..

యాక్సిడెంటల్ డెత్ అండ్ డిసేబిలిటీ బెనిఫిట్: పాలసీదారు ఒకవేళ యాక్సిడెంట్‌లో మరణిస్తే ఈ రైడర్ కలిగి ఉండటం ద్వారా నామినీకి అదనపు డెత్ బెనిఫిట్ ప్రయోజనాలు లభిస్తాయి. అంతేకాదు, యాక్సిడెంట్ కారణంగా అంగ వైకల్యం ఏర్పడిన సందర్భంలోనూ పాలసీదారుకు ఆర్థిక మద్దతును ఈ రైడర్ కల్పిస్తుంది. ముఖ్యంగా నిర్మాణ రంగం లేదా గనుల్లో పనిచేసే వారు, ఉద్యోగ రీత్యా వాహనంపై సుదీర్ఘ ప్రయాణాలు చేయాల్సిన వారికి ఈ రైడర్ ప్రయోజనకరం.

క్రిటికల్ ఇల్‌నెస్: క్యాన్సర్, గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్ర అనారోగ్యానికి గురైనప్పుడు వైద్య ఖర్చులకు ఈ రైడర్ కవరేజీ కల్పిస్తుంది. ముఖ్యంగా కుటుంబ పెద్ద లేదా పోషకులు తప్పకుండా కలిగి ఉండాల్సిన రైడర్ ఇది. ఎందుకంటే, ఈ కాలంలో కార్పొరేట్ వైద్యం చాలా ఖర్చుతో కూడిన వ్యవహారంగా మారింది.

ప్రీమియం రాయితీ: అంగ వైకల్యం లేదా తీవ్ర అనారోగ్యం కారణంగా పాలసీదారు ప్రీమియం చెల్లించలేని స్థితిలోనూ బీమా కవరేజీ కొనసాగేందుకు ఈ రైడర్ తోడ్పడుతుంది. అధిక రిస్క్‌తో కూడిన వృత్తుల వారికిది ప్రయోజనకరం.

జీఎస్‌టీ రిజిస్ట్రేషన్‌కు ఏం కావాలంటే?

ఇదీ GST



రాంబాబు గొండాల

జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ కావాలంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలన్న విషయం తెలిసిందే. అయితే ఈ దరఖాస్తుదారుల్లో వివిధ వర్గాల వారు ఉంటారు. అంటే ప్రొప్రైటర్, పార్ట్‌నర్‌షిప్, కంపెనీ, ట్రస్ట్, సొసైటీ మొదలైనవి. దీనినే 'కానిస్టిట్యూషన్ ఆఫ్ బిజినెస్' అంటారు. మరి వీటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు సమర్పించాలి? అలాగే సొంత స్థలంలో వ్యాపారం చేసే వారు కొంతమంది కాగా, అద్దె స్థలంలో వ్యాపారం చేసే వారు మరికొందరు ఉంటారు. అలాకాకుండా, వ్యాపారం జరిగే ప్రదేశం కుటుంబ సభ్యుల్లో ఒకరి పేరు మీద ఉంటే.. వ్యాపారం కుటుంబ సభ్యుల్లోనే మరొకరి పేరు మీద ఉండవచ్చు. మరి ఇలాంటి సందర్భాల్లో ఆధారాల కింద ఎలాంటి డాక్యుమెంట్స్ సమర్పించాలనే విషయంలో కొంత గందరగోళం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇటీవల కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఆ వివరాలు మీకోసం..

మొదటిది, సొంత స్థలంలో వ్యాపారం చేస్తుంటే.. అంటే, రిజిస్ట్రేషన్‌లో చూపిన ప్రిన్సిపల్ ప్లేస్ ఆఫ్ బిజినెస్‌లో చూపిన బిల్డింగ్ సొంతది అయి ఉంటే.. తగు వివరాలతో కూడిన లేటెస్ట్ ప్రాపర్టీ ట్యాక్స్ రసీదు, ఎలక్ట్రిక్ బిల్ అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. లేదంటే వాటర్ బిల్ కూడా ఇవ్వవచ్చు. అది కూడా సాధ్యం కాకపోతే రాష్ట్ర ప్రభుత్వం లేదా మునిసిపాలిటీ, పంచాయతీ ద్వారా సదరు బిల్డింగ్ యాజమాన్యాన్ని ధ్రువీకరిస్తూ జారీ చేయబడిన ఎలాంటి డాక్యుమెంట్ అయినా అప్‌లోడ్ చేయవచ్చు.

ఒకవేళ ప్రిన్సిపల్ ప్లేస్ ఆఫ్ బిజినెస్‌లో చూపిన బిల్డింగ్ అద్దెకు తీసుకున్నది అయినట్లయితే, రెంట్ లేదా లీజు డీడ్ అప్‌లోడ్ చేయటంతో పాటుగా భవన యజమానికి సంబంధించిన యాజమాన్యాన్ని ధ్రువీకరించే డాక్యుమెంట్ అంటే ప్రాపర్టీ టాక్స్ రసీదు, ఎలక్ట్రిసిటీ బిల్, ఇవ్వాల్సి ఉంటుంది లేదా ఇంతకు ముందే చెప్పినట్లు యాజమాన్యాన్ని ధ్రువీకరిస్తూ జారీ చేయబడిన ఎలాంటి డాక్యుమెంట్ అయినా అప్‌లోడ్ చేయవచ్చు. అయితే, ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే.. రెంట్ లేదా లీజు డీడ్ రిజిస్టర్ చేసి ఉంటే పైన తెలిపిన వివరాలు సరిపోతాయి. ఒకవేళ రిజిస్టర్ చేసి ఉండకపోతే స్థల యజమానికి సంబంధించిన ఆధారాన్ని (ఐడెంటిటీ ప్రూఫ్) కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఇకపోతే వ్యాపార స్థలం కుటుంబ సభ్యులకు లేదా బంధువులకు సంబంధించినదై ఉండి.. ఎలాంటి అద్దె లేదా లీజు గానీ లేనిదైతే స్థల యజమాని నుంచి దీనికి సంబంధించి 'సమ్మతి'తో కూడిన పత్రం (కన్సెంట్ లెటర్)తో పాటు స్థల యజమానికి సంబంధించిన ఆధారాన్ని (ఐడెంటిటీ ప్రూఫ్) కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో పాటుగా పైన తెలిపినట్లుగా యాజమాన్యాన్ని ధ్రువీకరించే ఆధారాలు కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఇక, కానిస్టిట్యూషన్ ఆఫ్ బిజినెస్‌కు సంబంధించిన డాక్యుమెంట్స్ అంటే పార్ట్‌నర్‌షిప్ వ్యాపారానికి సంబంధించి పార్ట్‌నర్‌షిప్ డీడ్ ఇవ్వవలసి ఉండగా..కంపెనీ, సొసైటీ, ట్రస్ట్‌లకు సంబంధించి రుజువులను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే డాక్యుమెంట్స్, ఫొటోలు స్పష్టంగా ఉండేట్లు చూసుకోవటం ముఖ్యం.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



కార్తీక్ స్టైల్లో ఆకట్టుకుంటుంది

సూర్య

"రెట్రో' కార్తీక్ సుబ్బరాజ్ స్టైల్లో ఉండే సినిమా. ఆయన శైలి ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. మంచి సినిమాటిక్ అనుభూతినిస్తుందీ చిత్రం. ప్రేక్షకుల్ని తప్పకుండా ఆకట్టుకుంటుంది. ఇందులో చాలా మంది గొప్పవారితో కలసి నటించడం మరిచిపోలేని అనుభూతి" అని హీరో సూర్య చెప్పారు. ఆయన కథానాయకుడిగా కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కించిన చిత్రం 'రెట్రో'. మే1న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం ప్రీరిలీజ్ వేడుక ఏర్పాటు చేశారు. సూర్య మాట్లాడుతూ 'నాపై మీరు చూపిస్తోన్న ప్రేమ ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. సంతోష్‌నారాయణ్‌గారు అద్భుతమైన సంగీతం ఇచ్చారు. ఈ సినిమాకు తెలుగులో కాసర్ల శ్యామ్ హృదయానికి హత్తుకునే లిరిక్స్ ఇచ్చారు. 'రెట్రో'తో పాటు నా మిత్రుడు నాని నటించిన 'హిట్ 3' కూడా ఘనవిజయం సాధించాలి. చిరంజీవిగారి బ్లడ్ బ్యాంక్ స్ఫూర్తితోనే 'అగరం' ఫౌండేషన్ స్థాపించా. మీ ప్యాషన్‌ను వెతుక్కుంటూ వెళ్లండి. అదే మీకు దారి చూపుతుంది. నన్ను ఇన్నేళ్లుగా సపోర్ట్ చేస్తున్న అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు' అన్నారు. ముఖ్య అతిథి విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "సూర్య అన్న సినిమాలను నేను స్కూల్, కాలేజీ డేస్‌లో విపరీతంగా చూసేవాడ్ని. 'గజినీ' సినిమా చూశాక, ఆయన యాక్టింగ్‌తో ప్రేమలో పడిపోయా. ఆయనను కలవాలని చాలా సార్లు ప్రయత్నించాను. ఇప్పటికి కుదిరింది. ఈ సందర్భం నాకు చాలా ప్రత్యేకం. ఆయనలా ప్రయోగాత్మక పాత్రలు చేయాలంటే చాలా ధైర్యం కావాలి. సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను. 'అగరం' ఫౌండేషన్ ద్వారా ఆయన చేసే సేవా కార్యక్రమాలు అందరికీ స్ఫూర్తిదాయకం" అని అన్నారు. "ఈ సినిమా డిస్ట్రిబ్యూషన్ హక్కులు ఇచ్చిన సూర్యగారికి కృతజ్ఞతలు. ఆయన హీరోగా నేను నిర్మిస్తోన్న సినిమా గురించే ఇప్పుడేమీ చెప్పను. అది ప్రేక్షకుల ఊహకే వదిలేస్తున్నాను" అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ తెలిపారు. "ఒక సినిమా కోసం ఓ యాక్టర్ ఎంతలా కష్టపడతాడో గజినీ' చూశాకే తెలిసింది. ఆయన చేసిన సినిమాలు జీవిత పాఠాలు" అని దర్శకుడు వెంకీ అట్లూరి చెప్పారు.

మరోసారి జంటగా



శర్వానంద్ కథానాయకుడిగా సంపత్ నంది దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. 'శర్వా 38' అనేది వర్కింగ్ టైటిల్. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉందీ చిత్రం. త్వరలోనే షూటింగ్ మొదలుకానుంది. 1960ల కాలంలో సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో శర్వా సరసన అనుపమ పరమేశ్వరన్ నటించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఆమెను టీమ్ లోకి ఆహ్వానిస్తూ పోస్ట్ పెట్టారు. 1960ల కాలానికి తగ్గ దుస్తులను ధరించారు అనుపమ. ఈ పాన్ ఇండియా ప్రాజెక్టును కే.కే.రాధామోహన్ నిర్మిస్తున్నారు. సౌందర్‌రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. కాగా, శర్వా, అనుమప కలసి 2017లో విడుదలై ఘనవిజయం సాధించిన 'శతమానం భవతి' సినిమాలో నటించారు.

కొత్త లుక్‌లో...



దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కాంత'. పీరియాడిక్ నేపథ్యంలో రూపొందుతోంది. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. సముద్రఖని ఈ చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. శనివారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'కాంత' చిత్రం నుంచి ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్రబృందం పంచుకుంది. పోస్టర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న సముద్రఖని బ్యాక్‌సైడ్ లుక్‌ను చూపించారు. ఆయన భిన్నమైన ఆహార్యంతో తీక్షణంగా చూస్తూ కనిపించారు. ప్రస్తుతం 'కాంత' నిర్మాణానాంతర పనులు జరుగుతున్నాయి. త్వరలో మేకర్స్ విడుదల తేదీని ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఝును చంతర్, సినిమాటోగ్రఫీ: డానీ శాంచెజ్ లోపెజ్

ప్రాధాన్యమున్న పాత్ర నాది

శ్రీనిధి శెట్టి

'నా క్యారెక్టర్ పేరు మృదుల. అర్జున్ సర్కార్ పాత్రకు భిన్నంగా ఉంటుంది. ఎంతో ప్రాధాన్యమున్న పాత్ర నాది. నిజానికి ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో హీరోయిన్ పాత్రకు అంత ప్రాధాన్యం ఉండదు. దర్శకుడు శైలేష్ కొలను చాలా తెలివైన రచయిత. మీరు 'హిట్, 'హిట్-2' సినిమాలు గమనిస్తే ఒక్కో సినిమాకి హీరోయిన్ క్యారెక్టరైజేషన్‌లో ప్రాధాన్యం పెరుగుతుంది' అని అన్నారు కథానాయిక శ్రీనిధి శెట్టి. నాని, శ్రీనిధి జంటగా శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. వాల్ పోస్టర్ సినిమా, నాని యునానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే 1న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శ్రీనిధి మీడియాతో మాట్లాడుతూ 'నానితో పనిచేయడం ఓ అద్భుతమైన అనుభవం. ఈ సినిమాలో నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పాను. ఓ కన్నడ అమ్మాయిలా కాకుండా తెలుగు అమ్మాయిలానే డబ్బింగ్ చెప్పా. దర్శకుడు సినిమాను చక్కగా తెరకెక్కించారు. మిక్కీ జే మేయర్ అద్భుతమైన సంగీతం అందించారు. మొదటి పాట ప్రేమ వెల్లువ సూపర్ హిట్ అయింది. అలాగే అనిరుధ్ పాడిన పాట కూడా ఆదరణ పొందుతోంది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది' అని తెలిపారు.



సీత పాత్రను వద్దనలేదు

'రామాయణ్' చిత్రంలో సీత పాత్రలో నటించే అవకాశం వస్తే తిరస్కరించానని మీడియాలో తప్పుడు వార్తలు వస్తున్నాయి. నేను సీత క్యారెక్టర్ కోసం ఆడిషన్ ఇచ్చాను. ఆ తర్వాత మేకర్స్ నుంచి ఎలాంటి పిలుపు రాలేదు. అసలు అలాంటి క్యారెక్టర్‌ని రిజెక్ట్ చేసే యాక్టర్‌ని కాదు నేను. ఫైనల్‌గా ఆ పాత్రకు సాయి పల్లవిని ఎంపిక చేశారని మీడియా ద్వారానే తెలుసుకున్నాను.

ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు



ఇంద్రారామ్, పాయల్ రాధాకృష్ణ జంటగా నిఖిల్ గొల్లమారి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'చౌర్య పాఠం'. దర్శకుడు త్రినాధరావు నక్కిన ఈ చిత్రంతో నిర్మాణ రంగంలోకి ప్రవేశించారు. సినిమా ఇటీవలె విడుదలైన సందర్భంగా చిత్రబృందం 'గ్రాటిట్యూడ్ మీట్'ని శనివారం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ 'బుకింగ్స్ రోజు రోజుకూ పెరుగుతున్నాయి. మా సినిమాను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. తెరపై యాక్టర్స్ కాకుండా క్యారెక్టర్స్ కనిపిస్తున్నాయని ప్రేక్షకులు అంటున్నారు' అని అన్నారు. దర్శకుడు నిఖిల్ మాట్లాడుతూ 'మా సినిమాకి వచ్చిన రెస్పాన్స్ చూస్తుంటే చాలా ఆనందం కలుగుతోంది' అని చెప్పారు. కథానాయకుడు ఇంద్రారామ్ మాట్లాడుతూ 'ఈ రోజుల్లో ఆడియన్స్ థియేటర్లకు రావడం కష్టంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా సినిమాకి వచ్చి మమ్మల్ని ప్రోత్సహించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

నిధి కోసం సాహసయాత్ర



అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్న ఈ సినిమాకు 'ఎన్‌సీ24' అనేది వర్కింగ్ టైటిల్. మైథలాజికల్ అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా సాగే ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులకు సంబంధించిన ఓ మేకింగ్ వీడియోను టీమ్ తాజాగా విడుదల చేసింది. సాహసయాత్ర ఆరంభం అని తెలిపింది. ఇందులో అద్భుతమైన లొకేషన్లను, సినిమా నేపథ్యాన్ని ప్రతిబింబించే సెట్ డిజైన్లను, వీఎఫ్‌ఎక్స్ హంగుల కోసం సాంకేతిక బృందం చేస్తున్న పనులను చూపించారు. అలాగే, నాగచైతన్య లుక్‌తో సహా కీలక పాత్రల లుక్ టెస్ట్ స్టిల్స్ ఈ వీడియోలో ఉన్నాయి. ఇందులో మునుపెన్నడూ పోషించని పాత్రను నాగచైతన్య పోషిస్తున్నారు. వీడియోను చూస్తుంటే ఆయన నిధి అన్వేషణలో సాగే ఓ సాహసయాత్రికుడిలా కనిపిస్తున్నారు. బాపినీడు సమర్పణలో దర్శకుడు సుకుమార్, బీవీఎస్‌ఎన్ ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



యువతను మెప్పించే చిత్రం

సుధీర్ వెంకట్, అంకిత జంటగా అరవింద్ జాషువా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ప్యాషన్'. అరుణ్ కుమార్, నరసింహ నిర్మాతలు. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్యాషన్ నవల చదివాను. బాగా నచ్చింది. ఆ కథను అరవింద్ జాషువా చాలా అద్భుతంగా తెరకెక్కిస్తాడనే నమ్మకం కలిగింది. తన బ్యాగ్రౌండ్ అయిన ఫ్యాషన్ టెక్నాలజీ నేపథ్యంలో సినిమా తీయడం అభినందించాల్సిన విషయం' అని అన్నారు. చిత్ర దర్శకుడు అరవింద్ జాషువా మాట్లాడుతూ 'సెలబ్రిటీలు, వీఐపీల పిల్లలు చదివే 'నిఫ్ట్' కాలేజీలో ఒక మామూలు పిల్లాడు చేరితే ఎలాంటి కష్టాలు ఎదురవుతాయనేది ఈ చిత్ర కథ' అని తెలిపారు.

పురాణ నేపథ్యంలో



ప్రస్తుతం మైథలాజికల్ టచ్ ఉన్న చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండడంతో ఆ తరహా చిత్రాల నిర్మాణం ఎక్కువైంది. ఇటువంటి నేపథ్యంలో జగదీశ్ ఆమంచి హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'యముడు'. ధర్మో రక్షతి రక్షితః అనేది ఉప శీర్షిక. ఇందులో శ్రావణి శెట్టి కథానాయిక. ఈ మూవీకి చెందిన పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఇందులో యముడి గెటప్‌లో జగదీశ్ కనిపించారు. ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తారు. ఈ చిత్రానికి రచన: హరి అల్లసాని, జగదీశ్ ఆమంచి, సంగీతం: భవానీ రాకేశ్, డీఓపీ: విష్ణురెడ్డి వంగా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రజని ఆమంచి.

ఏఆర్ రెహ్మాన్ రూ.2 కోట్లు చెల్లించాలి

- ఢిల్లీ హైకోర్టు ఆదేశం




దర్శకుడు మణిరత్నం రూపొందించిన 'పొన్నియిన్ సెల్వన్-2' మూవీలోని 'వీరా రాజ వీర' పాటకు సంబంధించిన కాపీరైట్ కేసులో సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ హైకోర్టు రిజిస్ట్రార్‌కు రూ.2 కోట్లు, పిటిషన్‌దారుడికి రూ.2 లక్షలు చెల్లించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. పద్మశ్రీ అవార్డు గ్రహీత, భారత శాస్త్రీయ గాయకుడు ఫయాజ్ వాసిఫుద్దీన్ ఠాకూర్ 2023లో ఢిల్లీ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశారు. 'పొన్నియిన్ సెల్వన్-2' మూవీలోని ఏఆర్ రెహ్మాన్ స్వరపరిచిన 'వీరా రాజ వీరా' పాట తన తండ్రి నజీర్ ఫయాజుద్దీన్ ఠాకూర్, మామ జహీరుద్దీన్ ఠాకూర్‌లు స్వరపరిచిన శివస్తుతి పాట నుంచి కాపీ చేశారని, అందువల్ల ఈ పాటను ఎక్కడా ఉపయోగించకుండా ఏఆర్ రెహ్మాన్, మద్రాస్ టాకీస్‌లను ఆదేశించాలని, అలాగే కాపీరైట్ చట్టం కింద తనకు పరిహారం చెల్లించాలని అభ్యర్థించారు. అదే సమయంలో రెహ్మాన్ తరఫున కూడా కౌంటర్ దాఖలు చేయడం జరిగింది. వీటిని నిశితంగా పరిశీలించి, పలు దఫాలుగా విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు శుక్రవారం తుదితీర్పును వెలువరించింది. ఈ కేసులో రెహ్మాన్ తరఫు న్యాయవాదులు వినిపించిన వాదనలను తోసిపుచ్చి.. కాపీరైట్ చట్టం కింద రూ.2 కోట్లను హైకోర్టు రిజిస్ట్రార్‌కు, పిటిషన్‌దారుడికి రూ.2 లక్షలు చెల్లించాలని ఆదేశించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

తటస్థ విచారణకు సిద్ధం

» విశ్వసనీయ దర్యాప్తులో మేం పాలు పంచుకుంటాం

» పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పహల్‌గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్ర మారణకాండపై పాకిస్థాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ తాజాగా స్పందించారు. ఈ ఘటనపై తటస్థ విచారణకు తాము సిద్ధమేనని తెలిపారు. విశ్వసనీయ దర్యాప్తులో పాలు పంచుకుంటామని చెప్పారు. శనివారం.. పాకిస్థాన్‌లోని ఖైబర్-పఖ్తున్‌ఖ్వాలోని మిలిటరీ అకాడమీలో జరిగిన గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో షెహ్‌బాజ్ పాల్గొన్నారు. "పహల్‌గామ్‌లో ఇటీవల జరిగిన విషాదకర ఘటనతో మన దేశం మరోసారి నిందలు మోయాల్సి వచ్చింది. ఈ నిందలను శాస్వతంగా అరికట్టాలి. బాధ్యతాయుతమైన దేశంగా మన పాత్రను కొనసాగించాలి. ఈ క్రమంలో ఎలాంటి తటస్థ, పారదర్శక, విశ్వసనీయ విచారణలోనైనా పాకిస్థాన్ పాలు పంచుకుంటుంది." అని షరీఫ్ తెలిపారు. అంతేకాదు.. ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా దానిని తమ దేశం ఖండిస్తుందని చెప్పారు. అయితే, అదేసమయంలో దేశానికి వ్యతిరేకంగా ఎలాంటి దుస్సాహసం జరిగినా.. పాకిస్థానీ సాయుధ దళాలు దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించుకునేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. "మన దేశ సార్వభౌమత్వంపై ఎన్నటికీ రాజీపడబోం" అని షరీఫ్ చెప్పారు. సింధు నది జలాలపై భారత్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ.. ఇది ఏకపక్ష నిర్ణయమన్నారు. ఇలాంటి నిర్ణయాలు తగవని చెప్పారు. వీటి వల్ల యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నారని భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు.

287 మంది పాక్‌కు.. 191 మంది భారత్‌కు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పహల్‌గామ్ ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భారత్‌లోని పాక్ జాతీయులు 48 గంటల్లో దేశం వదిలి వెళ్లాలని కేంద్రం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 287 మంది పాక్ జాతీయులు దేశం వీడి వెళ్లారని అధికారులు తెలిపారు. అదేసమయంలో 191 మంది భారతీయ పౌరులు కూడా పాక్ నుంచి తిరిగి వచ్చారు. ఇక, పాక్ జాతీయులను వివాహం చేసుకున్న పలువురు మహిళలు.. అట్టారి-వాఘా సరిహద్దు దాటేందుకు ప్రయత్నించగా వారిని సరిహద్దు భద్రత అధికారులు అనుమతించలేదు. వీరికి భారత పాస్‌పోర్టులు ఉండడంతో.. సరిహద్దు దాటనివ్వలేదు. దీంతో ఆయా మహిళలు వారి కుటుంబాల్లోని పాక్ జాతీయత ఉన్న వ్యక్తులను మాత్రమే ఆ దేశానికి పంపించారు.

మీడియా సంయమనం పాటించాలి

» సైనిక కార్యకలాపాలపై ప్రత్యక్ష ప్రసారాలు వద్దు: కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్‌గామ్ ఉగ్రవాద దాడితో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో.. మీడియా సంస్థలు ప్రసారాల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. జాతీయ భద్రతా ప్రయోజనాల దృష్ట్యా.. సైనిక కార్యకలాపాలకు సంబంధించిన వార్తలు ఇచ్చేటప్పుడు చట్టాలు, నిబంధనలు పాటించాలని పేర్కొంది. విశ్వసనీయ వర్గాల సమాచారం పేరుతో వివరాలు వెల్లడించరాదని, భద్రతా దళాల కదలికలపై ప్రత్యక్ష ప్రసారాలు చేయవద్దని ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ.. మీడియా సంస్థలకు మార్గదర్శకాలు విడుదల చేసింది. సున్నితమైన సమాచారాన్ని ముందుగానే వెల్లడించడం వల్ల శత్రువర్గాలకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంటుందని, సిబ్బంది భద్రతకు, ఆపరేషన్ల సమర్థతకు ముప్పు వాటిల్లవచ్చని పేర్కొంది. కార్గిల్ యుద్ధం, ముంబయిలో ఉగ్రదాడులు, కాందహార్ హైజాకింగ్ వంటి ఘటనలు జరిగినప్పుడు ఎటువంటి ఆంక్షలు లేకుండా సమాచారాన్ని ప్రసారం చేయడం వల్ల జాతీయ ప్రయోజనాలకు నష్టం వాటిల్లిందని గుర్తు చేసింది.

ముంబైలో 5వేల మంది పాకిస్థానీలు

ముంబై, ఏప్రిల్ 26: మహారాష్ట్రలో 5వేల మంది పాకిస్థానీలు ఉన్నారని, వీరిలో 1,000 మంది స్వల్పకాలిక వీసాలు కలిగి ఉన్నట్టు ఆ రాష్ట్ర మంత్రి యోగేష్ కదమ్ శనివారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వారందరినీ దేశం విడిచివెళ్లాలని చెప్పామన్నారు. దేశంలో కొంత మంది 8-10 ఏళ్లుగా నివసిస్తున్నారని, కొందరు పెళ్లి కూడా చేసుకున్నారని చెప్పారు. కొందరు తమ పాకిస్థాన్ పాస్‌పోర్టును సరెండర్ చేసి భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 21మంది పాకిస్థానీలు ఉన్నట్లు గుర్తించారు. వారిని వెంటనే పాకిస్థాన్‌కు వెళ్లిపోవాలని ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. మరోవైపు, గుజరాత్ పోలీసులు చేపట్టిన భారీ ఆపరేషన్‌లో భాగంగా వెయ్యి మందికి పైగా బంగ్లాదేశ్‌కు చెందిన అక్రమ వలసదారులను అహ్మదాబాద్, సూరత్‌లో అదుపులోకి తీసుకున్నట్టు కేంద్ర హోం శాఖ సహాయమంత్రి హర్ష్ సంఘవి శనివారం తెలిపారు. గుజరాత్ పోలీసులు చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా అహ్మదాబాద్‌లో 890 మందిని, సూరత్‌లో 134 మందిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

భారత్-పాక్‌లది వెయ్యేళ్ల పోరాటం..

» పహల్‌గామ్ ఉగ్రదాడి దారుణం: ట్రంప్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: భారత్, పాకిస్థాన్ దేశాలు కశ్మీర్ కోసం వెయ్యేళ్లుగా పోరాడుతున్నాయని, 1,500 ఏళ్లుగా రెండు దేశాల మధ్య సరిహద్దు సమస్య ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రమైన వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాలు తమంతట తామే ఏదో ఒకలా పరిష్కరించుకుంటాయని పేర్కొన్నారు. పోప్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వాటికన్ సిటీకి ప్రయాణిస్తున్న సమయంలో.. ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. పహల్‌గామ్ ఉగ్రదాడి, భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల అంశాన్ని మీడియా ప్రస్తావించగా.. "నేను భారత్‌కు చాలా దగ్గర, పాకిస్థాన్‌కు కూడా చాలా దగ్గరివాడిని. కశ్మీర్‌లో ఆ రెండు దేశాలు వెయ్యి ఏళ్లుగా పోరాడుతున్నాయి. ఆ ఉగ్రవాద దాడి చాలా దారుణం. రెండు దేశాల మధ్య బహుశా 1,500 ఏళ్లుగా సరిహద్దుల సమస్య కొనసాగుతోందనుకుంటా" అని ట్రంప్ బదులిచ్చారు.

రాష్ట్రంలో 21 మంది పాకిస్థానీలు

» తక్షణం దేశం వీడాలని పోలీసుల ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పహల్ గామ్ ఉగ్రదాడిని అత్యంత సీరియస్‌గా తీసుకున్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను రాష్ట్రంలోనూ పోలీసులు గట్టిగా అమలు చేస్తున్నారు. పాకిస్థాన్ జాతీయులు తక్షణమే రాష్ట్రం విడిచి వెళ్లి పోవాల్సిందిగా పలు జిల్లాల పోలీసులు ఆదేశించారు. శుక్ర, శనివారాల్లో సమీక్ష నిర్వహించిన డీజీపీ హరీష్ కుమార్ గుప్తా రాష్ట్రంలో ఎక్కడ పాకిస్థానీయులు ఉన్నా తక్షణమే వారిని దేశం నుంచి పంపించేయాలని జిల్లాల ఎస్పీలను, పోలీస్ కమిషనర్లను ఆదేశించారు. రంగంలోకి దిగిన పోలీసు, ఇంటెలిజెన్స్ వర్గాలు మొత్తం 21మంది పాకిస్థానీయులు వారిలో 14 మంది ఆదివారం లోపు వెళ్తామని చెప్పగా, మరో ఏడుగురు వైద్య సేవల కోసం వచ్చామని సోమవారం ఆస్పత్రిలో చూపించుకుని ఈనెల 29న దేశం విడిచి పాకిస్థాన్‌కు వెళ్లిపోతామని పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. ప్రతి ఒక్కరిపై నిఘా పెట్టి అందరినీ ఈ నెల 29లోపు దేశం దాటి పోయేలా చూడాలని ఎస్పీలకు డీజీపీ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. దేశ భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఏపీలో పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా డీజీపీ చెప్పారు.

నీట్‌పై అనుమానాస్పద అంశాలను.. తెలియజేసేందుకు ప్రత్యేక వెబ్‌సైట్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 : వైద్య విద్య ప్రవేశ పరీక్ష(నీట్)కు సంబంధించి అనుమానాస్పద అంశాలను తెలియజేసేందుకు ప్రత్యేక వెబ్‌సైట్(ప్లాట్‌ఫామ్)లను ఏర్పాటు చేసినట్లు జాతీయ పరీక్ష ఏజెన్సీ(ఎన్టీయే) అధికారులు తెలిపారు. ఈ పరీక్ష రాసే అభ్యర్థులు తప్పుదోవ పట్టించే వ్యక్తుల మాటలు నమ్మవద్దని వారు సూచించారు. గత ఏడాది నీట్‌లో అక్రమాలు, లీకులు చోటు చేసుకున్నాయని పలు ఆరోపణలు రావడంతో ముందు జాగ్రత్తగా ఎన్టీయే ఈ చర్య తీసుకుంది. నీట్ అభ్యర్థులు తమ దృష్టికి వచ్చిన అనుమానాస్పద అంశాలను https://nta.ac.in, https://neet.nta.ac.in అనే వెబ్‌సైట్ల ద్వారా తెలియజేయవచ్చు. సోషల్ మీడియా ఖాతాల ద్వారా లేదా అనధికారిక వెబ్‌సైట్ల ద్వారా నీట్ ప్రశ్నపత్రం అందిస్తామనే వారు లేదా ఈ పరీక్ష వివరాలు చెబుతామనే వారి వివరాలు తెలియజేయవచ్చు.

సరిహద్దు.. ఉద్రిక్తం!



కుల్గాంలో భద్రతా బలగాల సెర్చ్ ఆపరేషన్

(మొదటి పేజీ తరువాయి)

నెలకొంది. సరిహద్దులకు సమీపంలోని గ్రామాల ప్రజలు ముందు జాగ్రత్త చర్యగా బంకర్లలోకి వెళ్లి తలదాచుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు ఉగ్రవాదుల జాడ కోసం భద్రతా బలగాలు వివిధ ప్రాంతాలు జల్లెడ పడుతున్నాయి. ఉగ్రవాదుల ఇళ్ల కూల్చివేత కొనసాగుతోంది.

విచ్చలవిడిగా పాక్ సైన్యం కాల్పులు..

పాక్ సైన్యం నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) పొడవునా ఉన్న ఔట్‌పోస్టుల నుంచి ఎలాంటి హెచ్చరికలూ లేకుండానే.. కాల్పులు జరుపుతోందని రక్షణ వర్గాలు వెల్లడించాయి. పహల్‌గామ్ ఘటన తర్వాత ఈ నెల 24న రాత్రి తొలిసారిగా పాక్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘించిందని.. తర్వాత అడపాదడపా కాల్పులు జరుపుతూనే ఉందని, శుక్రవారం రాత్రంతా కూడా ఇది కొనసాగిందని తెలిపాయి. పాక్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘించిన సమయంలో.. తలదాచుకునేందుకు భారత ప్రభుత్వం సరిహద్దు గ్రామాల్లో 18 వేలకుపైగా వ్యక్తిగత, సామూహిక బంకర్లను నిర్మించింది. కొన్నేళ్లుగా సరిహద్దుల వెంట కాల్పుల ఘటనలు లేకపోవడంతో వాటిని వినియోగించలేదు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులు, పాక్ దళాల కాల్పుల నేపథ్యంలో... ఆ బంకర్లను శుభ్రం చేసి, తలదాచుకునేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. "ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అందుకే అండర్‌గ్రౌండ్ బంకర్లను సిద్ధం చేసి పెట్టుకుంటున్నాం. మా గ్రామంలో గోధుమ పండిస్తున్నాం. దిగుబడి రావడానికి ఇంకా కొన్ని రోజులు పడుతుంది. అయినా ముందే పంట కోతలు చేపడుతున్నారు. మగవాళ్లంతా ఆ పనుల్లో ఉంటే.. ఆడవాళ్లంతా బంకర్లను శుభ్రం చేసే పనుల్లో ఉన్నారు" అని ఆర్‌ఎస్ పుర సెక్టార్‌లోని ట్రెవా గ్రామ మాజీ సర్పంచ్ బల్బీర్ కౌర్ చెప్పారు.

మరో ముగ్గురు ఉగ్రవాదుల ఇళ్ల కూల్చివేత

ఉగ్రవాద నిర్మూలన దిశగా కీలక చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. ఉగ్రవాదుల ఇళ్ల కూల్చివేతను కొనసాగిస్తోంది. పహల్‌గామ్ ఉగ్రదాడికి పాల్పడిన ఆసిఫ్ షేక్, ఆదిల్ తోకర్‌ల ఇళ్లను శుక్రవారం పేల్చేసిన భద్రతా బలగాలు.. శనివారం మరో ముగ్గురు ఉగ్రవాదులు అహ్సాన్ షేక్, షాహిద్ కుట్టీ, జాహిద్ అహ్మద్‌ల ఇళ్లను కూల్చేశాయి. ఇందులో పుల్వామాకు చెందిన లష్కరే తాయిబా ఉగ్రవాది అహ్సాన్‌కు పహల్‌గామ్ దాడితో సంబంధం ఉన్నట్టు గుర్తించారు. ఇక, షోపియాన్ ప్రాంతానికి చెందిన షాహిద్, కుల్గాంకు చెందిన జాహిద్ ఇద్దరూ గత మూడు, నాలుగేళ్లుగా దేశద్రోహ చర్యల్లో పాలుపంచుకుంటున్నట్టు తేల్చారు. దీనిపై జమ్మూకశ్మీర్ సీనియర్ అధికారి ఒకరు స్పందిస్తూ.. "స్థానికులు పాక్ ఉగ్రవాదులకు సాయం చేయడం, ఉగ్రవాదులుగా మారడాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టక తప్పడం లేదు. ఉగ్రవాదులుగా మారిన వారి కుటుంబాలు కూడా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, ప్రభుత్వ పథకాలు, ఉద్యోగాలేవీ అందవని స్థానిక యువతకు స్పష్టం చేస్తున్నాం. ఇళ్ల కూల్చివేత కూడా ఆ దిశగా ఇస్తున్న సంకేతాలే." అని పేర్కొనడం గమనార్హం. ఇదిలా ఉండగా, పహల్‌గామ్ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను వేటాడేందుకు భద్రతా బలగాలు జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా అడుగడుగూ జల్లెడపడుతున్నాయి. ఈ క్రమంలో జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లా తొకర్‌పొర ప్రాంతంలో ఉగ్రవాదుల అనుచరులు ఇద్దరిని భద్రతా దళాలు గుర్తించి, అదుపులోకి తీసుకున్నాయి. అయితే వారి వివరాలను బయటికి వెల్లడించలేదు. మరోవైపు కుప్వారా జిల్లాలోని సెడోరి నల అటవీ ప్రాంతంలో ఉగ్రవాదుల ఆయుధాల డంప్‌ను జమ్మూకశ్మీర్ పోలీసులు గుర్తించారు.

పహల్గాం కేసు ఎన్‌ఐఏ చేతికి..

పహల్గాం ఉగ్రదాడి కేసు అధికారికంగా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) పరిధిలోకి వెళ్లింది. ఘటన జరిగిన వెంటనే జమ్మూకశ్మీర్ స్థానిక పోలీసులు ఈ ఘటనపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఘటన వివరాలు, పూర్వాపరాలను సేకరించి కేసు డైరీని సిద్ధం చేశారు. తాజా వీటన్నింటినీ అధికారికంగా ఎన్‌ఐఏకు అప్పగించారు. నిజానికి దేశంలో ఉగ్రవాద కేసుల దర్యాప్తు ఎన్‌ఐఏ ఆధ్వర్యంలోనే సాగుతుంది. పహల్‌గామ్ ఉగ్రదాడికి సంబంధించి కూడా ఎన్‌ఐఏ అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. శనివారం ఒడిశాలోని ఇషాని గ్రామానికి చేరుకుని.. ఉగ్రదాడిలో మృతి చెందిన ప్రశాంత్ సత్పతి భార్య ప్రియదర్శిని నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. కోల్‌కతాకు చెందిన ఇద్దరు మృతుల కుటుంబ సభ్యులను కూడా కలసి వాంగ్మూలాలు నమోదు చేశారు.

గొంతు కోస్తాం.. పాక్ ఆర్మీ అధికారి హెచ్చరిక సంజ్ఞ!

పహల్‌గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ లండన్‌లోని పాకిస్థాన్ హైకమిషన్ ఎదుట నిరసన తెలుపుతున్న భారతీయులకు పాక్ ఆర్మీ అధికారి చేసిన హెచ్చరిక సంజ్ఞ కలకలం రేపుతోంది. భారత సంతతివారితో పాటు ఇజ్రాయెలీలు కూడా ఈ నిరసనలో పాల్గొన్నారు. పాక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సమయంలో పాక్ హైకమిషన్‌లో సైనిక, వైమానిక దళాల సలహాదారుగా ఉన్న కల్నల్ తైమూర్ రాహత్ బాల్కనీలోకి వచ్చారు. 2019 భారత యుద్ధవిమానం కూలిపోయి.. ఎల్‌వోసీ అవతల పాకిస్థాన్‌కు చిక్కిన ఎయిర్‌ఫోర్స్ గ్రూప్ కెప్టెన్ అభినందన్ చిత్రాన్ని పట్టుకుని రెచ్చగొట్టేలా వ్యవహరించారు. నిరసనకారులకు వేలు చూపిస్తూ.. గొంతు కోస్తామన్నట్టుగా సంజ్ఞ చేశారు. అంతేకాదు నిరసనకారుల నినాదాలు వినిపించకుండా లౌడ్ స్పీకర్లు పెట్టి పెద్ద ధ్వనితో పాకిస్థాన్ దేశభక్తి గీతాలను ప్లే చేశారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

మా నీళ్లు రాకపోతే.. వారి రక్తం ప్రవహిస్తుంది!

» పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ చీఫ్ బిలావల్ భుట్టో ప్రేలాపనలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పహల్‌గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేయడంపై పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) చీఫ్ బిలావల్ భుట్టో జర్దారీ నోరు పారేసుకున్నారు. నదిలో నీరు పారకపోతే వారి నెత్తురు ప్రవహిస్తుందంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. సింధు నాగరికతకు తామే నిజమైన సంరక్షకులమని ప్రకటించుకున్నారు. శుక్రవారం ఆయన ఓ బహిరంగ సభలో మాట్లాడారు. 'సింధు నది మనది.. ఇకముందు కూడా మనదిగానే ఉంటుంది. దానిలో నీళ్లు ప్రవహిస్తాయి. లేకపోతే వారి రక్తం పారుతుంది' అన్నారు. ఈ వ్యాఖ్యలపై కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ తీవ్రంగా స్పందించారు. బిలావల్ ఒక మూర్ఖుడన్నారు.

పహల్గాం దాడి మా పని కాదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తమ పని కాదంటూ ఉగ్రవాద సంస్థ లష్కరే తాయిబా(ఎల్‌ఈటీ) అనుబంధ సంస్థ ద రెసిస్టెన్స్ ఫ్రంట్(టీఆర్‌ఎఫ్) బుకాయించింది. ఈ మేరకు జాతీయ మీడియా సంస్థలకు టెలిగ్రామ్ ద్వారా సందేశాలు పంపింది. తమ అధికారిక డిజిటల్ ప్లాట్‌ఫామ్ హ్యాకింగ్ గురైందని బుకాయిస్తూ.. భారతీయ నిఘా సంస్థలపై నెపాన్ని మోపింది. హ్యాకింగ్ ఉదంతంపై అంతర్గత ఆడిట్ చేస్తున్నామని, త్వరలో నిజాలను వెల్లడిస్తామని వివరించింది. పహల్గాం దాడితో తమ సంస్థకు సంబంధం లేదని స్పష్టం చేసింది.

పాక్ ఆర్మీ చీఫ్ నోట ద్విజాతి వ్యాఖ్య

ఇస్లామాబాద్, ఏప్రిల్ 26: పాకిస్థాన్ సైన్యాధిపతి జనరల్ అసీమ్ మునీర్ మరోసారి ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రస్తావించారు. హిందువులు, ముస్లింలు ఒకటి కాదని.. రెండు వేర్వేరు జాతులకు చెందిన వారని పేర్కొన్నారు. పాకిస్థాన్ ఏర్పాటు కోసం నాడు ఎంతోమంది అనేక త్యాగాలు చేశారని, దేశాన్ని రక్షించుకోవటం ఎలాగో సైన్యానికి తెలుసన్నారు. హిందూ ముస్లింలు వేర్వేరన్న సంగతిని, పాకిస్థాన్ ఆవిర్భావాన్ని భవిష్యత్ తరాలు మర్చిపోకుండా.. పిల్లలకు కథలు కథలుగా చెప్పాలని సూచించారు.

కశ్మీర్లో చురుగ్గా 14 మంది ఉగ్రవాదులు

శ్రీనగర్, ఏప్రిల్ 26: పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో అప్రమత్తమైన భద్రతాబలగాలు ఉగ్రవాదుల కోసం జల్లెడ పడుతున్నాయి. ఈ తరుణంలో జమ్మూకశ్మీర్‌లో ప్రస్తుతం 14 మంది ఉగ్రవాదులు చురుగ్గా ఉన్నారని నిఘావర్గాలు గుర్తించాయి. వీరంతా 20 నుంచి 40 ఏళ్లలోపువారే. వీరంతా పాకిస్థాన్ ఉగ్రవాదులకు స్థానిక కీలక సమాచారం ఇవ్వడంతో పాటు వారికి ఆశ్రయం కల్పించడం, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు.

నేను భారత్ కోడలిని.. ఇక్కడే ఉంటా!

» మోదీ, యోగికి సీమా హైదర్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: సీమా హైదర్ గుర్తుందా? పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌కు చెందిన ఈ వివాహిత, నోయిడాకు చెందిన సచిన్‌తో ప్రేమలో పడి.. తన నలుగురు చిన్నారులను వెంటబెట్టుకొని రెండేళ్ల క్రితం నేపాల్ మీదుగా భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించింది. అప్పట్లోనే సచిన్ మీనాను పెళ్లి చేసుకొని, అతడితో పాటే ఉంటోంది. పెహల్గామ్ ఘటన నేపథ్యంలో పాకిస్థాన్ జాతీయులు దేశం వీడి వెళ్లాలంటూ కేంద్రం హుకుం జారీ చేయడంతో సీమా హైదర్ ఆందోళనలో పడింది. తాను సచిన్ మీనాను పెళ్లి చేసుకున్నాక హిందూ మతం స్వీకరించానని.. ఇప్పుడు తాను హిందువునని అంటోంది. తాను పాక్ బిడ్డనే అయినా ఇప్పుడు భారత్ కోడలినంటోంది. తనను పాక్‌కు పంపించొద్దని ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగికి విజ్ఞప్తి చేసింది.

'ఆ నరకానికి మళ్లీ వెళ్లం'

» హిందూ శరణార్థుల వేడుకోలు

జైసల్మేర్, ఏప్రిల్ 26 : ఇక్కడ చావడానికైనా సిద్ధమే.. కానీ నరకం లాంటి పాకిస్థాన్‌కు మాత్రం మళ్లీ వెళ్లం, దయ చూపండి.. భారతదేశంలో శరణార్థులుగా ఆశ్రయం పొందిన పాకిస్థాన్ హిందువులు ప్రభుత్వానికి చేసుకుంటున్న వేడుకోలు ఇది. పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్థాన్ పౌరులంతా 27వ తేదీలోగా భారతదేశం వదిలి వెళ్లిపోవాలని భారత ప్రభుత్వం అల్టిమేటం జారీ చేసింది. ఈ నిర్ణయం వల్ల శరణార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పాకిస్థాన్‌లో వేధింపులు భరించలేక, ఉన్నదంతా అమ్ముకొని, అన్నీ వదులుకుని భారత్‌కు వచ్చామని, తిరిగి ఆ నరకానికి వెళ్లలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రంలోని ముల్సాగర్ అనే గ్రామంలో స్వల్పకాలిక వీసా కలిగిన పాక్ హిందువులు వెయ్యి మందికిపైగా ఉన్నారు. ప్రధాని మోదీ, భారత ప్రభుత్వం తమపై దయ చూపాలని వారంతా వేడుకుంటున్నారు.

ఆ జంట పెళ్లికి సరి'హద్దు' గీత!

జైపూర్, ఏప్రిల్ 26: వధువు మెడలో వరుడు ఇక తాళి కడతాడనగా.. 'ఆగండి.. ఈ పెళ్లి జరగడానికి వీల్లేదు' అంటూ శాసించే కంఠాన్ని ఎన్ని సినిమాల్లో వినలేదు!? అచ్చంగా ఇలానే.. భారత్-పాక్‌కు చెందిన వధూవరుల పెళ్లి వేడుకను పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన అనిశ్చితిలో పడేసింది. రాజస్థాన్‌లోని బర్మార్ జిల్లాకు చెందిన శైతాన్ సింగ్. పాకిస్థాన్‌లోని అమర్‌కోట్ యువతి కేసర్ కన్వర్ పెళ్లి ఈనెల 30న వధువు ఇంట జరగాల్సి ఉంది. మేళతాళాలతో వరుడు, ఆయన కుటుంబసభ్యులు గురువారం పాక్‌లో అడుగుపెట్టేందుకు బరాత్‌తో అటారీ సరిహద్దుకు వెళ్లారు. అంతకు ముందు రోజే కేంద్రం నుంచి ఆదేశాలు రావడంతో ఆ సరిహద్దును మూసివేశారు. వరుడి కుటుంబీకులు ప్రాధేయపడ్డా ఆవలివైపు వెళ్లేందుకు అధికారులు అనుమతివ్వలేదు.

పాక్.. డబుల్ గేమ్!

ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తూ.. తానే ఉగ్ర బాధిత దేశమని ప్రచారం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: ఉగ్రవాద ప్రభావిత భారత దేశం బాధలను పాకిస్థాన్ ఏనాడూ పట్టించుకోలేదు. ఉగ్రవాదులకు ఆశ్రయమిచ్చిన పాక్.. తానే ఉగ్రప్రభావిత దేశమని ప్రచారం చేసుకుని డబుల్ గేమ్ ఆడుతోందని భారత ఆర్మీ అధికారులు నిప్పులు చెరిగారు. దేశంలో జరిగిన ఉగ్రదాడులు, వాటిని ప్రేరేపించిన సంస్థల వివరాలు, ఉగ్రదాడుల సూత్రధారులు.. వంటి వివరాలను ఎప్పటికప్పుడు అందించి.. తగు చర్యలు తీసుకోవాలన్న భారత్ విజ్ఞప్తిని దాయాది దేశం బుట్టదాఖలు చేసింది. ముంబై బాంబు పేలుళ్ల(26/11), ఉరి, పఠాన్‌కోట్, పుల్వామా తదితర కీలక ప్రాంతాల్లో జరిగిన భారీ రక్తపాతంపై భారత్ 20కి పైగా లేఖలు రాసింది. వీటితోపాటు ఉగ్రమూకల డీఎన్ఏ నమూనాలను, ఇతర ఆధారాలను కూడా పాకిస్థాన్‌కు చేరవేసింది. పాక్ గడ్డపై నుంచే ఈ మారణహోమానికి బీజం పడిందని పేర్కొంది. వీటిని కట్టడి చేయడంతోపాటు, ఉగ్రమూకలను బోనెక్కించాలని కోరింది. కానీ.. ఏ ఒక్క విషయంలోనూ స్పందించకపోగా.. ఆయా ఆధారాలను, పత్రాలను పాక్ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. దీనికి సంబంధించి భారత్‌కు చెందిన కొందరు ఆర్మీ అధికారులు పలువివరాలు వెల్లడించారు. "26/11 ముంబై దాడుల తర్వాత.. మేం అధికారికంగా పలు పత్రాలను పాకిస్థాన్‌కు అందించాం. ఈ దాడుల సూత్రధారి లష్కరే తాయిబా, జమాత్ ఉద్ దవా చీఫ్, హఫీజ్ సయీద్ సహా పలువురి పాత్రను పేర్కొంటూ... ఆధారాలు సమర్పించారు. 2012, మార్చి 14-21 మధ్య పాక్ జ్యుడీషియల్ కమిషన్ స్వయంగా వచ్చి విచారించుకునే అవకాశం కల్పించాం. అప్పట్లో సాక్షుల వాంగ్మూలాలను వారు నమోదు చేశారు. అయినా.. ఇప్పటివరకు ఉగ్రమూకలపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు" అని ఓ అధికారి వివరించారు.

పఠాన్‌కోట్ దాడిపై..

అదేవిధంగా 2016, జనవరిలో జరిగిన పఠాన్‌కోట్ ఉగ్రదాడిపైనా తొలి లేఖను ఇచ్చినట్టు మరో అధికారి తెలిపారు. ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు స్వయంగా ఈ లేఖను పాకిస్థాన్‌కు 2016, మార్చి 2న భారత హైకమిషన్ ద్వారా పాక్‌కు చేరవేసిందని చెప్పారు. అంతేకాదు.. పాకిస్థాన్ సంయుక్త విచారణ బృందం స్వయంగా పఠాన్‌కోట్‌కు వచ్చి ఆధారాలు సేకరించేందుకు కూడా అవకాశం కల్పించిందన్నారు. ఈ క్రమంలో ఎన్ఐఏ అధికారులు 16 మంది సాక్షుల వాంగ్మూలాలను పాక్ బృందానికి అందించారని, ఈ దాడిలో పాల్గొన్న పాక్‌లోని పంజాబ్, సింధ్ ప్రాంతాలకు చెందిన నసీర్ హుస్సేన్, అబు బాకర్, ఉమర్ ఫరూక్, అబ్దుల్ ఖయూమ్‌ల డీఎన్ఏ శాంపిళ్లను కూడా అందించినట్టు తెలిపారు. అయినా.. ఇప్పటి వరకు దాయాది దేశం చర్యలు తీసుకోలేదన్నారు. 2016, సెప్టెంబరు 18న ఉరి క్యాంపుపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 17 మంది భారత సైనికులు వీర మరణం చెందారని.. దీనికి కూడా జైషే మహ్మద్‌కు చెందిన ఉగ్రవాదులే కారణమని అధికారి తెలిపారు.



యుద్ధం భయంతో జమ్మూలోని అర్నియా ప్రాంతంలో బంకర్లను శుభ్రం చేస్తున్న స్థానికులు

పుల్వామా దాడి తర్వాత

2019లో పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వీర మరణం చెందారని అధికారి వివరించారు. ఈ ఘటన ఇరు దేశాల మధ్య యుద్ధాన్ని ప్రేరేపించింది. ఈ క్రమంలో ఎన్ఐఏ అధికారులు ఉగ్రవాదుల పూర్తి వివరాలను పాక్‌కు అందించి.. వారిని తమకు అప్పగించాలని విన్నవించారని అధికారి తెలిపారు. వీరిలో అజర్, అస్గర్, ఇబ్రహీం అతర్, అమ్మార్ అల్వీలను తమకు అప్పగించాలని భారత్ కోరింది.

విద్యార్థుల బహిష్కరణపై వెనక్కి!

అమెరికాలోని విదేశీ విద్యార్థుల సెవిస్ రికార్డుల పునరుద్ధరణ ప్రారంభం



ముంబై, ఏప్రిల్ 26: అమెరికాలోని భారత్‌తో పాటు విదేశీ విద్యార్థులకు కొంత ఉపశమనం కలిగించే వార్త. ట్రంప్ ప్రభుత్వం అకస్మాత్తుగా, చట్టవిరుద్ధంగా చేపట్టిన వందలాది మంది విదేశీ విద్యార్థుల సెవిస్(స్టూడెంట్ అండ్ ఎక్స్‌చేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) రికార్డుల రద్దుపై వెనక్కు తగ్గింది. దేశవ్యాప్తంగా సెవిస్ రికార్డుల పునరుద్ధరణ గురువారం సాయంత్రం నుంచి ప్రారంభమైంది. కోర్టుల ఆదేశాల నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంది. రికార్డుల రద్దును సవాల్ చేస్తూ దావా వేసిన విద్యార్థులతో పాటు అమెరికావ్యాప్తంగా ఉన్న ఇతర విదేశీ విద్యార్థుల సెవిస్ రికార్డుల పునరుద్ధరణ జరుగుతోందని ఇమిగ్రేషన్ న్యాయవాదులు వెల్లడించారు. ఏప్రిల్ 4 తర్వాత యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో 23 మంది విద్యార్థుల సెవిస్ రికార్డులు రద్దు కాగా, వారిలో శనివారం 12 మంది స్టేటస్ తిరిగి యాక్టివ్ అయిందని 'కాలిఫోర్నియన్' పత్రిక పేర్కొంది. సెవిస్ ఒక వెబ్ ఆధారిత సమాచార వ్యవస్థ. విదేశీ విద్యార్థులు అమెరికాలో విద్యనభ్యసిస్తున్న సమయంలో వారిని ట్రాక్ చేసేందుకు, పర్యవేక్షించేందుకు అమెరికా ఏజెన్సీలు దీన్ని ఉపయోగిస్తాయి. అయితే అకస్మాత్తు సెవిస్ రద్దు ప్రక్రియ ఈ ఏడాది మార్చి మధ్యలో ప్రారంభమైంది. స్వీయ బహిష్కరణ ప్రమాదం ఎదుర్కొన్న చాలా మంది విద్యార్థులు.. ట్రంప్ ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా పలు జిల్లా కోర్టుల్లో దావాలు వేశారు. దీంతో కోర్టులు ప్రభుత్వ చర్యలపై తాత్కాలిక నిషేధ ఉత్తర్వులు ఇచ్చాయి. 1,500 మందికి పైగా విదేశీ విద్యార్థుల వీసాల రద్దుపై ట్రంప్ ప్రభుత్వం వెనక్కి తగ్గిందని న్యూయార్క్ టైమ్స్ నివేదించింది.

త్వరలోనే కొత్త పాలసీ

సెవిస్ రికార్డుల రద్దుకు సంబంధించి ట్రంప్ సర్కార్ త్వరలోనే కొత్త పాలసీ తీసుకురానున్నట్లు తెలుస్తోంది. సెవిస్ రికార్డుల టెర్మినేషన్ ఫ్రేమ్‌వర్క్‌కు సంబంధించి ఇమిగ్రేషన్ కస్టమ్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఒక పాలసీ రూపొందించే పనిలో ఉంది. 'ఆ పాలసీ అమల్లోకి వచ్చే వరకు సెవిస్ రికార్డులు యాక్టివ్‌లోనే ఉంటాయి. వాటిని పునరుద్ధరిస్తున్నాం.' అని ఇమిగ్రేషన్ న్యాయవాదులు తెలిపారు.

రాజకీయాల్లోకి.. కొత్త తరం రావాలి

భారత్ సదస్సు-2025లో రాహుల్‌గాంధీ

హైదరాబాద్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామిక రాజకీయాలు పూర్తిగా మారిపోయాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుత సమాజంలో ఉత్పన్నమవుతున్న కొత్త తరహా ఆలోచనలకు అనుగుణంగా ఇప్పటి రాజకీయాలు ఉండాలని, రాజకీయాల్లోకి కొత్త తరం రావాలని పిలుపునిచ్చారు. ప్రజలతో నేరుగా సంబంధాలు నెరపాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే ఇప్పుడు మనందరి ముందున్న పెద్ద సవాలు అని పేర్కొన్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన 2 రోజుల 'భారత్ సదస్సు-2025'లో ముగింపు రోజైన శనివారం విదేశీ ప్రతినిధులనుద్దేశించి రాహుల్ ప్రసంగించారు. ప్రస్తుత దుందుడుకు రాజకీయాల్లో ప్రతిపక్షాన్ని తొక్కేస్తున్నారని, తాము మాట్లాడకుండా అన్ని మార్గాలను మూసేస్తున్నారని బీజేపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వారిదంతా ప్రతిపక్షాలను తొక్కేసే విధానమన్నారు. ఆధునిక రాజకీయాల్లో ప్రేమ, సహనం అవసరమని, విద్వేష రాజకీయాలను ఎదుర్కోవాలంటే ప్రేమే మార్గమని అన్నారు. పగ, విద్వేషాలను ద్వేషంతో ఎదుర్కోవడం సరికాదని, ప్రేమతోనే వాటిని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వ్యతిరేక పార్టీలు తమ పట్ల కోపం, విద్వేషాన్ని ప్రదర్శిస్తున్నాయని తెలిపారు. కాగా, సోషల్ మీడియా, ఇతర కమ్యూనికేషన్ మాధ్యమాల కారణంగా ప్రజలు ఏం చెబుతున్నారో వినలేపోయామని రాహుల్ తెలిపారు.

అవిడి ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య సేవలు

» డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



అమరావతి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళా ఉపాధి హామీ శ్రామికులకు తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అవిడి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిది ఉపాధి శ్రామికులు గాయపడ్డారు. ఆ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన పవన్... పంచాయతీ రాజ్ కమిషనర్‌తో మాట్లాడారు. 'గాయపడిన వారికి అందిస్తున్న చికిత్సను పర్యవేక్షించే బాధ్యతలను ఒక అధికారికి అప్పగించండి. ఆర్థిక సహాయం అందించే చర్యలు చేపట్టండి' అని ఆదేశించారు.

తలసేమియా రన్‌కు రూ.30 లక్షల విరాళం



నారా భువనేశ్వరికి రూ.30 లక్షల చెక్ అందిస్తున్న కూనపురెడ్డి ఉమేశ్

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మే నెల 8వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించే 'తలసేమియా రన్'కు లాన్సమ్ ఎన్‌పాయింట్ డెవలపర్స్ ఎల్‌ఎల్‌పీ గ్రూపు తరఫున చైర్మన్ కూనపురెడ్డి ఉమేశ్ రూ.30 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ చెక్‌ను ఎన్‌టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె స్పందిస్తూ.. తలసేమియా రోగుల బాధలను అర్థం చేసుకొని సాయం చేయడానికి ముందుకు వచ్చిన ఉమేశ్‌ను అభినందించారు.

ఎక్కడా లేనివిధంగా 'వైసీపీ లిక్కర్ స్కాం': నిమ్మల

పాలకొల్లు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రాష్ట్రంలో జరిగిన లిక్కర్ స్కాం లాంటిది దేశంలో మరెక్కడా జరగలేదని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలంలో 'మన రైతు మన రామానాయుడు' కార్యక్రమంలో భాగంగా.. శనివారం ఆయన రూ.కోటితో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ డిస్టిలరీల్లో జరిగిన లిక్కర్ స్కాంతో పోలిస్తే జగన్ లిక్కర్ స్కాం ఎవరెస్టు శిఖరాన్ని తాకుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం గాలికి వదిలి లిక్కర్, సాండ్, మైన్స్, భూముల దోపిడీపైనే నాడు జగన్ దృష్టిపెట్టాడని విమర్శించారు. వైసీపీ నాయకుల పెరట్లో తయారు చేసిన నాసిరకం కల్తీ మద్యంతో లక్షలాది మంది అనారోగ్యం పాలయ్యారని, వందలాది మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు 9నెలల పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారని, ప్రజా సంక్షేమమే పరమావధిగా సాగుతున్నారని రామానాయుడు చెప్పారు.

బనకచర్ల కోసం పోలవరాన్ని బలిపెడతారా?

» పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆగ్రహం

అమరావతి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పోలవరం- బనకచర్ల రెగ్యులేటర్ పథకం కోసం పోలవరం ప్రాజెక్టును చంపుతారా అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారంలో ఆదా పేరుతో ఏకంగా ప్రాజెక్టును బలి పెడతారా అని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. పోలవరం గరిష్ఠ సామర్థ్యం 194 టీఎంసీల నుంచి 114 టీఎంసీలకు కుదించారని మండిపడ్డారు. శనివారం విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో పోలవరం నిర్వాసితుల అభిప్రాయలను షర్మిల సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలవరాన్ని కూటమి ప్రభుత్వం పక్కన పెట్టి గోదావరి-బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌ను ముందుకు తెస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే నిర్వాసితులకు సహాయ, పునరావాసాన్ని అందించాలని ఆమె డిమాండ్ చేశారు.

వివేకా కేసులో సాక్షుల మరణాలపై విచారణ వేగవంతం

కడప, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):వివేకా హత్య కేసులో సాక్షులుగా ఉన్న వారు ఒక్కొక్కరుగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై సిట్ విచారణ చేపట్టింది. వివేకా హత్య కేసులో మొత్తం ఆరుగురు సాక్షులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇటీవల కీలక సాక్షి అయిన రంగన్న మృతితో ఈ కేసును ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని సిట్‌ను ఏర్పాటు చేసింది. వరుసగా సాక్షులు మృతి చెందడంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. వివేకా ఇంటి వాచ్‌మేన్ రంగన్న చనిపోవడానికి ముందు కె.శ్రీనివాసరెడ్డి 2019, సెప్టెంబరు 3న, వైఎస్ జగన్ వాహన డ్రైవరు నారాయణ యాదవ్ 2019 డిసెంబరు 6న, వైఎస్ భారతి తండ్రి డాక్టర్ ఈసీ గంగిరెడ్డి 2020 అక్టోబరు 3న, గంగాధర్‌రెడ్డి 2022 జూలైలో, డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి 2025 జనవరి 10న మరణించారు. దీంతో కొంతకాలంగా పులివెందులలో సిట్ అధికారులు విచారిస్తున్నారు. పట్టణంలో నివాసం ఉంటున్న కె.శ్రీనివాసరెడ్డి బామ్మర్ది కసునూరు పరమేశ్వర్‌రెడ్డి ఇంటికి శనివారం సిట్ బృందం వెళ్లి ప్రత్యేక వాహనంలో విచారణ కోసం లింగాల పోలీసుస్టేషన్ తీసుకువెళ్లింది. అక్కడ సుదీర్ఘంగా విచారించి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అలాగే ఈ కేసులో మరో కీలక సాక్షి మృతుడు రంగన్న భార్య సుశీలమ్మను విచారణకు రావాల్సిందిగా సిట్ అధికారులు నోటీసు ఇచ్చారు. రంగన్న పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా ఈ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకోనున్నట్లు సమాచారం.

యూటీఎఫ్ వ్యవస్థాపకుడు రావెళ్ల ఇకలేరు



ఖమ్మం ఖానాపురం హవేలీ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) వ్యవస్థాపకుడు రావెళ్ల రాఘవయ్య(91) కన్నుమూశారు. అనారోగ్యంతో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని శుక్రవారం రాత్రి ఖమ్మం శ్రీనివాసనగర్‌లోని నివాసానికి తీసుకొచ్చారు. రావెళ్ల మరణం యూటీఎఫ్ సంఘానికి ప్రజాతంత్ర ఉద్యమాలకు తీవ్ర లోటు అని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తంచేసింది.. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది.

జీఎస్‌ఎల్వీ-ఎఫ్16 ప్రయోగానికి సన్నాహాలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వరుస ప్రయోగాలకు సన్నాహాలు చేస్తోంది. దీనికి సంబంధించిన పనులు తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తొలుత మే నెలాఖరులో జీఎస్‌ఎల్వీ-ఎఫ్16 ప్రయోగం చేపట్టనున్నారు. ఈ రాకెట్ ద్వారా నిసార్ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్నారు. ఈ రాకెట్‌కు సంబంధించిన రెండో దశ (జీఎస్2)ను తమిళనాడులోని మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ (ఐపీఆర్‌సీ) నుంచి షార్‌లోని లాంచ్ కాంప్లెక్స్‌కు తరలించే వాహనానికి ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ 24న జెండా ఊపినట్లు ఇస్రో శనివారం ప్రకటించింది. షార్ రెండో ప్రయోగ వేదిక సమీపంలోని వెహికల్ అసెంబ్లీ బిల్డింగ్ (వ్యాబ్)లో ఈ నెల మొదటి వారంలో రాకెట్ మొదటి దశ అనుసంధాన పనులు ప్రారంభించారు. సోమవారం నుంచి రెండో దశ పనులు చేపడతారు. ఈ ప్రయోగం పూర్తయిన వెంటనే పీఎస్‌ఎల్వీ-సీ61 రాకెట్ ద్వారా ఈవోఎస్-09 ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. అనంతరం ఎల్‌వీఎం3-ఎం5, టీవీ-డీ2 ప్రయోగాలు చేపట్టనున్నారు.

సెమీ క్రయోజెనిక్ పరీక్ష విజయవంతం

ఇస్రో భవిష్యత్తులో ప్రయోగించే వాహనాల్లో వినియోగించనున్న సెమీ క్రయోజెనిక్ ఇంజన్ హాట్ టెస్ట్‌ను విజయవంతంగా పరీక్షించింది. తమిళనాడులోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో సెమీ-క్రయోజెనిక్ రెండో ఇంటిగ్రేటెడ్ పరీక్షను విజయవంతంగా నిర్వహించినట్లు ఇస్రో ప్రకటించింది. భవిష్యత్‌లో ప్రయోగించే వాహనాల కోసం లిక్విడ్ ఆక్సిజన్ (ఎల్‌వోఎక్స్), కిరోసిన్ ప్రొపెల్లెంట్‌ల కలయికతో పనిచేసే 2వేల కేఎన్ థ్రస్ట్ ఇంజన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. మార్చి 28న నిర్వహించిన మొదటి హాట్‌టెస్ట్ విజయవంతమైన తర్వాత చేపట్టిన ఈ ఇగ్నిషన్ టెస్ట్ జెమీ-క్రయోజెనిక్ ఇంజన్ టెస్ట్ భావి పరీక్షలకు ఇది ఒక మైలురాయిగా ఇస్రో పేర్కొంది.



బుడగట్లపాలెంలో మత్స్యకారులకు భృతి చెక్కును అందజేస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

2014-19లో మత్స్యకారుల కోసం రూ.725 కోట్లు ఇచ్చాం. ఇప్పుడు ఏడాదికి రూ.259 కోట్లు ఇస్తున్నాం. మీ పిల్లలను బాగా చదివించే బాధ్యత తీసుకుంటాం. ఆరు రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేశాం. రాష్ట్రంలో 69 వేలమంది మత్స్యకారులు పింఛన్లు పొందుతున్నారు. లీటర్ డీజిల్‌కు రూ.9 రాయితీ ఇస్తున్నాం. రాష్ట్రంలో 23,062 బోట్లకు ఏడాదికి రూ.50 కోట్లు ఇస్తున్నాం. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌ను ఏడాదిలో పూర్తి చేసి అందజేస్తాం.

- శ్రీకాకుళం జిల్లా బుడగట్లపాలెంలో 'మత్స్యకారుల సేవలో' ప్రారంభం సందర్భంగా సీఎం చంద్రబాబు

మీకోసం నేనున్నా

(మొదటి పేజీ తరువాయి)

మత్స్యకార లబ్ధిదారుల ఖాతాల్లో రూ.259 కోట్లను జమ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. మత్స్యకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. 'సముద్రంతో పాటుగా వంశధార, నాగావళి నదులు, గనులు, బంగారం పండే భూములు ఉన్నాయి. ఇక్కడ నిరంతరం నీళ్లు వస్తాయి. శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేసేంత వరకు ఇక్కడికి వస్తూనే ఉంటాను. సమాజంలో అట్టడుగున ఉండే వర్గాల్లో మత్స్యకారులు ఒకరు. సముద్రాన్నే నమ్ముకున్నారు. సముద్రంలో వేటకు వెళ్తేనే మీ కడుపు నిండుతుంది. సముద్రంలో చేపల అభివృద్ధి కోసం రెండు మాసాల పాటు వేట నిషేధం అమల్లో ఉంది. 2014-2015లో వేట విరామ సమయంలో ఆర్థిక సహకారం అందించింది మేమే. ఆ తర్వాత వైసీపీ వచ్చి రూ.10 వేలు ఇచ్చింది. ఫిష్ ఆంధ్ర అన్నారు. రూ.300 కోట్లు ఖర్చు పెడతామని చెప్పి, ఏ ఒక్కరినీ బాగు చేయలేదు. వైసీపీ హయాంలో ఐదేళ్లు అభివృద్ధి ఆగిపోయింది. పరిశ్రమలు పారిపోయాయి. సంక్షేమం నిలిచిపోయింది. ప్రజల సంపద ఆగిపోయింది. టీడీపీ ప్రభుత్వ ముంటే అదనంగా ఏడు లక్షల కోట్ల సంపద పెరిగేది. ప్రతి ఇంటికి అదనంగా రూ.50 వేల నుంచి రూ.70 వేలు పెరిగేది. ప్రభుత్వం బాధ్యతగా ఉండాలి. ప్రజల ఆదాయం పెంచాలి. జీవన ప్రమాణాలు మెరుగుపరచాలి. 2029 నాటికి జీరో పావర్టీ అనేదే లక్ష్యం' అని చంద్రబాబు అన్నారు.

నాడు ఎర్రన్న.. నేడు తనయుడు

'2014-19లో భోగాపురం ఎయిర్‌పోర్టుకు నేనే శ్రీకారం చుట్టాను. ఆ తర్వాత అధికారంలో నేనుంటే పూర్తయ్యేది. వైసీపీ వాళ్లు వచ్చాక మార్పు చేశారు. ఇప్పుడు నేను పూర్తి చేస్తాను. ఒకప్పుడు కింజరాపు ఎర్రన్నాయుడు కేంద్రమంత్రిగా ఉండి ఉద్దానానికి నీటిని తీసుకువచ్చారు. ఇప్పుడు ఎర్రన్న తనయుడు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తికానుంది. కేబినెట్ మంత్రిగా రామ్మోహన్‌నాయుడుకు అవకాశం ఇచ్చాను. నేను ఢిల్లీకి వెళ్తే.. ఆయన ఎంతో బాగా పనిచేస్తున్నారని అక్కడ చాలామంది కొనియాడుతున్నారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి చెందకపోతే రామ్మోహన్‌నాయుడి 'డిగ్రీ' వాపస్ ఇవ్వాల్సిందేనని హెచ్చరించా(నవ్వుతూ). ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఇటీవలే మంచి డ్రామా ప్రదర్శించారు. ఆయనలో ఇంత టాలెంట్ ఉందా అని ఆశ్చర్యంగా ఉంది. చాలా సమస్యలను పూస గుచ్చినట్లుగా చెప్పగలిగారు. ఇటువంటి టీమ్ ఉన్నప్పుడు జిల్లా ఎందుకు అభివృద్ధి కాలేదని ప్రశ్నిస్తున్నా. మనమందరం అనుకుంటే ఏదైనా సాధ్యం' అని చంద్రబాబు అన్నారు.

మత్స్యకారులకు మంచి భవిష్యత్తు

'స్థానిక మత్స్యకార ఆడబిడ్డలను అడుగుతున్నా.. జీవితాంతం తరతరాల వారసత్వం మాదిరిగా పేదరికంలోనే బతకాలా? ప్రస్తుతం అనేక అవకాశాలు ఉన్నాయి. వాటిని వినియోగించుకుని ముందుకు వెళ్లాలి. రాష్ట్రంలో 550 మత్స్యకారుల గ్రామాల దశ దిశ మార్చాలి. దేశంలో 25 శాతం రాష్ట్రం నుంచే చేపలు ఉత్పత్తి జరుగుతోంది. 32 శాతం ఎగుమతి అవుతోంది. దీనివల్ల 16 లక్షలా 52 వేల మందికి ఉపాధి లభిస్తోంది. మత్స్యకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుంది. ఒకప్పుడు వరి ధాన్యం తినేవాళ్లం. ఇప్పుడు ఆరోగ్యంగా ఉండాలంటే చేపలు తప్ప వేరే మార్గం లేదు. మనుషుల్లో తెలివితేటలు పెరగాలన్నా, మైండ్ బాగా పెరగాలన్నా చేపలు తినాలి. గుండెపోటు, బీపీ, షుగర్ రావు' అని అన్నారు.

పీ4తో సమాజం మార్పు

'మార్గదర్శకులు, బంగారు కుటుంబాలు అనే కాన్సెప్ట్‌తో పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. సమాజం నుంచి బాగుపడినవారు మళ్లీ సమాజానికి కొంత ఇచ్చేయాలి. వారి ద్వారా పేదల జీవన ప్రమాణాలు మరింత మెరుగవ్వాలి. రాష్ట్రంలో 10 లక్షల మంది ఉన్నత స్థాయిలో ఉన్నారు. వీళ్లు 20, 30 లక్షల పేద కుటుంబాలను దత్తత తీసుకుని బాగుచేసి, వారి జీవితాల్లో మార్పులు తీసుకురావాలన్నది నా లక్ష్యం. అట్టడుగున ఉన్నవారిని పైకి తీసుకురావాలి. ఇదే మార్గదర్శి-బంగారు కుటుంబం లక్ష్యం. ఏదో మొక్కుబడిగా కాకుండా నేను నిరంతరం ఆన్‌లైన్‌లో పరిశీలిస్తాను. ఇటు సూపర్ సిక్స్ పథకాలు కూడా ప్రజలకు అందజేస్తాం. ఇప్పటికే 200 అన్న క్యాంటీన్లు పెట్టాం. పేదలకు పింఛన్లు ఇస్తున్నాం. దీపం 2 కింద మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. మత్స్యకారులకు రూ.20 వేల చొప్పున అకౌంట్‌లో వేశాం. కేంద్ర ప్రభుత్వంతో కలసి అన్నదాతలకు మూడు విడతల్లో రూ.20 వేలు ఇస్తాం. జూన్ నుంచి తల్లికి వందనం పథకం అమలు చేస్తాం. గత ఐదేళ్లు ఒక డీఎస్సీ కూడా నిర్వహించలేదు. ఒక టీచర్ పోస్టును కూడా నియమించలేదు. 17 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి, జూన్‌లో స్కూళ్లను తెరిచేందుకు చర్యలు తీసుకున్నాం' అని చంద్రబాబు వివరించారు.

ఇక్కడే ఉద్యోగావకాశాలు

'స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలోనే ఉద్యోగావకాశాలు లభించేలా చర్యలు తీసుకుంటాం. ఆనాడు ఎన్టీఆర్ రూ.30 పింఛన్ ఇవ్వగా.. నేను రూ.75 చేశాను. ఆ తర్వాత రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2 వేలు చేశాం. కిడ్నీ రోగులకు, పేదలకు పింఛన్ ఇస్తున్నాం. ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు పరిహారం కింద రూ.10 లక్షలు ఇస్తున్నాం. ఒకప్పుడు సెల్‌ఫోన్ ఉండేది కాదు. 1995-2000లో సెల్‌ఫోన్‌ను నేనే ప్రమోట్ చేశాను. ఇప్పుడు సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారింది. వాట్సాప్ గవర్నెన్స్‌లో వెయ్యి సర్వీసులు అమలు చేస్తున్నాం. 270 సర్వీసులు ఇప్పుడు ఇస్తున్నాం. మిగిలినవి కూడా అమల్లోకి తెస్తాం' అని అన్నారు. మొదట సీఎం చంద్రబాబు బుడగట్లపాలెంలో అమరావతి ఆలయాన్ని సందర్శించారు.

పశుసంపదను అభివృద్ధి చేద్దాం!

» పశు సంరక్షణకు అంకితమైన అందరికీ శుభాకాంక్షలు: చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): 'పశు ఆరోగ్యం ఒక బృందం' అనే స్ఫూర్తితో మన పశు సంపదను అభివృద్ధి చేద్దామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. శనివారం ప్రపంచ పశువుల వైద్య దినోత్సవం సందర్భంగా సీఎం సందేశం ఇచ్చారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాన్ని చేరుకోవడానికి మానవాళికి అవసరమైన ముఖ్య ఆహార పదార్థాల్లో పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తుల్లో మన రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచడానికి కృషి చేస్తున్నామన్నారు. పాడి ఉత్పత్తుల ప్రాముఖ్యతను, వాటి నాణ్యతను పెంచడానికి అమలు చేయగల ఆధునిక సాంకేతికతలను గుర్తించాలని చంద్రబాబు కోరారు.

200 కిలోల చేపలు పట్టేలా చేస్తా..

» మత్స్యకారులతో సీఎం చంద్రబాబు మాటామంతీ

శ్రీకాకుళం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకాకుళం జిల్లా బుడగట్లపాలెంలో మత్స్యకారులను కలుసుకున్నారు. వాళ్ల భుజాలపై చేతులు వేసి, వారితో కలసి హుషారుగా అడుగులు వేశారు. కష్టాలను, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. బుడగట్లపాలెంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌లో దిగగానే ముందుగా 'అమరావతి' ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం సముద్ర తీరం వద్ద మత్స్యకారులను పలకరించారు. జడ్ ప్లస్ భద్రతను, అధికారులు, ప్రజాప్రతినిధులను దూరంగా ఉంచేసి తాను మాత్రమే మత్స్యకారుల వద్దకు వెళ్లి మాట్లాడారు.

సీఎం: మీ పేర్లేంటి?

మత్స్యకారులు: నాపేరు పోలీసు. ఈమె నా భార్య. మాకు ముగ్గురు పిల్లలు. చదువుకుంటున్నారు.

సీఎం: నువ్వేం చదువుకున్నావు? సమాచార వ్యవస్థ పెరిగిన తర్వాత చేపల వేటలో ప్రమాదాలు తగ్గాయా?

పోలీసు : నేనేం చదువుకోలేదు. నా భార్య ఏడో తరగతి చదువుకుంది. ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. హార్బర్ పూర్తయితే మాకు ఇక్కడే ఉపాధి లభిస్తుంది.

సీఎం: రోజుకు ఎన్ని చేపలు పడతారు?

మత్స్యకారులు: చెప్పలేం సార్. అదృష్టం ఉంటే ఎక్కువ చేపలు పడతాయి. తరచూ వలలు చిరిగిపోతుంటాయి. మార్కెట్ పెద్దగా ఉండదు. అందుకే ఇతర జిల్లాలవారి నుంచి రేటు ఎంతుంటుందో తెలుసుకుని వారికి చేపలను విక్రయిస్తుంటాం. బోట్లు ఇచ్చినవారికి, మదుపులు పెట్టిన వ్యాపారికి సగం వాటా పోతుంది. మిగిలిందే మాది.

సీఎం: ఇక్కడే హార్బర్, ఐస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే ఫలితముంటుందా?

మత్స్యకారులు: హార్బర్ పెడితే ఎక్కడెక్కడివారైనా సరే ఇక్కడకే వచ్చేస్తారు. ఐస్ లేకపోవడం వల్ల ఎక్కడికో వెళ్లాల్సివస్తోంది. అన్నీ ఉంటే నూరు శాతం లాభం ఉంటుంది సార్. వలస పోనక్కర్లేదు. ఇక్కడే చేపలు వేటకు వెళ్లొచ్చు.

సీఎం: ఇంకా సమస్యలేంటి?

మత్స్యకారులు: సుమారు 600 ఇళ్లు ఉన్నాయి. వేటకు వెళ్లినవారిలో కొంతమంది మరణిస్తున్నారు. గ్రామంలో తాగునీటికి సమస్య ఉంది. అలల ధాటికి బోట్లు మరమ్మతులకు గురవుతుంటాయి. అన్నీ సమస్యలే.. పిల్లలను చదివించలేకపోతున్నాం. ఇళ్లు పాడయ్యాయి. ఇళ్లు మంజూరు చేస్తే బాగుంటుంది సార్. రాయితీపై వలలు కావాలి సర్.

సీఎం: అందరికీ ఇళ్లు మంజూరు చేయిస్తా. వలలు 80 శాతం రాయితీపై ఇప్పిస్తా. హార్బర్ పని పూర్తిచేయిస్తా. జూన్ నుంచి మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే వాళ్లందరికీ 'అమ్మకు వందనం' అందిస్తాం.

మత్స్యకారులు : పడవలు, వలల మరమ్మతులకే రూ.2లక్షల వరకు ఖర్చవుతుంది. ఒకదఫా వేటకు వెళ్తే వల చిరిగిపోతుంది. దాన్ని కుట్టుకుంటాం. రెండో వలను అదనంగా తీసుకువెళ్లాలంటే కుదరదు సార్. మా సమస్యలు పరిష్కరించండి సార్.

సీఎం: మీ అందరి ఆదాయం పెంచేవిధంగా చర్యలు తీసుకుంటాను. టెక్నాలజీ ఉపయోగించి, వంద కిలోల చేపలు పట్టేవారికి 200 కిలోలు ఎలా పట్టుకోవాలో దారి చూపిస్తా. మరోమారు వస్తాను.

వైద్య ఖర్చులు తగ్గించాలి

» ప్రజల జీవితాల్లో అదే పెద్ద గేమ్ చేంజర్

» వైద్య రంగానికి టెక్నాలజీ జోడిస్తే విప్లవాత్మక మార్పులు

» అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ

» విశాఖ ఆంధ్ర వైద్య కళాశాల దాతృత్వానికి స్ఫూర్తి: చంద్రబాబు

» పూర్వ విద్యార్థులు 50 కోట్లతో నిర్మించిన సెంటినరీ భవనం ప్రారంభం



ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు విరాళాలతో నిర్మించిన సెంటినరీ భవనాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, కార్యక్రమ నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రవిరాజు తదితరులు

విశాఖపట్నం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రులకు చికిత్స కోసం వచ్చే వారికి వైద్య ఖర్చులు తగ్గించగలిగితే ప్రజల జీవితాల్లో పెద్ద గేమ్ చేంజర్ అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శనివారం విశాఖ ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు రూ.50 కోట్ల విరాళాలతో నిర్మించిన సెంటినరీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. సాంకేతికపరంగా అందివచ్చిన నైపుణ్యంతో నూతన ఆవిష్కరణలు చేస్తున్నామని, దీనికి ఆంధ్ర వైద్య కళాశాల పూర్తిగా సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆరోగ్యం, ఇతర వివరాలతో కూడిన డేటా, రియల్ టైమ్ డేటా ఉన్నాయని, వాటిని ఏఐ టూల్‌తో అనుసంధానం చేయడం ద్వారా సమగ్ర డేటా తయారు చేస్తున్నామని వెల్లడించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్‌ను అమరావతిలో నెలకొల్పుతున్నట్లు చెప్పారు. వచ్చే పదేళ్లలో వచ్చే మార్పులను ఇప్పుడే అంచనా వేసి, అందుకు తగినట్టుగా ఆవిష్కరణలు చేయాలన్నారు. అన్నిరంగాల మాదిరిగా వైద్యరంగంలో అనేక మార్పులు వస్తున్నాయని సీఎం అన్నారు. వైద్య విద్యార్థులు టెక్నాలజీ కోర్సులు చేస్తే వృత్తిపరంగా రాణిస్తారని సూచించారు. అల్ట్రా సెన్సార్ సాయంతో ప్రతిరోజు తాను ఆహారం తీసుకుంటున్నానని, రోజూ తినే ఆహారాన్ని మెడిసిన్‌గా.. వంటిల్లును ఫార్మసీగా పరిగణించాలని అన్నారు. ఆరోగ్యం మనచేతిలోనే ఉందన్నారు.

జన్మభూమి స్ఫూర్తితో..

జన్మభూమి కార్యక్రమం స్ఫూర్తితో ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు రూ.50 కోట్ల భారీ విరాళాలు సేకరించి అన్ని సదుపాయాలు, విజ్ఞానం అందించే భవనం నిర్మాణం చేపట్టారని అభినందించారు. దేశంలో 100 ఏళ్లు పైబడిన ఏడు కళాశాలల్లో ఇది ఒకటి కావడం గర్వకారణమన్నారు. గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు రూ.100 కోట్ల విరాళాలతో అక్కడ భవనాలు నిర్మిస్తున్నారని, కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు రూ.40 కోట్లు సేకరించి భవనాలు నిర్మిస్తున్నారని అన్నారు. ఇంకా కర్నూలు, విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలల పూర్వ విద్యార్థులు తమ సంస్థలకు విరాళాలు సమీకరించారని, వారందరికీ ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థులే స్ఫూర్తిగా నిలిచారని అభినందించారు.

బ్రెయిన్ గెయిన్‌గా...

1995లో టెక్నాలజీ గురించి తాను మాట్లాడితే అందరూ వింతగా చూశారని చంద్రబాబు అన్నారు. ఆ తరువాత ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ ఎంతగానో అభివృద్ధి చెందిందని, ఐటీ రంగంలో ఇప్పుడు ఎక్కువ తలసరి ఆదాయం తెస్తున్నది భారతీయులైతే, వారిలో 33 శాతం తెలుగువారేనని అన్నారు. సమాజంలో వైద్యులు, పోలీసులు ఎక్కువగా కష్టపడతారన్నారు. గతంలో ఏపీ నుంచి అనేక మంది వైద్యులు విదేశాలకు వలస వెళ్లేవారని అప్పట్లో దానిని బ్రెయిన్ డ్రెయిన్ అనేవారని, చాలాకాలం తరువాత అది బ్రెయిన్ గెయిన్‌గా మారిందని, అందుకు అపోలో ప్రతాప్‌రెడ్డి ఉదాహరణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, సత్యకుమార్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎంపీ శ్రీభరత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి భారత్!

» పదేళ్లలో 17 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు

» పట్టణ, గ్రామాల మధ్య తగ్గుతున్న అంతరం..వరల్డ్ బ్యాంక్ వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: దేశంలో గత పదేళ్ల కాలంలో 17.10 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడినట్టు ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. 2011-12లో 16.2 శాతం ప్రజలు దుర్భర పేదరికం(రోజుకు 2.15 డాలర్ల కంటే తక్కువ ఆదాయం)తో మగ్గగా, 2022-23 నాటికి ఆ సంఖ్య 2.3 శాతానికి తగ్గినట్టు ఇటీవల ఓ నివేదిక విడుదల చేసింది. దుర్భర పేదరికంతో బాధపడుతున్నవారు పదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో 18.4 శాతం నుంచి 2.8 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 10.7 శాతం నుంచి 1.1 శాతానికి తగ్గారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరం 7.7 నుంచి 1.7 శాతానికి తగ్గింది. పేదలు క్రమేణా దిగువ-మధ్య-ఆదాయ కేటగిరిలోకి మారుతున్నారు. అలాగే దిగువ-మధ్య-ఆదాయ కేటగిరిలో ఉన్నవారు మధ్య తరగతి ఆదాయ కేటగిరిలోకి వెళ్తున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం 69 శాతం నుంచి 32.5 శాతానికి, పట్టణాల్లో 43.5 శాతం నుంచి 17.2 శాతానికి తగ్గింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అంతరం 25 నుంచి 15 శాతానికి తగ్గింది. ఉపాధి, ఉద్యోగ కల్పనలో భారత్ పురోగతి సాధిస్తోంది.

సమస్యల సుడిలో కమిషన్లు

» జాతీయ ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ కమిషన్లను వేధిస్తున్న సిబ్బంది కొరత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: విస్తృతమైన సామాజిక అంశాలపై పనిచేస్తున్న జాతీయ కమిషన్లను నిధుల కొరత, సిబ్బంది లేమి సమస్యలు వేధిస్తున్నాయి. దీంతో వార్షిక నివేదికలను ఈ కమిషన్లు సకాలంలో సిద్ధం చేయలేకపోతున్నాయి. వార్షిక నివేదిక తయారీలో జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషన్లు రెండేళ్లు వెనుకబడి ఉంటే, ఓబీసీ కమిషన్ మూడేళ్లు వెనుక ఉంది. సాధారణంగా ఏటా కమిషన్లు తమ నివేదికలను రాష్ట్రపతికి సమర్పించాలి. సామాజిక సముదాయాలకు అండగా తాము నివేదికల్లో చేసిన సిఫారసుల అమలు తీరును ఎప్పటికప్పుడు కమిషన్లు సమీక్షించాలి. సామాజిక వర్గాలకు రక్షణ, సంక్షేమం, సామాజికార్థిక అభ్యున్నతి కోసం అవసరమైతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా కమిషన్లు అవసరమైన సిఫారసులు చేస్తాయి. గతంలో ప్రభుత్వాలు రిజర్వేషన్లు, క్రీమీలేయర్ వంటి అంశాలపై విధాన నిర్ణయాల రూపకల్పనలో కమిషన్ల సిఫారసులను పరిగణనలోకి తీసుకొనేవి. కమిషన్లు ఇచ్చిన నివేదికల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ నివేదికలను తయారుచేసి పార్లమెంటుకు సమర్పించేవి. అయితే, నివేదిక తయారీలో విపరీత జాప్యం, ఒక్కొక్క దాని తయారీకి 2-3 ఏళ్లు పడుతుండటంతో కమిషన్ ఏర్పాటు లక్ష్యమే ప్రశ్నార్థకంగా మారింది.

పోప్ ఫ్రాన్సిస్‌కు కన్నీటి వీడ్కోలు

» ముగిసిన అంత్యక్రియలు.. హాజరైన రాష్ట్రపతి ముర్ము



పోప్ ఫ్రాన్సిస్ అంతిమయాత్రలో ప్రముఖులు

వాటికన్ సిటీ, ఏప్రిల్ 26: సోమవారం కన్నుమూసిన పోప్ ఫ్రాన్సిస్ (88) అంత్యక్రియలు రోమ్‌లోని సెయింట్ మేరీ మేజర్ బసిలికాలో శనివారం ముగిశాయి. దాదాపు వంద సంవత్సరాల తర్వాత మొదటిసారిగా ఓ పోప్ అంత్యక్రియలను వాటికన్ సిటీ అవల నిర్వహించారు. పోప్‌కు ఇష్టమైన రోమ్‌లోని సెయింట్ మేరీ మేజర్ బసిలికాలో ఆయన పార్థివ దేహాన్ని ఖననం చేసినట్లు వాటికన్ వర్గాలు వెల్లడించాయి. కాగా, అంత్యక్రియల కార్యక్రమాన్ని ప్రైవేటుగా నిర్వహించారు. కేవలం ఉన్నత స్థాయి కార్డినల్స్, పోప్ సన్నిహితులు మాత్రమే దీనికి హాజరయ్యారు. రాష్ట్రపతి ముర్ము సహా 50 దేశాల అధినేతలు, ప్రముఖుల ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు.

పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు కేసుల సమాచారం ఇవ్వాల్సిందే: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమపై ఉన్న పెండింగ్ కేసుల వివరాలను వెల్లడించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. లేకుంటే ఎన్నికను రద్దు చేయవచ్చని తెలిపింది. కేసుల వివరాలు వెల్లడించకుంటే అది తప్పుడు అఫిడవిట్ కిందకు వస్తుందని, దాన్ని ఆధారంగా ఎన్నికను కొట్టివేయవచ్చని పేర్కొంది. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఓ గ్రామ ప్రధాన్ ఎన్నిక రద్దుకు సంబంధించిన ఓ కేసులో ఈ మేరకు స్పష్టం చేసింది.

ఫిట్‌జీలో నిధుల దారి మళ్లింపు: ఈడీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పోటీ పరీక్షల కోసం విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ప్రముఖ కోచింగ్ సంస్థ 'ఫిట్‌జీ'.. ఒక క్రమ పద్ధతిలో రూ.200 కోట్లపై చిలుకు నిధులను దారి మళ్లించిందని ఈడీ ఆరోపించింది. '2025-26 నుంచి 2028-29 వరకూ నాలుగు విద్యాసంవత్సరాలకు కోచింగ్ అందిస్తామని దేశవ్యాప్తంగా 14,411 మంది విద్యార్థుల నుంచి సుమారు రూ.250.2 కోట్ల ఫీజులు వసూలు చేసింది. కానీ, వారికి శిక్షణ అందించలేదు' అని దర్యాప్తులో తేలిందని ఈడీ తెలిపింది.

హజ్ వీసా ఉంటేనే మక్కాలోకి అనుమతి

రియాద్, ఏప్రిల్ 26: ఈ ఏడాది హజ్ యాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో మక్కా నగరంలోకి విదేశీయుల ప్రవేశంపై సౌదీ అరేబియా ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. ఈ నెల 23 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనల మేరకు హజ్ పర్మిట్ లేకుండా ఏ ఒక్క విదేశీయుడినీ మక్కా నగరంలోకి అనుమతించబోమని సౌదీ అధికారులు తెలిపారు. ఈ నిబంధనలను అతిక్రమించి వచ్చే విదేశీయులు భారీ జరిమానా, జైలుశిక్ష, దేశ బహిష్కరణను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నెల 29 నుంచి హజ్ వీసా ఉన్నవారిని మాత్రమే మక్కా నగరంలోకి అనుమతిస్తామని తెలిపారు.

జూన్‌లో మానస సరోవర యాత్ర

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: హిందువులు, బౌద్ధులు, జైనులు పవిత్రంగా భావించే కైలాస మానస సరోవర యాత్రను జూన్‌లో నిర్వహించాలని భారత్, చైనా నిర్ణయించాయి. అయిదేళ్ల విరామం అనంతరం ఈ యాత్ర మళ్లీ జరగనుంది. తొలుత కరోనా కారణంగా 2020లో ఈ యాత్రను రద్దు చేయగా, అనంతరం తూర్పు లద్దాఖ్‌లో చైనాతో నెలకొన్న సరిహద్దు వివాదం కారణంగా నిలిపివేశారు. రెండు దేశాల మధ్య దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించేందుకు ఈ యాత్ర నిర్వహణపై దృష్టి పెట్టారు. జూన్ నుంచి ఆగస్టు వరకు యాత్ర జరుగుతుందని విదేశీ వ్యవహారాల శాఖ ప్రకటించింది. ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్, సిక్కింలోని నాథులాపాస్ మార్గాల్లో యాత్ర సాగుతుందని పేర్కొంది. దరఖాస్తులను kmy.gov.in వెబ్‌సైట్ ద్వారా పంపించాల్సి ఉంటుంది. కంప్యూటర్ ద్వారా యాత్రికుల ఎంపిక జరుగుతుంది.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*

విద్యారంగంలో అర్ధ శతాబ్దం ! విజయసాధనలో స్వర్ణోత్సవం !!



మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు
Founder & Managing Director



డా॥ మాదల సూర్యశేఖర్
M.B.B.S., M.B.A.,
Chief Executive Director



మాదల సుష్మ
MSIS., M.B.A.,
Executive Director



మాదల ప్రమీలారాణి
Founder



డా॥ మాదల రాజశేఖర్
M.B.B.S., M.S. (Ortho)
Director



డా॥ మాదల నీలిమ
M.B.B.S.,
Director

ESTD : 1975

• LKG to Intermediate - State Syllabus • LKG to +1 & +2 CBSE Syllabus • Co-education • Residential School & College

SRI VISWASANTHI
EDUCATIONAL INSTITUTIONS
STATE & CBSE

• Recognised by Govt. of A.P.
• Affiliated to B.I.E., A.P.

• Affiliated to CBSE, Delhi.

LKG to 10th, Inter (MPC & BiPC) | LKG to X & XI, XII (PCM & PCB)

IIT & Medical Foundation from VI to X Classes

Separate Sections & Hostel for...BOYS & GIRLS

A.C. CAMPUS

NCC "A" & "B" Certificates

VUYYURU (Near Vijayawada), Krishna Dt., ANDHRA PRADESH.

Cell : 99 48 98 4444, 913 331 8502, 924 745 6148, 99 12 77 5666, 833 300 0899.

Web Site : www.sriviswasanthischools.in E - mail Id : director.sriviswasanthi@gmail.com

ADMISSIONS ARE IN PROGRESS

SINGLE CAMPUS with Limited Strength

పచ్చని చక్కటి గ్రామీణ వాతావరణంలో, 80 ఎకరాల స్థలములో, విశాలమైన భవనాలు, 20 ఎకరాల ఆటస్థలము, అత్యంత అర్హత, అనుభవము, అంకిత భావముగల అధ్యాపక బృందముతో ఎక్కడా బ్రాంచీలు లేకుండా, మేనేజ్‌మెంట్ 50 సం॥ల నుండి క్యాంపస్‌లోనే ఉంటూ... అతి సాధారణ విద్యార్థిని కూడా అసాధారణ విద్యార్థిగా తీర్చిదిద్దుతూ, రాష్ట్రస్థాయిలో మరియు జాతీయస్థాయిలో 50 సం॥లుగా అద్భుత ఫలితాలు సాధిస్తున్నది **"శ్రీ విశ్వశాంతి"**

శ్రీ విశ్వశాంతి రెసిడెన్షియల్ స్కూల్ - స్టేట్ సిలబస్

LKG నుండి **10**వ తరగతి వరకు. భవిష్యత్తులో ఎటువంటి పోటీ పరీక్షనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలనే లక్ష్యంతో...
6వ తరగతి నుండి **10**వ తరగతి వరకు రెగ్యులర్ సిలబస్‌తోపాటు **IIT & NEET Foundation**లో... **Special Teachers**చే **Selected Students**కి ప్రత్యేక శిక్షణ. ప్రతి విద్యార్థి మీద వ్యక్తిగత శ్రద్ధ. **♦ State Levelలో టాప్ ర్యాంక్స్ సాధిస్తున్న విద్యాసంస్థ శ్రీ విశ్వశాంతి.**

శ్రీ విశ్వశాంతి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజి - స్టేట్ సిలబస్

MPC, BiPCలలో **IIT-JEE Main, Advanced, Eamcet, NEET**లలో **IPE**తో పాటు అత్యంత అనుభవముగల సూపర్ సీనియర్ లెక్చరర్స్‌చే **Limited Students**తో **Personal Supervision**తో ప్రత్యేక శిక్షణ ఇస్తూ... **State Level & All India Level**లో టాప్ ర్యాంక్స్ సాధిస్తున్నాము.
♦ అత్యంత ప్రతిభగల విద్యార్థులకు ఇంటర్‌లో చేరుటకు మెరిట్ స్కాలర్‌షిప్స్ ఇస్తున్నాము.

శ్రీ విశ్వశాంతి CBSE రెసిడెన్షియల్ స్కూల్

LKG నుండి **10**వ తరగతి వరకు ఆంధ్ర, తెలంగాణ నుండే కాకుండా భారతదేశములోని **16** రాష్ట్రాల నుండి విద్యార్థులు.
రెగ్యులర్ **CBSE** సిలబస్‌తోపాటు **6th** నుండి **10th** వరకు **Selected Students**కి **IIT & NEET Foundation**లో ప్రత్యేక టీచర్స్‌తో ప్రత్యేకశిక్షణ.
♦ All India Levelలో Top Ranks సాధిస్తున్న స్కూల్ "శ్రీ విశ్వశాంతి".

శ్రీ విశ్వశాంతి CBSE సీనియర్ సెకండరీ రెసిడెన్షియల్ స్కూల్

XI & XII Classes (+1, +2) PCM, PCBలలో రెగ్యులర్ సిలబస్‌తోపాటు **Day 1** నుంచి **IIT-JEE Main, Advanced & NEET**లలో **Super Senior Lecturers**చే ప్రత్యేక కోచింగ్ ఇస్తూ... **All India Level**లో **Top Ranks** సాధిస్తున్నాము.
♦ CBSE +1లో చేరుటకు మెరిట్ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ ఇస్తున్నాము.

నోట్ : సొంత డైరీఫామ్ కలిగి విద్యార్థినీ విద్యార్థులకు పుష్టికరమైన ఆహారము అందిస్తూ, ఆరోగ్యము మీద ప్రత్యేక శ్రద్ధ. **Sports, Games & Other Activities**కు అత్యంత ప్రాధాన్యత. **Karate, Yoga, Skating, Scouts, NCC, Cricket, Hand Ball, Basket Ball, Volley Ball, Ball Badminton, Kho-Kho, Kabaddi, Athletics etc...** **అధునాతన కంప్యూటర్ ల్యాబ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ల్యాబ్స్, లైబ్రరీ కలిగియున్న సంస్థ.**

MPC, BiPCలలో **IIT-JEE Main, Advanced, Eamcet, NEET**లలో **IPE**తో పాటు అత్యంత అనుభవముగల సూపర్ సీనియర్ లెక్చరర్స్‌చే **Limited Students**తో **Personal Supervision**తో ప్రత్యేక శిక్షణ ఇస్తూ... **State Level & All India Level**లో టాప్ ర్యాంక్స్ సాధిస్తున్నాము.

అత్యంత ప్రతిభగల విద్యార్థులకు ఇంటర్‌లో చేరుటకు మెరిట్ స్కాలర్‌షిప్స్ ఇస్తున్నాము.

SRI VISWASANTHI EDUCATIONAL INSTITUTIONS · EDUCATION · DISCIPLINE · ESTD : 1975, VUYYURU

ఇంటర్‌లో చేరుటకు మెరిట్ స్కాలర్ షిప్

590 కంటే ఎక్కువ	మార్కులు సాధించిన విద్యార్థులకు	1,00,000/- లు
580 - 589	మార్కులు సాధించిన విద్యార్థులకు	50,000/- లు
570 - 579	మార్కులు సాధించిన విద్యార్థులకు	25,000/- లు
560 - 569	మార్కులు సాధించిన విద్యార్థులకు	10,000/- లు

50 Golden Jubilee

designed by : Thilak - 984 836 3105

50 సంవత్సరాల శ్రీవిశ్వశాంతి సుదీర్ఘ ప్రయాణంలో... లక్షలాది మంది విద్యార్థులు మా వద్ద చదువుకుని, వేలాది మంది విద్యార్థులు దేశ విదేశాలలో స్థిరపడి, అత్యుత్తమ స్థాయిలో ఉండటం మా విద్యాసంస్థకు ఎంతో గర్వకారణం.